

'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 196

శనివారం 1-4-2023




గుజరాత్ ఘనంగా..
ఐపీఎల్ తొలి మ్యాచ్‌లో చెన్నైపై 5 వికెట్ల తేడాతో విజయం - 13లో



లాభాల వీడ్కోలు..!
సెన్సెక్స్ 1,031 పాయింట్లు.. నిఫ్టీ 279 పాయింట్ల లాభం - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సిసోడియానే సూత్రధారి
ఢిల్లీ మద్యం కేసులో ఆప్ నేత సిసోడియా బెయిల్ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఆయనే సూత్రధారి అని అభిప్రాయపడింది.
వివరాలు 6లో ▸



36కు చేరిన మరణాలు
ఇండోర్‌లోని బేలేశ్వర్ మహాదేవ్ ఝులేలాల్ ఆలయంలో మెట్ల బావి పైకప్పు కూలిన ఘటనలో మృతుల సంఖ్య 36కు చేరుకుంది.
వివరాలు 6లో ▸



నేడే సిద్ధూ విడుదల!
దాడి కేసులో జైలులో ఉన్న కాంగ్రెస్ నేత, మాజీ క్రికెటర్ నవజోత్ సింగ్ సిద్ధూ శనివారం విడుదల కానున్నట్లు సమాచారం.
వివరాలు 6లో ▸



రిచర్డ్ వర్మకు సహాయ మంత్రి
అమెరికా విదేశాంగ శాఖ డిప్యూటీ సెక్రెటరీగా భారతీయ అమెరికన్ రిచర్డ్ వర్మకు కీలక పదవి దక్కింది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

మూడు రాజధానుల దీక్షా శిబిరంపై దాడి



అమరావతి శిబిరంలో సీఎం జగన్‌పై మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై.. నిరసన తెలిపిన బహుజన పరిరక్షణ సమితి నాయకులు, కార్యకర్తలపై బీజేపీ ముసుగులోని టీడీపీ మాజీ మంత్రి అనుచరులు దాడులకు తెగబడ్డారు. దీనిని బీజేపీ, వైఎస్సార్‌సీపీ మధ్య ఘర్షణగా చిత్రీకరిస్తూ టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు,పవన్ రాజకీయ డ్రామాకు తెరతీశారు.
వివరాలు 2 ▸

ఒంటిమిట్టలో వేడుకగా ధ్వజారోహణ



వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. ధ్వజస్తంభానికి నవకళ పంచామృతాభిషేకం చేసి సకల దేవతలు, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.
వివరాలు 5 ▸

నాసా 'మూన్ టు మార్స్' చీఫ్‌గా మనోడు



అమెరికా అంతరిక్ష సంస్థ నాసా కొత్తగా ఏర్పాటు చేసిన 'మూన్ టు మార్స్' కార్యక్రమం హెడ్‌గా భారత సంతతికి చెందిన అమిత్ క్షత్రియ నియమితులయ్యారు. తక్షణమే ఈ నియామకం అమల్లోకి వస్తుందని నాసా ప్రకటించింది.
వివరాలు 6 ▸

మోదీ సర్టిఫికెట్లు బయటపెట్టాల్సిన

అవసరం లేదు

- గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు
- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు రూ.25,000 జరిమానా.. ప్రధాని విద్యార్హతలను తెలుసుకొనే హక్కు ప్రజలకు లేదా?: కేజ్రీవాల్ ప్రశ్న

6 లో

తన్నారు... తిన్నారు



చంద్రబాబు హయాంలో ఎమ్మార్వో వనజాక్షిపై దాడి చేస్తున్న నాటి టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చౌదరి

టీడీపీ హయాంలో ఇసుక దందాకు అడ్డొచ్చిన వారిపై దౌర్జన్యాలకూ వెనకాడని చంద్రబాబు ముఠా

- పేరుకు ఉచితం... టీడీపీ నేతలదే రాజ్యం... రూ. వేల కోట్లు బాబు గ్యాంగ్ జేబుల్లోకే
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఏటా ఇసుకపై ప్రభుత్వానికి రూ.765 కోట్ల ఆదాయం
- ఐదేళ్లలో ప్రభుత్వానికి రూ.4 వేల కోట్లు... అయినా దోపిడీ అంటూ 'ఈనాడు' విషం
- ప్రభుత్వానికి పైసా రాకుండా బాబు తినేసినా.. అదో మహా యజ్ఞమని ప్రశంసలు
- ఇప్పుడు ప్రభుత్వానికి వస్తున్న రూ.4 వేల కోట్లు... అపుడు దోచుకో– పంచుకో– తినుకో
- పోలవరం కోసం రాష్ట్ర హోదాను తాకట్టు.. పనులేమో రామోజీ వియ్యంకుడికి డీపీటీ
- మార్గదర్శిలో చట్ట విరుద్ధంగా డిపాజిట్లు... వేల కోట్లు అక్రమంగా మళ్లింపు
- రూ.2 వేల కోట్లు ఫైన్ కట్టాల్సినపుడు తప్పించుకోవటానికి ఫైనాన్స్ కంపెనీ మూసివేత
- ఇన్ని చేసినా ఒక్క విమర్శా చేయని బాబు... సీఎం అయ్యాక కూడా చర్యలు శూన్యం
- నిర్మాణ కాంట్రాక్టులిచ్చిన షాపుర్జీ పల్లోంజీ సంస్థ నుంచి బాబుకు వందల కోట్ల లంచం
- షెల్ కంపెనీల ద్వారా ప్రవహించిన ముడుపులు... రామోజీ తనయుడి వియ్యంకుడికీ వాటా
- ముడుపులివ్వకపోతే సంగతి చూస్తామని బెదిరించిన బాబు పీఏ శ్రీనివాస్
- ఈ వ్యవహారాన్ని అప్రయిజల్ రిపోర్టులో తెలియజేసిన ఆదాయపు పన్ను శాఖ
- స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో సీమెన్స్‌కు సంబంధమే లేకుండా దాని పేరిట స్కీమ్
- అడ్వాన్సు పేరిట నిధులు విడుదల చేసి... ఆ మొత్తాన్ని మింగేసిన బాబు ముఠా
- ఇన్ని చేసినా బాబుకు వ్యతిరేకంగా ఒక్క అక్షరం కూడా రాయని 'ఈనాడు'
- ఏమీ లేకున్నా అబద్ధాలు పోగేస్తూ వైఎస్ జగన్ సర్కారుపై వ్యతిరేక కథనాలు

4 లో



ఏది నిజం?

భూముల రీసర్వే అత్యంత ప్రాధాన్యం

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకంపై సమీక్షలో సీఎం వైఎస్ జగన్



- ఇది ప్రజలకు ఎంతో ఉపయోగకరం
- ఎవరూ టాంపర్ చేయలేని విధంగా భూ హక్కు పత్రాలు
- నిర్దేశించిన లక్ష్యాల మేరకు సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి
- ప్రతి గ్రామ సచివాలయంలో క్రమంగా సర్వే పరికరాలు
- మున్సిపల్ ప్రాంతాల్లో సర్వే కోసం సన్నాహాలు

"మే 20 నాటికి సర్వే రాళ్లు వేసే పని పూర్తి చేయాలి. రీ సర్వే కోసం రోవర్‌తోపాటు ఇతర పరికరాలు క్రమంగా ప్రతి గ్రామ సచివాలయంలోనూ ఉండేలా చూసుకోవాలి. అందుబాటులో ఉన్న సాంకేతికతనూ ఉపయోగించుకోవాలి. దీనివల్ల సర్వేయర్ పూర్తి స్థాయిలో తన పని పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. తద్వారా అనుకున్న సమయానికే సర్వే ప్రక్రియ పూర్తవుతుంది. భవిష్యత్ తరాల వారికి కూడా ఇది చాలా ఉపయోగకరం కాబట్టి ప్రత్యేకంగా దృష్టి సారించాలి." - సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద స్థాయిలో భూముల రీ సర్వే చేపట్టడం లేదని తెలిపారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఈ పథకంపై రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, గనుల శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూముల రీ సర్వే ప్రజలకు అత్యంత ఉపయోగకరమైన కార్యక్రమమని తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో

మిగతా 2వ పేజీలో ▶

ముగిసిన జీ20 సదస్సు

విశాఖలో 4 రోజులు కొనసాగిన సమావేశాలు

- హాజరైన దేశ విదేశీ ప్రతినిధులు
- చివరిరోజు సదస్సుకు దేశవ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్ల రాక



విశాఖపట్నంలో జరిగిన జీ20 సదస్సులో ప్రసంగిస్తున్న సింగపూర్ ప్రతినిధి

సాక్షి, విశాఖపట్నం: విశాఖ వేదికగా మార్చి 28 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించిన జీ 20 దేశాల రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూపు (ఐడబ్ల్యూజీ) సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఇండియా ప్రెసిడెన్సీ ఆధ్వర్యంలో 'రేపటి ఆర్థిక నగరాలు – అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన అవకాశాలు'పై ప్రధానంగా సదస్సు జరిగింది. 14 సభ్య దేశాలు, ఎనిమిది అతిథి దేశాలు, పది అంతర్జాతీయ సంస్థలకు చెందిన 57 మంది ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. యూఎన్‌డీపీ, ఓఈసీడీ, ఐఎంఎఫ్, వరల్డ్ బ్యాంకు, ఏడీబీ, ఈబీఆర్‌డీ లాంటి అంతర్జాతీయ సంస్థల నిపుణులు పాల్గొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి సాల్మన్ ఆరోఖ్యరాజ్ సదస్సుకు అధ్యక్షత వహించారు. నగరాలను ఆర్థిక కేంద్రాలుగా తీర్చిదిద్దడం, పట్టణ మౌలిక సదుపాయాలు, ప్రైవేట్ రంగంలో పెట్టుబడులను పెంచడంపై సదస్సులో చర్చించారు. రెండో రోజు సాగర తీరంలో యోగా, ధ్యానంతో పాటు పౌష్టికాహార వినియోగంపై నిపుణులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్వాలిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ (క్యూఐఐ) సూచికల అన్వేషణ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యయంపై డేటాను క్రోడీకరించడంపై సమగ్రంగా చర్చించారు. మూడో రోజు కెపాసిటీ బిల్డింగ్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. కొరియా, సింగపూర్‌లకు చెందిన నిపుణులు

మిగతా 3వ పేజీలో ▶

ఆత్మీయ ఆతిథ్యం..

విశాఖలో తొలిసారిగా జరిగిన జీ 20 సదస్సును రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించింది. దేశ విదేశాల నుంచి అతిథులు హాజరైన నేపథ్యంలో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దింది. 2,500 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు కల్పించింది. ఆంధ్రా, భారతీయ వంటకాలను వడ్డించడంతోపాటు తెలుగు సంప్రదాయ పద్ధతుల్లో ఆత్మీయ స్వాగతం పలికింది. తెలుగు వైభవాన్ని చాటేలా సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



బెంగళూరులో దారుణం

నడుస్తున్న కార్లో గ్యాంగ్ రేప్

బెంగళూరులో అమానవీయ ఘటన జరిగింది. రాత్రి 9.30 గంటల సమయంలో స్నేహితుడితో మాట్లాడుతున్న యువతిని నలుగురు కామాంధులు కిడ్నాప్ చేసి.. కారులో తిప్పుతూ దాదాపు 4 గంటల పాటు అత్యాచారానికి ఒడిగట్టారు. అనంతరం రోడ్డు పక్కనే పడేసి వెళ్లిపోయారు. తల్లి, స్నేహితుల సాయంతో ఆస్పత్రిలో చేరిన యువతి.. రెండు రోజుల చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో దర్యాప్తు చేపట్టిన బెంగళూరు కోరమంగళ పోలీసులు సతీశ్, విజయ్, శ్రీధర్, కిరణ్ అనే నలుగురు నిందితులనూ అరెస్టు చేశారు.

- వివరాలు 6లో

ముద్దాయి డొనాల్డ్ ట్రంప్

అనైతిక ఒప్పందం కేసు నమోదు చేసిన న్యూయార్క్ గ్రాండ్ జ్యూరీ

క్రిమినల్ కేసులో విచారణ ఎదుర్కోనున్న తొలి అమెరికా మాజీ అధ్యక్షుడు

- పోర్న్ స్టార్ డేనియెల్‌కు డబ్బులిచ్చి అనైతిక ఒప్పందం కేసు
- న్యాయవ్యవస్థని ఆయుధంగా వాడుకుంటున్నారన్న ట్రంప్
- అరెస్టయితే ట్రంప్ భవిష్యత్ ఏమిటని చర్చోపచర్చలు

6 లో



అమెరికా చరిత్రలో రాజకీయంగా మరో పెను సంచలనం.. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అరెస్టయ్యే అవకాశాలున్నాయి. పోర్న్‌స్టార్ స్మార్టీ డేనియెల్‌తోనున్న లైంగిక సంబంధాలు బయట పెట్టకుండా ఉండేందుకు ఆమెకు డబ్బులు చెల్లించి అనైతిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారన్న ఆరోపణల కేసులో ఆయనపై అభియోగాలు నమోదయ్యాయి. న్యూయార్క్‌లోని మన్‌హట్టన్ గ్రాండ్ జ్యూరీ నేరాభియోగాలు నమోదు చేసినట్టుగా ధ్రువీకరించింది. ట్రంప్ లాయర్లతో కేసు విచారణను పర్యవేక్షిస్తున్న మన్‌హట్టన్ అటార్నీ జనరల్ అల్విన్ బ్రాగ్.. ట్రంప్ లొంగిపోవడానికి సహరించాలని సూచించారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో పోటీచేసి మరోసారి వైట్‌హౌస్‌లోకి అడుగుపెట్టాలని కలలు కంటున్న వేళ నేరాభియోగాలు నమోదు కావడం నైతికంగా ట్రంప్‌కు ఎదురుదెబ్బ తగిలినట్టయింది. 2016 అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ తనతో ఉన్న లైంగిక సంబంధాలను బయటపెట్టకుండా ఉండేందుకు పోర్న్‌స్టార్ స్మార్టీ డేనియెల్‌ను డబ్బులిచ్చి ప్రలోభ పెట్టారనే ఆరోపణలొచ్చిన విషయం తెలిసిందే.

> రాజకీయంగా నన్ను అణిచివేయడానికి డెమొక్రాట్లు ఈ కుట్రకు పాల్పడ్డారు. అధ్యక్షుడు బైడెన్ ఏం చెబితే మన్‌హట్టన్ జ్యూరీ అదే చేస్తోంది - డొనాల్డ్ ట్రంప్

ఇంకుజెట్



... ఏ గోల లేకుండా హాయిగా ఉంది సార్!

రహదారులకు మహర్దశ

ఎన్‌హెచ్‌ల నిర్మాణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థత



- రికార్డు స్థాయిలో నిధులు మంజూరు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- యూపీ తరువాత ఏపీకే అత్యధికంగా నిధులు
- 2022–23 వార్షిక ప్రణాళికలో రూ.12,130 కోట్లు మంజూరు.. నాలుగేళ్లలో సాధించిన నిధులు రూ.23,471.92 కోట్లు
- నాడు ఐదేళ్లలో టీడీపీ తెచ్చింది రూ.10,660 కోట్లే
- కేంద్రంలో భాగస్వామిగా ఉన్నా నాడు అరకొర కేటాయింపులే

3 లో

భూ'సారం' కనిపెట్టేలా

ఏప్రిల్ 3 నుంచి రైతు క్షేత్రాల్లో ఉచితంగా మట్టి పరీక్షలు.. ఆర్బీకేల ద్వారా నమూనాల సేకరణ

- వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లలో పరీక్షలు
- ప్రతీ ల్యాబ్ పరిధిలో రోజూ 50 నమూనాల విశ్లేషణ
- 24 గంటల్లోనే ఫలితాలు.. మొబైల్‌లో రైతులకు సమాచారం
- ఖరీఫ్‌లో 3.22 లక్షలు, రబీలో మరో 1.15 లక్షలకుపైగా నమూనాల సేకరణ
- ప్రతి రైతుకు వ్యక్తిగతంగా భూసార పరీక్షా కార్డులు
- సిఫార్సుల మేరకు ఎరువులు వినియోగించేలా ఆర్బీకేల ద్వారా అవగాహన



రైతు క్షేత్రంలో మట్టి నమూనా సేకరిస్తున్న దృశ్యం

సాక్షి, అమరావతి: ఆశించిన రీతిలో పంటలు పండాలంటే మేలైన విత్తనం, మంచి వాతావరణం, సాగునీటి వనరులు ఎంత అవసరమో సారవంతమైన నేల కూడా అంతే అవసరం. తగిన రీతిలో పోషకాలు, ఎరువులు అందిస్తూ సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు. మూడేళ్లుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో మంచి దిగుబడులు సాధిస్తున్న రైతులకు మరింత చేయూతనిచ్చేలా సామూహిక భూసార పరీక్షలను ఉచితంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఎన్నో లాభాలు

భూసార పరీక్షల వల్ల మట్టిలో ఏ లోపం ఉందో గుర్తించవచ్చు. భూమిలో ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. కావాల్సిన పోషకాలు అందించడంతో పాటు సిఫార్సు చేసిన ఎరువులను తగిన మోతాదులో వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చు. ఆరోగ్యకరమైన పంటలు పండిస్తూ ఆశించిన దిగుబడులు సాధించవచ్చు.

మట్టి పరీక్షల కోసం మొబైల్ యాప్

రాష్ట్రవ్యాప్తంగా ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలో రైతు క్షేత్రాల నుంచి మట్టి నమూనాల సేకరణకు

మిగతా 10వ పేజీలో ▶

3న 'జగనన్నే మా భవిష్యత్'పై సమీక్ష

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఈ నెల 3వ తేదీన జగనన్నే మా భవిష్యత్, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలపై సమీక్షా సమావేశం జరుగుతుందని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి శాసనసభ్యులు, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, జేసీఎస్(జగనన్న సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు) రాష్ట్ర కోఆర్డినేటర్లు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, రీజనల్ కో ఆర్డినేటర్లు తప్పకుండా హాజరుకావాలని సూచించింది.

అనాథ శరణాలయాల్లో విజిలెన్స్ తనిఖీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అనాథశరణాలయాలు, వివిధ కేటగిరీలకు చెందిన పునరావాస కేంద్రాల్లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 26జిల్లాల్లోని 62 అనాథశరణాలయాలు, పునరావాస కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించినట్లు విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ తనిఖీల్లో పలు నిర్వహణ లోపాలను అధికారులు గుర్తించారు. పలుచోట్ల వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. అగ్నిమాపక పరికరాలు, సీసీ టీవీ కెమెరాలు లేవని గుర్తించారు. వంటగదులు, టాయిలెట్లు సక్రమంగా నిర్వహించడం లేదని, రక్షణ గోడలు నిర్మించలేదని గుర్తించినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. మొత్తం 16 రకాల నిర్వహణ లోపాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు వివరించారు.

9, 10 తేదీల్లో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : ఈ నెల 9, 10 తేదీల్లో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలను తిరుమల తిరుపతిలో నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. మంత్రి కొట్టు మాట్లాడుతూ శ్రీశ్రీ కళావేదిక, చేజర్ల ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. 48 గంటల పాటు నిర్విరామంగా ఈ బ్రహ్మోత్సవాలు చేస్తారని చెప్పారు. కార్యక్రమానికి అంతర్జాతీయ గుర్తింపు రావాలని మంత్రి కొట్టు అభిలషించారు.

గ్రామ సర్వేయర్ గ్రేడ్ల పునర్వ్యవస్థీకరణ

- 3 గ్రేడ్ల నుంచి 2 గ్రేడ్లుగా మార్పు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు

సాక్షి, అమరావతి: గ్రామ సచివాలయ సర్వేయర్లకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారు కోరుతున్న విధంగా సర్వేయర్ల గ్రేడ్లను పునర్వ్యవస్థీకరిస్తూ శుక్రవారం జీవో జారీ చేసింది. ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినప్పుడు గ్రామ సర్వేయర్ గ్రేడ్ -1, గ్రేడ్ -2, గ్రేడ్ -3 పోస్టులను కొత్తగా సృష్టించింది. ఇలా 3 గ్రేడ్లుగా విభజించడం వల్ల పదోన్నతులు ఆలస్యమవుతున్నాయని, 2 గ్రేడ్లుగా పునర్వ్యవస్థీకరించాలని ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, ఏపీ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరారు. వారి వినతిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించారు. అందుకనుగుణంగా ఉత్తర్వులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శుక్రవారం జీవో ఎంఎస్ నెంబర్ 161 జారీ చేశారు. దీని ద్వారా గ్రామ సర్వేయర్లను రెండు గ్రేడ్లుగా పునర్వ్యవస్థీకరించారు. దీంతో గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్ -3 గ్రామ సర్వేయర్లు గ్రేడ్-2 సర్వేయర్లుగా మారతారు. గ్రామ సర్వేయర్ల గ్రేడ్‌లను తగ్గించి పదోన్నతుల అవకాశాలు మెరుగుపరిచిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కె. వెంకట్రామిరెడ్డి తెలిపారు. గ్రామ సర్వేయర్లకు మేలు చేకూర్చడం పట్ల ఏపీ సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిరంజీవిరావు, సలహాదారు రౌతు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆడారి ఆనంద్ బాధ్యతల స్వీకారం

కొత్త పాలసీలో ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు: మంత్రి అమర్‌నాథ్



ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న ఆనంద్‌కుమార్. పక్కన మంత్రి అమర్‌నాథ్ తదితరులు

సాక్షి, అమరావతి/మధురానగర్(విజయవాడసెంట్రల్): ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆడారి ఆనంద్ కుమార్ శుక్రవారం విజయవాడలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో 25 ఎంఎస్ఎంఈ క్లస్టర్ల నిర్మాణానికి కేంద్రానికి సిఫార్సు చేస్తూ తొలి ఫైల్‌పై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ జి.సృజన, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొని ఆనంద్ కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ.. అత్యధిక మందికి ఉపాధి కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా నూతన పారిశ్రామిక విధానంలో ఈ పరిశ్రమలకు పలు ప్రోత్సాహకాలను ప్రకటించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో రెండు ఎంఎస్ఎంఈ క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5 ఎంఎస్ఎంఈ క్లస్టర్లు నిర్మాణంలో ఉన్నాయని, త్వరలో మిగిలిన క్లస్టర్ల నిర్మాణం చేపడతామని తెలిపారు.

'మార్గదర్శి' డాక్యుమెంట్లే సీజ్

- ఇతర ఏ సంస్థ వివరాలూ మావద్ద లేవు
- నాంపల్లి మేజిస్ట్రేట్ కూడా దీన్ని ధ్రువీకరించారు
- తనిఖీలు ముగిసినందున పిటిషన్‌ను కొట్టివేయాలి
- తెలంగాణ హైకోర్టుకు నివేదించిన ఏపీ ప్రభుత్వం
- బ్రహ్మయ్య అండ్ కో పిటిషన్‌పై విచారణ 13కి వాయిదా



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్ ఫండ్స్, అనుబంధ సంస్థల డేటా మినహా మరే ఇతర సంస్థలకు చెందిన డేటా తాము సీజ్ చేసిన డాక్యుమెంట్లలో లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. సీజ్ చేసిన డాక్యుమెంట్ల జాబితాపై నాంపల్లి 14వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సంతకం చేశారని, ఆ కాపీని కోర్టుకు కూడా సమర్పించామని తెలిపింది. ఎలాంటి ఆధారాలు లేకుండా, విచారణను జాప్యం చేసేందుకే పిటిషనర్ ఆరోపణలు చేస్తున్నారని స్పష్టం చేసింది. తమ సంస్థలో తనిఖీలు చేపట్టడాన్ని సవాల్ చేస్తూ బ్రహ్మయ్య అండ్ కో, పెద్ది చంద్రమౌళి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. దీనిపై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున స్పెషల్ కౌన్సిల్ పి.గోవింద్‌రెడ్డి వాదనలు వినిపించారు. 1973 సీఆర్‌పీసీ సెక్షన్ 165, 166 కింద స్థానిక మేజిస్ట్రేట్ అనుమతి తీసుకుని తనిఖీ ప్రక్రియ నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటికే తనిఖీ ప్రక్రియ ముగిసిందని, సేకరించిన డాక్యుమెంట్లు ఇతర సామగ్రిని నాంపల్లి మేజిస్ట్రేట్ ఎదుట ఉంచినట్లు వెల్లడించారు.

తనిఖీలు ఆపాలని మాత్రమే కోరారు..

'మార్గదర్శిపై పలు ఆరోపణలున్నాయి. చిట్స్ ద్వారా వచ్చిన నగదును షేర్‌మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్స్‌కు మళ్లిస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ. ప్రధాన కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. ఇది బడా వైట్ కాలర్ నేరం. సంస్థకు చెందిన పలు కార్యాలయాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. బ్రహ్మయ్య అండ్ కో కార్యాలయ తనిఖీల్లో మాత్రం పోలీసులు పాల్గొన్నారు. ప్రధాన కేసు విచారణ సందర్భంగా పలు డాక్యుమెంట్లను అధికారులు అడిగారు. మార్గదర్శి చార్టెడ్ అకౌంటెంట్‌గా వ్యవహరిస్తున్న బ్రహ్మయ్య అండ్ కో వాటిని ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంతో పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. తనిఖీలు ఆపాలని మాత్రమే పిటిషనర్ కోరారు. అవి ఎప్పుడో ముగిశాయి కనుక పిటిషన్‌ను కొట్టివేయాలి' అని గోవిందరెడ్డి కోర్టుకు నివేదించారు.

ప్రత్యేకంగా విచారణ ఎందుకు?

'మార్గదర్శి చిట్స్‌కు సంబంధించి కోర్టు విధుల సమయం ముగిసిన తర్వాత కూడా ప్రత్యేకంగా విచారణ జరపాల్సిన అవసరం ఏమొచ్చింది? సామాన్యుడికి ఏదైనా ప్రాణం మీదకు వస్తే కోర్టు ఇలాగే వ్యవహరిస్తుందా..? ఇది ఎంత వరకు సమంజసమో ఆలోచించాల్సిన అవసరం ఉంది. లంచ్‌మోషన్ పిటిషన్‌లు వేయడం, కోర్టు విధులు ముగిసిన తర్వాత అత్యవసరంగా విచారణ జరిపి ఉత్తర్వులు పొందడం ద్వారా మార్గదర్శికో నీతి – సామాన్యుడికో నీతి అనే అభిప్రాయం నెలకొనే అవకాశం ఉంది' అని విచారణ సందర్భంగా స్పెషల్ కౌన్సిల్ పి.గోవింద్‌రెడ్డి న్యాయస్థానానికి నివేదించారు. వాదనల అనంతరం కౌంటర్ దాఖలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను న్యాయమూర్తి ఏప్రిల్ 13వతేదీకి వాయిదా వేశారు.

తనిఖీలు ముగిశాక విచారణా?

తనిఖీలు ముగిసిన తర్వాత వాటిని ఆపాలన్న విజ్ఞప్తిపై ఇక విచారణ ఎలా కొనసాగిస్తామని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది నళినీకుమార్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. ఆ పిటిషన్‌లో ఇంటర్‌లొక్యుటరీ అప్లికేషన్(ఐఏ) దాఖలు చేశామని నళినీకుమార్ నివేదించారు.

మూడు రాజధానుల దీక్షా శిబిరంపై దాడి

- సీఎం జగన్‌పై మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి అనుచిత వ్యాఖ్యలు
- వాటిని వ్యతిరేకిస్తూ బహుజన పరిరక్షణ సమితి నేతల నిరసన
- శిబిరంపై విరుచుకుపడ్డ మాజీ మంత్రి అనుచరులు
- మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని లాగేసిన వైనం
- ఈ గొడవను వైఎస్సార్‌సీపీ, బీజేపీ మధ్య ఘర్షణగా చిత్రీకరించేందుకు బాబు, పవన్‌ల యత్నం
- చంద్రబాబు డైరెక్షన్ మేరకే దాడి : ఎంపీ నందిగం సురేష్
- బహుజనులు నా పేరే ప్రస్తావించలేదు : బీజేపీ నేత సత్యకుమార్
- ఘటనపై కేసు నమోదు : ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్




దీక్షాశిబిరం వద్ద రెచ్చగొడుతున్న ఆదినారాయణరెడ్డి అనుచరులు. బహుజననేతలపై దాడులుచేస్తున్న ఆదినారాయణరెడ్డి అనుచరులు, టీడీపీ నేతలు



దాడికి నిరసనగా రోడ్డుపై బైఠాయించిన బహుజన పరిరక్షణ సమితి నేతలు



మాట్లాడుతున్న ఎంపీ సురేష్

తాడికొండ/సాక్షి, అమరావతి : అమరావతి దీక్ష శిబిరంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై మూడు రాజధానుల శిబిరం వద్ద నిరసన తెలిపిన బహుజన పరిరక్షణ సమితి నాయకులు, కార్యకర్తలపై బీజేపీ ముసుగులోని టీడీపీ మాజీ మంత్రి అనుచరులు విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. ఈ దాడులను బీజేపీ, వైఎస్సార్‌సీపీ మధ్య చోటుచేసుకున్న ఘర్షణగా చిత్రీకరిస్తూ టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు రాజకీయ డ్రామాకు తెరతీశారు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆదినారాయణరెడ్డిని నాటి సీఎం చంద్రబాబు టీడీపీలోకి లాక్కుని.. మంత్రివర్గంలో స్థానం కల్పించారు. 2019లో అధికారం కోల్పోగానే చంద్రబాబు కనుసైగల మేరకే ఆదినారాయణరెడ్డి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అమరావతి దీక్షలు 1200వ రోజుకు చేరుకున్న సందర్భంగా శుక్రవారం మందడంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు ఆదినారాయణరెడ్డి.. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌తో కలిసి వెళ్లారు. ఆ శిబిరంలో సీఎం జగన్‌పై ఆదినారాయణరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ విషయం తాళ్లాయపాలెం జంక్షన్‌లోని మూడు రాజధానుల శిబిరంలో 915వ రోజు దీక్షలు చేస్తున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు, కార్యకర్తలకు తెలిసింది. కాసేపటి తర్వాత ఆదినారాయణరెడ్డి, సత్యకుమార్, వారి అనుచరులు విజయవాడకు బయలుదేరారు. వారి వాహన శ్రేణి మూడు రాజధానుల శిబిరం వద్దకు చేరుకోగానే.. బహుజన పరిరక్షణ సమితి నాయకులు రోడ్డు పక్కన నిల్చొని శాంతియుతంగా నిరసన తెలిపారు. ఆదినారాయణరెడ్డి డౌన్ డౌన్.. అమరావతి వద్దు.. మూడు రాజధానులే ముద్దు.. అంటూ నినదించడంతో ఆదినారాయణరెడ్డి అనుచరులు వారిపై విచక్షణా రహితంగా దాడులకు దిగారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళలపై విరుచుకు పడ్డారు. మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని లాగారు. వారు ప్రతిఘటించడానికి సిద్ధమవుతుండగా.. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘటనకు కారణమైన ప్రతిపక్ష నేత చంద్రబాబు, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, బొలిమేర శామ్యూల్, కారుమూరి పుష్పరాజ్, ఇందుపల్లి సుభాషిణి, మల్లవరపు సుధారాణి, తదితరులు డిమాండ్ చేశారు. అనంతరం దీక్ష శిబిరాన్ని సందర్శించిన బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ.. మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి, ఆయన అనుచరులు, టీడీపీ నాయకులు శిబిరం వద్ద ఉన్న మహిళలను జుట్టు పట్టుకొని తన్నారని చెప్పారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఇదంతా జరిగిందన్నారు.

ఆదినారాయణరెడ్డి కోసమే..

మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి తీరుపై బహుజనులు నిరసన తెలపడంలో భాగంగానే ఈ సంఘటన జరిగిందని బీజేపీ కార్యదర్శి సత్యకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆ ఘటన సమయంలో 'నా పేరు ఎవరూ ఎత్తలేదు.. ఆదినారాయణరెడ్డి కోసమే ఆరా తీశారు. ఆయన నా కారు ఎక్కలేదు. ఉదయం నేను, ఆయన కలిసి వెళ్లాం. సభ నుంచి ఆయన కాస్త ముందుగా వచ్చారు. ఆ విషయం వారికి తెలియదు. ఎవరో నా కారుపై దాడి చేశారు' అని వివరించారు. కాగా, సత్యకుమార్ కారుపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని చెప్పారు. ఈ ఘటన గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ దాదాగిరీ పరాకాష్ఠకు చేరిందన్నారు.

అమరావతి రైతులపై 3,500 కేసులా?

అమరావతి రైతులపై 3,500 కేసులు నమోదు చేశారని, ఇదెక్కడ న్యాయమని మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు ఆదినారాయణరెడ్డి ప్రశ్నించారు. అమరావతి దీక్షలు 1200వ రోజుకు చేరిన సందర్భంగా తుళ్లూరు మండలం మందడంలోని దీక్షా శిబిరంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. అమరావతి రైతులకు లీగల్‌గా, పర్సనల్‌గా, పార్టీ పరంగా, టెక్నికల్‌గా అన్ని విధాలా సాయం చేస్తామని స్పష్టం చేశారు.

కేసు నమోదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఫిర్యాదుపై బీజేపీ నాయకుడు, మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ పులిపాటి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో వెంటనే జోక్యం చేసుకుని, నివారించామన్నారు. గుర్తు తెలియని వ్యక్తి బీజేపీ నేత సత్యకుమార్ వాహనంపై రాయి విసిరి పొలాల్లోకి పారిపోయాడని చెప్పారు. తమపై ఆదినారాయణరెడ్డి అనుచరులు దాడి చేశారంటూ మూడు రాజధానుల ఆందోళనకారులు ఫిర్యాదు ఇచ్చారని, ఈ ఘటనపై త్వరితగతిన దర్యాప్తు చేస్తామని తెలిపారు.

భూముల రీసర్వే అత్యంత ప్రాధాన్యం

▶ మొదటి పేజీ తరువాయి

ఎవరూ టాంపర్ చేయలేని విధంగా భూ యజమానులకు భూ హక్కు పత్రాలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం ఇప్పటి వారికే కాకుండా భవిష్యత్తు తరాల వారికి కూడా చాలా ఉపయోగమని తెలిపారు. నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు సర్వే ప్రక్రియను పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎక్కడా జాప్యానికి తావు లేకుండా కావాల్సిన సాంకేతిక పరికరాలను తెప్పించుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖ పరిధిలో తొలి దశలో చేపట్టిన 2 వేల గ్రామాల్లో సర్వే ప్రక్రియ గురించి అధికారులు సీఎంకు వివరించారు. ఇప్పటికే చాలా వరకు భూ హక్కుల పత్రాల పంపిణీ జరుగుతోందని తెలిపారు.

సర్వే రాళ్ల కొరత లేకుండా చూడాలి

సర్వే పూర్తయ్యాక సరిహద్దుల వద్ద వేసేందుకు 31 లక్షల సర్వే రాళ్లను సిద్ధం చేశామని అధికారులు సీఎంకు వివరించారు. రోజుకు 50 వేల సర్వే రాళ్ల చొప్పున సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. తర్వాత దశల్లో జరిగే సర్వే కోసం రాళ్ల కొరత రాకుండా ముందస్తుగానే సన్నాహాలు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ ప్రాంతాల్లో సర్వే కోసం సన్నాహాలు చేస్తున్నామని మున్సిపల్ శాఖ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి డేటా క్రోడీకరణ జరుగుతోందన్నారు. నిర్దేశించుకున్న టైమ్ లైన్స్ ప్రకారం కచ్చితంగా సర్వే పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఏప్రిల్ మూడో వారం నాటికి 300 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తవుతుందని పంచాయతీ రాజ్ శాఖాధికారులు తెలిపారు. డిసెంబర్‌లోగా మొత్తం అన్ని గ్రామాల్లో సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జి సాయిప్రసాద్, వై శ్రీలక్ష్మి, బుడితి రాజశేఖర్, రజత్ భార్గవ, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, సర్వే సెటిల్మెంట్ కమిషనర్ సిద్ధార్థ జైన్, భూ పరిపాలన అదనపు చీఫ్ కమిషనర్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

గుంటూరు వైద్య కళాశాలకు 19 పీజీ సీట్లు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలకు మరో 19 పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఇటీవల నాలుగు విభాగాల్లో 27 సీట్లను మంజూరు చేసిన నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ).. తాజాగా జనరల్ సర్జరీ విభాగంలో 19 సీట్లు మంజూరు చేసింది. దీంతో గుంటూరు వైద్య కళాశాలకు ఈ ఏడాది మొత్తం 46 సీట్లు మంజూరయ్యాయి. పీజీ సీట్లు పెంపునకు కళాశాల అధికారులు పెట్టిన దరఖాస్తును పరిశీలించిన ఎన్ఎంసీ అధికారులు ఫిబ్రవరిలో కళాశాలను తనిఖీ చేశారు. అనంతరం ఎన్ఎంసీ 27 సీట్లు మంజూరు చేసింది. తాజాగా జనరల్ సర్జరీ విభాగంలో 19 సీట్లు మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. సీట్ల మంజూరుకు కావాల్సిన వసతులు సమకూర్చేందుకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతీదేవి కృతజ్ఞతలు తెలిపారు.

దృష్టిలోపం విద్యార్థులకు 'డిజిటల్' పరీక్షలు

- దేశంలోనే తొలిసారిగా ఏపీలో వినూత్న ప్రయోగం
- ఆరుగురు విద్యార్థినుల కోసం విద్యాశాఖ ప్రత్యేక ఏర్పాట్లు
- స్క్రయిబ్‌లతో కాకుండా డిజిటల్ పద్ధతిలో విద్యార్థులే పరీక్షలు రాయొచ్చు

సాక్షి, అమరావతి : రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 3 నుంచి జరగనున్న టెన్త్ పరీక్షల్లో.. దృష్టిలోపం ఉన్న విద్యార్థుల కోసం పాఠశాల విద్యాశాఖ డిజిటల్ విధానంలో పరీక్షలు రాయించేలా వారికి ప్రత్యేక ఏర్పాట్లుచేసింది. ఈ సమస్య ఉన్న విద్యార్థులతో ఇలా పరీక్షలు రాయించడం దేశంలోనే ఇదే తొలిసారి. అనంతపురం జిల్లాలోని ఆర్‌డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) ఇన్‌క్లూజివ్ హైస్కూల్‌కు చెందిన ఆరుగురు దృష్టి లోపం విద్యార్థినులు ఈ ఏడాది టెన్త్ పరీక్షలకు హాజరవుతున్నారు. ఎక్కలూరు దివ్యశ్రీ, పొలిమెర చైత్రిక, ఏకుల సౌమ్య, మేఖ శ్రీధాత్రి, ఉప్పర నాగరత్నమ్మ, చంచుగారి పావని రాప్తాడు ప్రభుత్వోన్నత పాఠశాలలో పరీక్ష రాయనున్నారు. నిజానికి.. దృష్టి లోపమున్న విద్యార్థుల కోసం సహాయకు (స్క్రైబ్)లను కేటాయించి వారి ద్వారా గత కొన్నేళ్లుగా పరీక్షలు రాయిస్తున్నారు. ఈసారి స్క్రయిబ్‌లతో కాకుండా డిజిటల్ విధానంలో ఆ విద్యార్థులే పరీక్షలు రాసేలా పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లుచేసింది. ఈ విద్యార్థులు ల్యాప్‌టాప్‌లను ఉపయోగించి అన్ని సబ్జెక్టులను తమంతట తామే డిజిటల్ విధానంలో రాయడానికి సమాయత్తమవుతున్నారు. ఇందుకోసం ఎస్సెస్సీ బోర్డు సంచాలకులు డిజిటల్‌గా ప్రశ్నపత్రాలను రూపొందిస్తున్నారు. ఈ విద్యార్థులు ఎన్‌వీడీఏ (నాన్ విజువల్ డెస్క్ టాప్ యాక్సెస్) సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రశ్నపత్రాన్ని వింటారు. ఈ విద్యార్థులు ఇప్పటికే టైపింగ్ నేర్చుకోవడంవల్ల జవాబులు టైప్ చేస్తారు. తొలిసారిగా స్క్రయిబ్‌తో పనిలేకుండా ఈ ఆరుగురు విద్యార్థులకు డిజిటల్ విధానంలో పరీక్షలకు అనుమతిస్తున్నారు. మరోవైపు.. ఇతర అంధ విద్యార్థులు కనుక ఉంటే వారికి పాత విధానంలో స్క్రయిబ్ సౌలభ్యం కూడా ఉంది.

భావితరాలకు నైపుణ్యాలు అందించడమే లక్ష్యం



ఏపీలో పాఠశాలలను డిజిటల్‌గా మార్చేందుకు, మన భావితరాలను భవిష్యత్తు నైపుణ్యాలతో సన్నద్ధం చేయడమే ప్రభుత్వ లక్ష్యం. దివ్యాంగ విద్యార్థులందరికీ పాఠశాలల్లో లేదా ఇంటివద్ద సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుంది.

– బొత్స సత్యనారాయణ, రాష్ట్ర విద్యాశాఖామంత్రి

రానున్న కాలం డిజిటల్‌దే



రానున్న కాలంలో డిజిటల్‌దే భవిష్యత్తు. పాఠశాలలో ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు డిజిటల్ టూల్స్‌తో శిక్షణ ఇవ్వడం, టాబ్లెట్ కంప్యూటర్ ఇవ్వడంవల్ల వాళ్లు నిజంగా తరగతి గదిలో ఉండే చదువుకుంటున్నట్లు అనుభూతి పొందుతారు.

– ప్రవీణ్‌ప్రకాష్, ప్రిన్సిపల్ సెక్రటరీ, పాఠశాల విద్య


కొత్త మార్పునకు స్వాగతం



సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగ విద్యార్థులకు అనేక సదుపాయాలు కల్పిస్తున్నాం. ముఖ్యంగా భవిత కేంద్రాలు నిర్వహణ, ఉచిత వైద్య శిబిరాలు, ఉచిత ఉపకరణాలు, అలవెన్సులు అందజేస్తున్నాం. డిజిటల్ విధానంలో పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అభినందనలు. ఈ మార్పును స్వాగతిస్తున్నాను.

– ఎస్.సురేష్‌కుమార్, కమిషనర్, పాఠశాల విద్య, ఎస్పీడీ, సమగ్ర శిక్ష

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో శుక్రవారంనమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
అనంతపురం	40.1	21.9
కర్నూలు	39.1	27.4
కనిగిరి	39.0	26.0
కడప	38.7	25.2
నెల్లూరు	37.2	25.6
ఏలూరు	37.0	26.0
తిరుపతి	36.0	25.0
అనకాపల్లి	35.3	23.0
ఆమదాలవలస	35.0	21.0
శ్రీకాకుళం	35.0	23.0
విశాఖపట్నం	33.6	24.8
తెలంగాణలో..		
ఆదిలాబాద్	37.8	20.7
రామగుండం	36.4	25.2
హైదరాబాద్	36.2	25.0

క్లుప్తంగా...

డాక్టర్ అచ్చెన్న మరణం బాధాకరం

- ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది
- దోషులను కఠినంగా శిక్షిస్తాం
- రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ కడప జిల్లా పశు సంవర్ధకశాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అచ్చెన్న మరణం చాలా బాధాకరమని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఆయన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. పశు సంవర్ధకశాఖలో ఎస్సీ, ఎస్టీ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ లబ్బీపేటలోని వెటహోమ్‌లో డాక్టర్ అచ్చెన్న సంతాపసభ జరిగింది. మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ డాక్టర్ అచ్చెన్న కేసులో నిందితులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో, ఆయన ఆలోచన విధానంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. తనశాఖలో పనిచేస్తున్న వైద్యుడిని కోల్పోవడం, సొంత మనిషిని కోల్పోయినట్లు భావిస్తున్నానన్నారు. డాక్టర్ అచ్చెన్న హత్య ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిందని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేయగా, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ, వెటర్నరీ ఎస్సీ,ఎస్టీ వైద్యుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ నాగరాజు, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అచ్చెన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

విశాఖ పోర్టు ఇన్‌చార్జ్ చైర్మన్‌గా రామచంద్రన్

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం పోర్టు అథారిటీ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా టీకే రామచంద్రన్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు విశాఖపట్నం వీపీఏ కార్యాలయానికి ఫ్యాక్స్ ద్వారా సమాచారం పంపించినట్లు తెలిసింది. చీఫ్ సెక్రటరీ గ్రేడ్ హోదా పొంది, 1991 తమిళనాడు బ్యాచ్‌కు చెందిన రామచంద్రన్ ప్రస్తుతం ట్యుటికోరిన్‌లోని వీవో చిదంబరం పోర్టు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక విశాఖలో ఇప్పటివరకు చైర్మన్‌గా కొనసాగిన కె. రామ్మోహన్‌రావు శుక్రవారం పదవీ విరమణ చేశారు. అయితే.. ఆరు నెలలపాటు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనైనా తనను కొనసాగించాలని పోర్టు మంత్రిత్వ శాఖను రామ్మోహన్‌రావు కోరినట్లు సమాచారం. చివరి నిమిషం వరకూ ఆయన తన ప్రయత్నాలు కొనసాగించారని.. అయితే కేంద్ర మంత్రిత్వ శాఖ మాత్రం వెంటనే బాధ్యతలు చేపట్టాలని రామచంద్రన్‌కు ఆదేశాలు జారీచేయడంతో.. ఆగమేఘాలపై శుక్రవారం సాయంత్రం ఆయన బాధ్యతలు చేపట్టినట్లు తెలిసింది.

పౌష్టికాహారం పుష్కలంగా అందుతోంది

- త్వరలో లెర్నింగ్ సెంటర్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు
- మంత్రి ఉషశ్రీ చరణ్ వెల్లడి



గుండుగొలనుకుంట అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ముచ్చటిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

ద్వారకాతిరుమల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశించినట్లుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం పుష్కలంగా అందుతోందని రాష్ట్ర స్త్రీ, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అన్నారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని శుక్రవారం ఆమె దర్శించుకున్న అనంతరం మండలంలోని గుండుగొలనుకుంట, పంగిడిగూడెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గుండుగొలనుకుంట అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె నేలపై కూర్చుని పిల్లలతో కాసేపు ముచ్చటించారు. వారు ఆటలాడుతూ అక్షరాలు నేర్చుకుంటున్న తీరును పరిశీలించి, ముచ్చటపడ్డారు. పిల్లలకు అందుతున్న పౌష్టికాహారంపై వారి తల్లిదండ్రులను ఆరా తీశారు. ఒక చిన్నారి కోరిక మేరకు మంత్రి ఉషశ్రీ చరణ్ పిల్లలతో కలిసి సరదాగా రైమ్స్ పాడారు.



---- రహదారులకు -------

మహర్దశ

ఎన్‌హెచ్‌ల నిర్మాణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థత

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి వరుసగా నాలుగో ఏడాదీ కేంద్రం నుంచి రికార్డు స్థాయిలో నిధులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించింది. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఈ వార్షిక ప్రణాళికలో రూ.12,130 కోట్లు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వం ఏటా ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో వార్షిక ప్రణాళిక కింద ఆమోదించిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రహదారుల ప్రాజెక్టులను పరిశీలిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ పనితీరు పట్ల సంతృప్తి చెందితేనే ఆ మేరకు ఆర్థిక సంవత్సరం ఆఖరులో నిధులు మంజూరు చేస్తుంది. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం పట్ల రాష్ట్ర ప్రభుత్వ పనితీరుతో పూర్తి సంతృప్తి చెందినందున రికార్డు స్థాయిలో వార్షిక ప్రణాళిక నిధులను కేంద్రం మంజూరు చేసింది. ఉత్తరప్రదేశ్ తరువాత అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌కే నిధులు మంజూరు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

సీఎం జగన్ ప్రణాళికకు కేంద్రం ఆమోదం

రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ప్రణాళికతో కార్యాచరణ చేపడుతున్నారు. 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో చర్చిస్తూ పట్టుబట్టి నిధులను సాధిస్తున్నారు. ఆర్థికాభివృద్ధికి రహదారుల అభివృద్ధే కీలకమన్న అంశంపై ఏకాభిప్రాయం రావడమే రాష్ట్రానికి మరింత సానుకూలంగా మారింది. 2019–20 వార్షిక ప్రణాళికలో తొలుత కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రూ.600 కోట్లే కేటాయించింది. దీనిపై తక్షణం స్పందించిన ముఖ్యమంత్రి జగన్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తేవడంతో 2019–20లో రాష్ట్రానికి నిధుల కేటాయింపును రూ.1,304.42 కోట్లకు పెంచారు. ఇక 2020–21 వార్షిక ప్రణాళికలో కేంద్రం రూ.2,476.50 కోట్లు మంజూరు చేయగా, 2021–22లో ఏకంగా రూ.7,561 కోట్లు మంజూరు చేసింది. ఆ ఆర్థిక సంవత్సరంలో దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నిధులు కేటాయించడం గమనార్హం. తాజాగా 2022–23 వార్షిక ప్రణాళికలో రాష్ట్రానికి రూ.12,130 కోట్లు మంజూరు చేసింది.

541.45 కి.మీ. మేర 24 ప్రాజెక్టులు

2022–23కి సంబంధించి కేంద్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళిక నిధులతో రాష్ట్ర ప్రభుత్వం 24 ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టింది. రూ.11,699.55 కోట్లతో ఇప్పటికే 513.72 కి.మీ. మేర 21 ప్రాజెక్టులను పూర్తి చేసింది. రూ.431.27 కోట్లతో 27.73 కి.మీ.మేర మూడు ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయి. అవి కూడా త్వరలో పూర్తి చేయనున్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ సమర్థ పనితీరు భవిష్యత్‌లో నిధుల కేటాయింపుపై సానుకూల ప్రభావం చూపనుంది. 2023–24 వార్షిక ప్రణాళికలో రాష్ట్రానికి మరింత భారీగా నిధులు కేటాయించే అవకాశాలున్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు.

నాడు కేంద్రంలో అధికారాన్ని పంచుకుని కూడా..

నాడు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి కూడా చంద్రబాబు జాతీయ రహదారుల అభివృద్ధికి తగిన నిధులు రాబట్టడంలో విఫలమయ్యారు. ఐదేళ్లలో టీడీపీ సర్కారు కేవలం రూ.10,661 కోట్లే తేగలిగింది. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలోనే రూ.12,130 కోట్లు సాధించింది. మొత్తం నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రికార్డు స్థాయిలో రూ.23,471.92 కోట్లు సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో రాష్ట్రంలో పారిశ్రామిక, తీర ప్రాంతాలు, ఎకనామిక్ జోన్లు, పర్యాటక ప్రదేశాలను అనుసంధానిస్తూ రహదారుల అభివృద్ధి జోరందుకుంది.



వార్షిక ప్రణాళికలో జాతీయ రహదారులకు కేంద్రం కేటాయింపులు ఇలా

టీడీపీ హయాంలో...

2014- 15	రూ.2,434.78 కోట్లు
2015-16	రూ.2,709.34 కోట్లు
2016-17	రూ.2,698.49 కోట్లు
2017-18	రూ.2,551.54 కోట్లు
2018-19	రూ.267.04 కోట్లు
మొత్తం ఐదేళ్లలో	రూ.10,661.19 కోట్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో..

2019-20	రూ.1,304.42 కోట్లు
2020-21	రూ.2,476.50 కోట్లు
2021-22	రూ.7,561.00 కోట్లు
2022-23	రూ.12,130.00 కోట్లు
మొత్తం నాలుగేళ్లలో	రూ.23,471.92 కోట్లు

2019 జూన్ నాటికి రాష్ట్రంలో జాతీయ రహదారుల పొడవు: 6,861.68 కి.మీ.

2023 మార్చి నాటికి రాష్ట్రంలో జాతీయ రహదారుల పొడవు: 8,163.72కి.మీ.

ఎయిర్ ఇండియాకు ఫోరం వడ్డన

విశాఖ లీగల్ : వినియోగదారునికి సేవాలోపం కలిగించినందుకు రూ.40 వేలు పరిహారం చెల్లించాలని ఎయిర్ ఇండియా సంస్థను ఆదేశిస్తూ విశాఖ జిల్లా వినియోగదారుల ఫోరం–1 అధ్యక్షురాలు జి.తనూజ, సభ్యులు రహీమున్నీసా బేగం, వర్రి కృష్ణమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ఖర్చుల కింద మరో రూ.5వేలు కూడా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ఫిర్యాది తరపు న్యాయవాది ఎస్.వాసు అందించిన వివరాలు... విశాఖ మురళీనగర్‌కు చెందిన ద్రోణంరాజు సూర్యప్రకాశరావు తన భార్యతో కలసి 2021, డిసెంబర్ 6న ఢిల్లీ వెళ్లి తిరిగి అదే రోజున ఎయిర్ ఇండియా విమానంలో విశాఖ వచ్చారు. వారితోపాటు గుండెకు సంబంధిత మందులు, విలువైన వస్తువులు ఉన్నాయి. బ్యాగ్ బరువుగా ఉండడంతో దానిని ఎయిర్ ఇండియా సంస్థ కార్గోలో బుక్ చేసింది. సూర్యప్రకాశరావు దంపతులు విశాఖ చేరుకున్నా, వారి బ్యాగ్ మాత్రం రాలేదు. వెంటనే ఎయిర్ ఇండియా వారిని సంప్రదించినా ప్రయోజనం లేదు. 2022, మార్చి 13న వస్తువులు వారి ఇంటికి చేరాయి. తనకు సేవాలోపం కలిగించినందుకు పరిహారం ఇవ్వాలని కోరుతూ సూర్యప్రకాశరావు వినియోగదారుల ఫోరంను ఆశ్రయించారు.

'ఏప్రిల్ 14 నుంచి వామపక్షాల ప్రచార యాత్ర'

సాక్షి, అమరావతి: ఏప్రిల్ 14 నుంచి 30వ తేదీ వరకు ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ప్రచారయాత్రను నిర్వహిస్తున్నట్లు సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ వెల్లడించారు. నేతలు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను, రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ ప్రచార యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముగిసిన జీ20 సదస్సు

▶ మొదటి పేజీ తరువాయి

అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్సింగ్‌లో అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులు, పట్టణ ప్రాంతాల్లో నాణ్యమైన జీవన విధానంపై చర్చించారు. నాలుగో రోజు శుక్రవారం దేశంలోని వివిధ మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లతో సమావేశాన్ని నిర్వహించారు.

ఆఖరి రోజు 'జన్ భాగీదారీ'..

జీ 20 సదస్సు చివరి రోజు జన్ భాగీదారీ కార్యక్రమం ఏర్పాటు చేయడం రివాజు. ఇందులో భాగంగా ఆతిథ్య దేశంలోని స్థానిక సంస్థలు, విశ్వవిద్యాలయాల వీసీలు, విద్యార్థులతో వర్క్‌షాపు నిర్వహిస్తారు. శుక్రవారం వర్క్‌షాపులో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఢిల్లీ, హర్యానా, మణిపూర్, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడుతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, దాద్రా నగర్ హవేలి, డామన్ డయ్యూలకు చెందిన మున్సిపల్ కమిషనర్లు, పట్టణాభివృద్ధి శాఖల డైరెక్టర్లు 80 మంది పాల్గొన్నారు. వీరితో పాటు వీసీలు, ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, విద్యార్థులు కూడా హాజరయ్యారు.

సుస్థిరాభివృద్ధి దిశగా..

తొలిరోజు సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జీ 20 దేశాల ప్రతినిధులతో సమావేశమై పలు సూచనలు చేశారు. మౌలిక సదుపాయాల రంగంపై చర్చించడం మంచి పరిణామమని చెప్పారు. సుస్థిరాభివృద్ధి దిశగా తమ ప్రభుత్వం పని చేస్తోందని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సొంతింటి కలను సాకారం చేస్తున్నామని, లక్షలాది గృహాలను నిర్మిస్తూ మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు.

వికేంద్రీకరణ ఎందుకు వద్దో చెప్పాలి

చంద్రబాబును నిలదీసిన ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

- కర్నూలులో హైకోర్టు ఏర్పాటుపై బీజేపీ వైఖరి ఎందుకు మారింది?
- సీపీఐ మద్దతు పేదలకా.. చంద్రబాబు పెత్తందార్లకా?
- వికేంద్రీకరణతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి అన్నది సీఎం అభిమతం
- మూడు రాజధానులే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానం
- చట్ట ప్రకారం రామోజీరావుపై చర్యలు తప్పవు



సాక్షి, అమరావతి : వికేంద్రీకరణను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో చెప్పాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి నిలదీశారు. కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని తీర్మానం చేసి, ఎన్నికల్లో హామీ ఇచ్చిన బీజేపీ.. తన విధానాన్ని ఇప్పుడెందుకు మార్చుకుందో ఆ పార్టీ నేతలు చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే అడ్డుపడిన చంద్రబాబు నేతృత్వంలోని పెత్తందార్లకు సీపీఐ ఎందుకు మద్దతు ఇస్తోందని ప్రశ్నించారు. వికేంద్రీకరణతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమన్నది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని.. మూడు రాజధానులే తమ విధానమని పునరుద్ఘాటించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతిలో చంద్రబాబు, బినామీలు భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడి.. రైతుల నుంచి తక్కువ ధరలకే భూములు కాజేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వారా లక్షల కోట్లు కొట్టేయాలని పథకం వేశారన్నారు. దాన్ని సీఎం వైఎస్ జగన్ భగ్నం చేయడంతో చంద్రబాబు పెట్టుబడిదారులైన తన బినామీలతో అమరావతి ఉద్యమం చేయిస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో కనీస మౌలిక సదుపాయాల కల్పనకే రూ.లక్ష కోట్లు వ్యయం అవుతుందని.. అంత భారీ మొత్తం ఒకే చోట ఖర్చు చేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అమరావతిలో అధిక శాతం మంది రైతులు భూములు అమ్మేసుకున్నారని.. భూములకు సకాలంలో కౌలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. భూ సమీకరణతో చంద్రబాబు వేలాది మంది రైతులు, కూలీల పొట్ట కొడితే.. పోరాడాల్సిన సీపీఐ అప్పట్లో ఏం చేసిందని నిలదీశారు. ఇప్పుడు రైతు కూలీలకు సీఎం వైఎస్ జగన్ న్యాయం చేస్తున్నారని వివరించారు. వికేంద్రీకరణను వ్యతిరేకిస్తున్న బీజేపీ నేతల వైఖరి పట్ల అమరావతిలో నిరసన తెలిపారేగానీ ఎవరూ దాడి చేయలేదన్నారు.

సీపీఐ కాదది.. చంద్రబాబు పార్టీ ఆఫ్ ఇండియా

పోలవరానికి నిధులు, విభజన చట్టంలోని అంశాల పరిష్కారంతోపాటు రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టడం కోసం సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, హోం శాఖ మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లతో సమావేశమైతే.. దానిపై సీపీఐ నేత నారాయణ తన స్థాయికి తగినట్లు కాకుండా చిల్లర మాటలు మాట్లాడుతున్నారని సజ్జల మండిపడ్డారు. పేద ప్రజల పక్షాన పోరాడాల్సిన సీపీఐ.. చంద్రబాబు పక్షాన నిలబడుతున్నందున ఆ పార్టీ పేరును చంద్రబాబు పార్టీ ఆఫ్ ఇండియాగా మార్చుకుంటే సరిపోతుందంటూ వ్యంగ్యోక్తులు విసిరారు. రైతుల అంగీకారం లేకుండా రాజధానిలోనైనా, కియా వంటి పరిశ్రమలకైనా బలవంతంగా భూములు లాక్కుంటే.. అధికారంలోకి వచ్చాక చట్ట ప్రకారం వెనక్కు ఇస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారని.. అందులో తప్పేముందో చెప్పాలని చంద్రబాబు, లోకేలను నిలదీశారు.

రామోజీ రాజ్యాంగానికి అతీతుడా?

మార్గదర్శి చిట్ ఫండ్స్, ఫైనాన్స్‌లో చిట్స్ వేసిన, డిపాజిట్ చేసిన ప్రజల ప్రయోజనాలు పరిరక్షించడం, భద్రత కల్పించడంలో భాగంగానే ప్రభుత్వం సీఐడీతో దర్యాప్తు చేయిస్తోందని.. ఇందులో ఎలాంటి కక్ష సాధింపు చర్యలు లేవని సజ్జల తేల్చి చెప్పారు. మార్గదర్శి ఫైనాన్స్, చిట్స్‌లో అక్రమాలు జరిగినట్లు సీఐడీ దర్యాప్తులో తేలుతోందన్నారు. అగ్రి గోల్డ్, సహారా వంటి సంస్థలపై 'ఈనాడు'లో కథనాలు అచ్చేసిన రామోజీరావు.. ఆ సంస్థల తరహాలోనే మార్గదర్శిలో అక్రమాలకు పాల్పడ్డారని స్పష్టం చేశారు. వాటిని బహిర్గతం చేస్తుంటే తట్టుకోలేకే ప్రభుత్వంపై విషం చిమ్ముతూ రోజుకో తప్పుడు కథనాన్ని 'ఈనాడు'లో అచ్చేస్తున్నారని మండిపడ్డారు. రామోజీరావు మీడియా రౌడీయిజం ఇక చెల్లదని, దేశంలో అందరికీ ఒకే రాజ్యాంగం వర్తిస్తుందని స్పష్టం చేశారు. రామోజీరావు అందుకు అతీతుడేమీ కాదని, తప్పు చేసినందున చట్టపరమైన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు.

పెరిగిన మున్సిపల్ ఆస్తి పన్ను వసూళ్లు

- ఈ ఏడాది రూ.1,998 కోట్లు వసూలు
- గడువునాటికి రూ.2 వేల కోట్లు దాటుతుందని అంచనా
- మొత్తం డిమాండ్‌లో వసూలైంది 53.10 శాతం
- గత ఆర్థిక సంవత్సరానికంటే 41.5 శాతం ఎక్కువ
- నీటి పన్ను వసూళ్లు రూ.228.78 కోట్లు

సాక్షి, అమరావతి: ఆస్తి పన్ను వసూళ్లలో మున్సిపల్ శాఖ 2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రగతి సాధించింది. గత ఏడాదికంటే ఈసారి 41.50 శాతం అధికంగా పన్నులు వసూలు చేసింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి శుక్రవారం సాయంత్రానికి సుమారు రూ.1,998 కోట్లు వసూలు చేసింది. మొత్తం పన్నుల డిమాండ్ రూ.3,763.44 కోట్లు కాగా, అందులో ఇప్పటివరకు 53.10 శాతం వసూలైంది. గత ఆర్థిక సంవత్సరంలో మార్చి 31 నాటికి వసూలైంది రూ.1,414 కోట్లే. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రైవేటు ఆస్తుల నుంచి రూ.1,651.44 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల నుంచి రూ.49.54 కోట్లు, కేంద్ర ప్రభుత్వ ఆస్తుల నుంచి 12.73 కోట్లు, కోర్టు కేసుల్లో ఉన్న ఆస్తుల నుంచి రూ.48.99 కోట్లు, ఖాళీ స్థలాల నుంచి రూ.235.74 కోట్లు వసూలైంది. మార్చి 31 లోగా పన్ను చెల్లించినవారికి బకాయిలపై 5 శాతం రాయితీ కల్పించడంతో రెండు వారాల్లో ఆస్తి పన్ను చెల్లింపులు అనూహ్యంగా పెరిగాయి. వడ్డీ మాఫీ కింద పన్ను చెల్లింపుదారులు మొత్తం రూ.178.91 కోట్లు మినహాయింపు పొందినట్టు సీడీఎంఏ అధికారులు తెలిపారు. కాగా, గత ఏడాదితో పోలిస్తే ఈసారి బకాయి చెల్లింపులు కూడా పెరిగాయి. ప్రైవేటు ఆస్తుల యజమానులతోపాటు ప్రభుత్వ సంస్థలు కూడా బకాయిల చెల్లింపునకు ముందుకు రావడం విశేషం. నిర్ణీత పన్ను చెల్లింపు గడువునాటికి మొత్తం వసూళ్లు రూ.2 వేల కోట్లు దాటుతాయని అంచనా వేస్తున్నారు. మున్సిపల్ నీటి పన్ను డిమాండ్ రూ.632.63 కోట్లు ఉండగా, రూ.228.78 కోట్లు వసూలైంది.

ముందస్తు పన్ను చెల్లింపుదారులకు 5% రిబేటు

పట్టణ స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆస్తి పన్ను ముందస్తు చెల్లింపుదారులకు మొత్తం పన్నులో 5 శాతం రిబేటు ఇవ్వనున్నట్టు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఏప్రిల్ 30వ తేదీలోగా చెల్లించే వారికి ఈ అవకాశం కల్పిస్తున్నారు. ఆన్‌లైన్ విధానంలో పన్ను చెల్లించే వారి కోసం మొత్తం పన్నులో ప్రభుత్వం ప్రకటించిన తగ్గింపును మినహాయించేలా ఈ–మున్సిపల్ ఈఆర్‌పీ అప్లికేషన్‌లో మార్పులు చేయనున్నారు. అందుకోసం ఏప్రిల్ 1 నుంచి మూడు రోజులపాటు వెబ్‌సైట్ నిలిపివేయనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి.

వెంకన్న పెండ్లికొడుకాయేనె

- నేడు వాడపల్లి వెంకన్న రథోత్సవం, కల్యాణం
- తీర్థం, ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. వేకువ జామున భరద్వాజ గోత్ర పాలకుడు శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. భార్గవశ గోత్ర నామాలతో శ్రీదేవిని, కాశ్యప గోత్రీకురాలు భూదేవిని పెండ్లి కుమార్తెలుగా అలంకరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6–15 గంటలకు స్వామి వారి ధ్వజారోహణ, అంకురార్పణ, నిత్య బలిహరణ అనంతరం స్వామి వారి దర్శనాలకు అనుమతి ఇచ్చారు. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం శ్రీమాన్ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చక బృందం ఘనంగా నిర్వహించారు.

నేడు రథోత్సవం, కల్యాణం

చైత్రశుద్ధ ఏకాదశి శనివారం రాత్రి 7.01 గంటలకు స్వామి కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం 3గంటలకు స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలను స్వామివారికి సమర్పిస్తారు.

దేశభక్తికి గుర్తుగా స్మారక చిహ్నం

1931లో స్వాతంత్ర్య ఉద్యమంలో ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న కల్యాణ ఉత్సవాల్లో దేశభక్తి కట్టలు తెంచుకుంది. గాంధీజీ పిలుపు మేరకు పరిసర ప్రాంతాలకు చెందిన నాయకులు రథోత్సవ కార్యక్రమంలో దేశ సమైక్యతను చాటే స్వరాజ్య జెండాను, గాంధీజీ చిత్ర పటాన్ని స్వామివారి రథంపై ఉంచేందుకు ప్రయత్నించారు. దీంతో బ్రిటీష్ సైన్యం జరిపిన కాల్పుల్లో ముగ్గురు అమరులు కాగా మరో 16మందిపై కేసులు నమోదు చేశారు. వారి దేశభక్తికి గుర్తుగా ఆలయ ప్రాంగణంలో స్వాతంత్ర్య సమరయోధుల స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలిరానుండడంతో ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మెర్లపాలెం నుంచి వాడపల్లి వరకు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో చలివేంద్రాలు, పాలు, పులిహోర , అన్నదానం నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

వ్యాపారుల సందడి

తీర్థ మహోత్సవానికి వ్యాపార సముదాయాలు సిద్ధమయ్యాయి. వారం రోజులపాటు నిర్వహించే స్వామి వారి కల్యాణోత్సవాలకు తరలివచ్చే భక్తులు తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేస్తూ ఉంటారు. రంగుల రాట్నం, జెయింట్‌వీల్, వంటివి నిర్వాహకులు సిద్ధం చేశారు. భక్తుల కోసం ఆలయంలో లడ్డూలను తయారు చేస్తున్నారు.

విద్యుత్ కాంతులతో వెంకన్న ఆలయం

ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణ వేదిక, పచ్చని పందిర్లు, విద్యుత్‌కాంతుల మధ్య స్వామి వారి ఆలయం కాంతులీనుతోంది. మిరమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో ఆలయం కల్యాణోత్సవానికి ముస్తాబైంది.

విస్తృత పోలీస్ బందోబస్తు

రాష్ట్ర నలుమూలల నుంచి యాత్రికులు స్వామి వారి కల్యాణోత్సవాలకు తరలిరానున్న దృష్ట్యా అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. రావులపాలెం సీఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో ఎస్సైలు, ఏఎస్సైలు, హెచ్‌సీలు, సుమారు 200 మంది పోలీస్, హోంగార్డులు ఉత్సవ ఏర్పాట్లుకు తరలివచ్చారు.

కాస్తంత 'ఉపాధి' పెంపు

పెరిగిన ఉపాధి కూలి

- రూ.15 పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు
- నేటి నుంచి అమలు

కాకినాడ సిటీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఈ వేసవి నుంచి వేతనం పెరగనుంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం పెరిగిన వేతనాలను శనివారం నుంచి కూలీలకు అందజేయనున్నారు. ఇప్పటి వరకూ ఒక్కో కూలీకి రూ.257 చెల్లిస్తూండగా ఇక నుంచి రూ.272 అందుతుంది. ఈ నిర్ణయంతో జిల్లాలోని 4.55 లక్షల మంది కూలీలకు లబ్ధి చేకూరనుంది. కాగా, ఏటా కూలీలకు అందించే వేసవి భత్యంపై మాత్రం కేంద్రం ఎటువంటి ప్రకటనా చేయకపోవడం గమనార్హం.



లక్ష్యాలను నిర్దేశిస్తున్న కేంద్రం

ఉపాధి హామీ పథకం నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొచ్చింది. ఇప్పటికే సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా ఆధీనంలోకి తీసుకున్న కేంద్రం.. పని దినాల లక్ష్యాల కేటాయింపులను కూడా పర్యవేక్షిస్తోంది. కూలీల సంఖ్య ఆధారంగా గ్రామం, బ్లాక్ (మండలం), జిల్లాకు పని దినాల లక్ష్యాలను నిర్దేశిస్తోంది. గతంలో కేంద్రం నుంచి వచ్చే పని దినాల లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొంత మేర పెంచుతూ జిల్లాలకు ప్రత్యేక లక్ష్యాలు ఇచ్చేది. కానీ కొత్త సాఫ్ట్‌వేర్ రావడంతో కేంద్రం సూచనలే అమలవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు దొరకని సమయంలో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య జిల్లాలో ఎక్కువగానే ఉంటోంది. ఈ ఏడాది ఉపాధి పనులను జిల్లావ్యాప్తంగా 3.22 లక్షల మంది వినియోగించుకున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు వేతనం పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పెరిగిన వేతనం నేటి నుంచి అమలులోకి రానున్నట్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. జాబ్‌కార్డులు కలిగిన కూలీలు వేసవిలో పనులను సద్వినియోగం చేసుకోవాలి.

– అడపా వెంకటలక్ష్మి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్, కాకినాడ జిల్లా

దత్త లలితాంబిక మందిరాన్ని సందర్శించిన సతీశ్‌రెడ్డి

పాత గుంటూరు: గుంటూరు శ్యామలానగర్‌లోని శ్రీ దత్త లలితాంబిక మందిరాన్ని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, కేంద్ర రక్షణశాఖ సలహాదారు జి.సతీశ్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. మందిరం అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న సతీశ్‌రెడ్డి అనంతరం హోమంలో పాల్గొన్నారు. తొలుత మందిరం ప్రాంగణంలోని శ్రీ మహర్షి వేదిక్ టెక్నాలజీ పరిశోధన కేంద్రాన్ని ఆయన సందర్శించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

ఎవరివల్ల లోకం వ్యథ చెందదో, లోకం వలన ఎవడు వ్యథ చెందడో, సంతోషం, కోపం, భయం, ఉద్వేగాల నుండి ఎవడు ముక్తుడో అతడు నాకు ప్రియుడు.
– భగవద్గీత

సాక్షి
శనివారం, ఏప్రిల్, 1

ట్రంప్‌కు పరీక్షా సమయం

అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఇది కష్టకాలం. అధ్యక్ష ఎన్నికలో తన గెలుపును తన్నుకుపోయారంటూ వాషింగ్టన్‌లోని కాపిటల్ హిల్ భవనంపైకి మద్దతుదార్లను ఉసిగొల్పి విధ్వంసానికి కారకుడయ్యారన్న ఆరోపణలపై అభియోగాలు నమోదు కావొచ్చని అందరూ అనుకుంటున్న సమయంలో వేరే కేసు తలకు చుట్టుకుని ఆయన ఊపిరాడని స్థితిలో పడ్డారు. తనతో ఉన్న లైంగిక సంబంధాన్ని బయటపెట్టకుండా ఉండేందుకు శృంగార తార స్టార్మీ డేనియల్స్‌కు ట్రంప్ భారీ యెత్తున సొమ్ము ముట్టజెప్పారన్న ఆరోపణకు ఆధారాలున్నాయని మన్‌హటన్ గ్రాండ్ జ్యూరీ భావించటం అసాధారణ నిర్ణయం. దీని పర్యవసానంగా ట్రంప్‌ను సంకెళ్లు వేసి సాధారణ నేరస్థుడి మాదిరిగా తీసుకెళ్లి ఫొటోలు, వేలిముద్రలు తీసుకుంటారు. అయితే ఆ తర్వాత వెంటనే బెయిల్ రావటం పెద్ద కష్టం కాదు. ఈ కేసులో వాస్తవంగా విచారణ యోగ్యమైన నేరారోపణలేమిటన్నది ఇంకా వెల్లడి కావలసివుంది. అర్ధ శతాబ్దంపాటు ట్రంప్ ఓ వెలుగు వెలిగారు. గుట్టు చప్పుడు కాకుండా తప్పుడు ఒప్పందాలు కుదుర్చుకోవటంలో, చట్టానికి దొరక్కుండా తప్పించుకోవటంలో, సమ ర్థుడైన వ్యాపారవేత్తగా వెలిగిపోవటంలో, రాజకీయాల్లో అడ్డగోలుగా మాట్లాడుతూ జనాన్ని ఆకట్టు కుని అధ్యక్ష పదవికి ఎగబాకటంలో ట్రంప్‌కెవరూ సాటిరారు. అధ్యక్ష పదవిలో ఉంటూ కూడా తన బాణీ ఆవగింజంతైనా మార్చకుండా అందర్నీ హడలెత్తించిన మొనగాడు ట్రంప్.

అన్ని దేశాల ప్రజానీకంలో ఉన్నట్టే అమెరికాలో కూడా నైతికవర్తన విషయంలో చాలా పట్టింపులుంటాయి. ముఖ్యంగా తమ పాలకుల నుంచి దాన్ని చాలా ఆశిస్తారు. కానీ ట్రంప్ చరిత్ర ఆద్యంతం అందుకు విరుద్ధం. నిజానికి ఒక నటీమణిని లోబర్చుకోవటానికి తాను చేసిన ప్రయత్నాలను ఆయన ఒక టీవీ షోలో గొప్పగా చెప్పుకున్నారు కూడా. 2006లో ఒక గోల్ఫ్ టోర్నమెంట్ కోసం వచ్చి ట్రంప్ తనతో గడిపారని స్టార్మీ డేనియల్స్ 2016లో అమెరికన్ మీడియా ఇంక్లైన్స్ (ఏఎంఐ) అనే సంస్థకు చెప్పారు. అధ్యక్ష పదవికి ట్రంప్ పోటీపడటం ఖాయమని తేలాక అనేక మంది మహిళలు బయటికొచ్చి ఆయన గతంలో తమను లైంగికంగా ఎలా వేధించిందీ వెల్లడించటం మొదలెట్టారు. అలాంటి మహిళలు ఆ కథనాలు కేవలం తమకు మాత్రమే ఇచ్చేలా అప్పట్లో ఏఎంఐ ఒప్పందాలు కుదుర్చుకుని వారికి డబ్బు ముట్టజెప్పింది. ఆ తర్వాత వాటిని బుట్టదాఖలా చేసింది. ఈ సంస్థ ట్రంప్ మాజీ అటార్నీ మైఖేల్ డి. కోహెన్ చెప్పుచేతల్లో ఉండేది. స్టార్మీ డేనియల్స్ వేరే మీడియా సంస్థకు అంతక్రితమే ఇంటర్వ్యూ ఇచ్చినా అది ప్రచురించకుండా కోహెన్ బెదిరించగలిగారు. ఆ విషయంలో మరింత ముందుకు పోకుండా అప్పట్లో రహస్య ఒప్పందం కుదుర్చుకుని డేనియల్స్‌కు 1,30,000 డాలర్లు కోహెన్ అందించారు. అది అనైతిక సంబంధాన్ని కప్పెట్టడానికి కాదనీ, తప్పుడు ఆరోపణలు చేసి తన పరువు తీయకుండా ఉండటం కోసమేననీ ట్రంప్ 2018లో ఒకసారి చెప్పారు. ఇక్కడ ట్రంప్‌కు ఆమెతో అనైతిక సంబంధం ఉందా లేదా అన్నది కుటుంబపరంగా ఏమైనా కావొచ్చుగానీ... చట్టపరంగా పెద్ద సమస్య కాకపోవచ్చు. ఆ డబ్బును ఏ ఖాతాలో చూపారో, దానికి అనుసరించిన విధానాలేమిటో విచారణ సందర్భంగా బయటికొస్తాయి. తనకు అటార్నీగా వ్యవహరిస్తున్నందుకు కోహెన్‌కు చెల్లించిన ఫీజుగా, అధ్యక్ష ఎన్నికల ప్రచారం కోసం చేసిన ఖర్చుగా ట్రంప్ చూపారు. ఈ డబ్బు స్టార్మీకి చెల్లించటం కోసం కోహెన్ ఎసెన్షియల్ కన్సల్టెంట్స్ పేరిట ఒక దొంగ కంపెనీ సృష్టించారు. ఆ తర్వాత ఫీజు రూపంలో ట్రంప్ నుంచి స్వీకరించారు. స్వయానా కోహెనే దీన్ని ఒప్పుకున్నారు. ఇది అమలులో ఉన్న ఆర్థిక చట్టాలను ఉల్లంఘించటం. ఆ విధంగా ఆర్థిక నేరం. అయితే కోహెన్ ఆ మొత్తాన్ని ఏం చేశారో తనకు తెలియదనీ, తన న్యాయవాదిగా ఆయన చెప్పిందల్లా చేశాను తప్ప అందులోని తప్పొప్పులతో సంబంధం లేదనీ ట్రంప్ అనొచ్చు. అసలు ఇదంత పెద్ద నేరమేమీ కాదని వాదిస్తున్నవారు లేకపోలేదు. అది నిజం కావొచ్చు కూడా. ఆర్థిక నేరాన్నీ, అనైతికతనూ కలగాపులగం చేసి నిర్మించే కేసు ధర్మాసనం ముందు వీగిపోయినా పోవచ్చని హెచ్చరిస్తున్నారు. ఇంతవరకూ అమెరికా చరిత్రలో ఎప్పుడూ న్యాయస్థానాల ముందుకురాని ఈ మాదిరి కేసు అంతిమంగా ట్రంప్‌పై సానుభూతిని పెంచినా పెంచొచ్చనీ, పర్యవసానంగా కాపిటల్ హిల్ భవనంపై దాడి, విధ్వంసం, కుట్ర, రహస్యపత్రాలు దగ్గరుంచుకోవటం వంటి బలమైన కేసుల విషయంలో జనంలో నిర్లిప్తత ఏర్పడే ప్రమాదం ఉన్నదనీ వారంటున్నారు.

తాజా కేసు ట్రంప్‌కు రాజకీయంగా నష్టమో లాభమో వెంటనే చెప్పటం అంత సులభం కాదు. అభియోగాల నిర్ధారణ తర్వాత రిపబ్లికన్ పార్టీలో అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం ట్రంప్‌తో పోటీపడే నేతలతో సహా అందరూ ఏకమయ్యారు. అలా చూస్తే ట్రంప్‌కు ఈ పరిణామం మేలు చేసేదే. నైతికతను దిగజార్చుకుని, దాన్ని కప్పిపుచ్చడానికి ఆర్థిక నేరాలకు పాల్పడి దేశాధ్యక్షుడైన వ్యక్తివల్ల అమెరికన్ సమాజానికీ, పాలనా వ్యవస్థకూ నష్టం కలుగుతుందని ప్రాసిక్యూటర్లు వాదిస్తారు. దాన్ని ఏ మేరకు ధర్మాసనం అంగీకరిస్తుందో చూడాలి. ఒకవేళ శిక్షించినా 1974లో వాటర్‌గేట్ కుంభకోణం దోషి నిక్సన్‌కు ఆయన వారసుడిగా వచ్చిన గెరాల్డ్ ఫోర్డ్ క్షమాభిక్ష పెట్టారు. రిపబ్లికన్ల ఏలుబడి వస్తే ట్రంప్ విషయంలో కూడా అదే జరగొచ్చు. ఏదేమైనా నాలుగేళ్లు దేశాధ్యక్షుడిగా ఉండి, మరోసారి అందుకోసం పోటీపడుతున్న నాయకుడిని శిక్షించడానికి అమెరికన్ న్యాయవ్యవస్థ ఏ మేరకు సిద్ధపడుతుందన్నది ఈ కేసుతో తేలిపోతుంది.

ఇన్‌బాక్స్ ప్రజాస్వామ్య స్ఫూర్తికి చేటు

ప్రజల ఆకాంక్షలను సాకారం చేయాల్సిన కొందరు ప్రజా ప్రతి నిధులు తమ అభివృద్ధి, ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారు. తాజాగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొంతమంది శాసన సభ్యులు ప్రలోభాలకు ఆశపడి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటం ఇటువంటిదే. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని ముమ్మాటికీ అపహాస్యం చేసేవే.

గతంలో జరిగిన సంఘటనలను పరిశీలిస్తే... తెలంగాణ రాష్ట్రంలో 2015లో తెలుగు దేశం అధినాయకుడు, నాటి ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాలతో అప్పటి టీడీపీ నాయకుడు రేవంత్ రెడ్డి స్వయంగా ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్ వద్దకు బేరసారాలకు వెళ్లారు. తమకు అనుకూలంగా ఓటు వేయాలని కోరుతూ రూ 50 లక్షలు ఇచ్చిన ఉదంతానికి చెందిన వీడియోలు బయటకు రావడంతో పెద్ద గొడవ జరిగింది. టీడీపీ అధ్యక్షుడు స్వయంగా అన్న... 'బ్రీఫ్‌డ్ మి' మాటలు సైతం రికార్డు అయ్యాయి. ఈ వీడియోలు బయటకు వచ్చిన తర్వాత ప్రతిపక్షాలు పట్టుపట్టడంతో కేసు నమోదై, న్యాయ స్థానాలకు చేరింది. అయితే నేటికీ ఈ 'ఓటుకు నోటు' కేసులో రేవంత్ రెడ్డికి కానీ, ఆయనను పంపిన బాబుకు కానీ శిక్షలు పడ లేదు. దీంతో చంద్రబాబు నాయకత్వంలో మరోసారి ఇదే తరహా కుట్ర నడిచింది. తాజాగా ఏపీలో జరిగిన శాసన మండలి సభ్యుల ఎన్నికల్లో నలుగురు శాసన సభ్యులను ప్రలోభాలకు గురిచేసి తమకు అనుకూలంగా ఓటు వేసేలా చేసి ప్రజాస్వామ్య విలువలను కాల రాశారు. వ్యక్తిగత స్వార్థం కోసం అమ్ముడుపోయిన శాసన సభ్యులపై కఠిన చర్యలు తీసుకుని ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో అమ్ముడుపోయిన శాసన సభ్యులకు కులం ఆపాదించడం ఏ మాత్రం సమంజసం కాదనే సంగతి గుర్తించాలి. వారు వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారనే విషయం గమనార్హం. న్యాయస్థానాలు ఇటువంటి కేసుల్లో తీర్పులను వెంటనే వెలువరించాలని ప్రజాస్వామ్యవాదులు కోరు తున్నారు. తీర్పులు ఆలస్యం అయితే ఇలాంటి ప్రజాస్వామ్య హననాలే పునరావృతం అవుతూనే ఉంటాయి.

– ఆచార్య టి. షారోన్ రాజు, విద్యా విభాగాధిపతి, ఏయూ

జ్ఞాన సాధనే ముఖ్యం

జ్యోతిర్మయం

తిన్నందువల్ల కలిగే పుష్టి పశువులకు, తెలుసుకున్నందు వల్ల కలిగే పుష్టి మానవులకు అంటారు. అవును, మనిషి ఎంత జ్ఞానం తెలుసుకుంటే అంత జ్ఞాని అవుతాడు. మనిషిని నడిపించేదీ, మనిషిగా బతికించేదీ జ్ఞానమే! జ్ఞాన సంపాదనలో మనిషి సిగ్గుపడకూడదు. వెనకడుగు వేయకూడదు. ఉపవాస వ్రతం పాటించకూడదు. 'ఇంతవరకే తెలుసు కోవాలి' అనే హద్దులూ నిర్ణయించుకోకూడదు. ఎందుకంటే మనుష లకు పరిపూర్ణపు బ్రతుకునిచ్చేది ప్రజ్ఞ మాత్రమే! పరిపూర్ణమైన జ్ఞానమే ప్రజ్ఞ!


దైనందిన కార్యక్రమాల్లో భిక్షువులకు జ్ఞానాన్ని పొందే కాలం, జ్ఞానాన్ని పంచే కాలమే ఎక్కువ. తిండి కోసం తిప్పలు పడే కాలం చాలా తక్కువ. ఒంటి పూట మాత్రమే వారు ఆహారం తీసుకోవాలి. భిక్షువులు సంచరిస్తూ ధర్మ ప్రబోధాలు చేస్తూ ఉంటారు. కొంత కాలం ఏకాంతంగా ఆరామాల్లోనో, అడవుల్లోనో ఉంటారు.

వారు ఎలాంటి చోట ఉండాలో, ఎలాంటి చోట ఉండకూడదో బుద్ధుడు చెప్పాడు. ఇవి జ్ఞాన సాధనకు కృషి చేసే అందరికీ వర్తిస్తాయి. వ్యక్తి వికాసానికి దోహదం చేస్తాయి. మనం ఎక్కడ ఉంటే ఏకాగ్రత కుదురుతుందో, మనస్సు నిర్మలం అవుతుందో, ఎరుక కలుగుతుందో, ధ్యాన సాధన సాగుతుందో అలాంటి చోట్ల ఉండాలి. ఇవన్నీ జ్ఞానాన్ని సాధించే ప్రక్రియలే. ఇలాంటి స్థితి ఎక్కడ ఉంటే అక్కడ ఉండాలి.

ఒక నివాసంలో అయినా, ఊరిలో అయినా, చివరికి అడవిలో అయినా సరే... జ్ఞాన సాధనకు ఇబ్బందులు లేకపోతే, అక్కడ ఉండాలి. ఒక అడవిలో జీవించడానికి కావలసిన ఆహారం సమృద్ధిగా దొరుకు తుంది. నివాసానికి ఇబ్బంది ఉండదు. అయినా జ్ఞానాన్ని సాధించే అవకాశం లేకపోతే ఆ అడవిని వదిలిపెట్టాలి. ఇదే స్థితి ఒక గృహంలో ఉన్నా, ఊరిలో ఉన్నా వాటినీ విడచిపెట్టాలి. మరి మరో అడవి ప్రాంతంలో ఆహారం సరిగా దొరకదు. నివా సానికి అంత అనుకూలంగా ఉండదు. కానీ... అక్కడ చక్కని ఏకాగ్రత కుదురుతుంది. ధ్యానం సాగుతుంది. ప్రజ్ఞ వికసిస్తుంది. కాబట్టి అలాంటి అడవిని వదిలి పెట్టకూడదు. అడవే కాదు... గృహమైనా, గ్రామమైనా, నగరమైనా అంతే!

అరకొర సౌకర్యాలు ఉన్నా, అజ్ఞానాన్ని తొలగించుకుని, విజ్ఞా నాన్ని పెంపొందించుకునే ప్రదేశాలను వదిలిపెట్టకూడదు. అంటే... ప్రజ్ఞే ముఖ్యం, పొట్ట నింపుకోవడం కాదు అనేదే ఈ బుద్ధ సందేశం!

– బొర్రా గోవర్ధన్



తిన్నారు... తిన్నారు

పోలవరం ప్రాజెక్టును తానే నిర్మిస్తానని కేంద్రం చెబితే... వద్దు మాకు ప్యాకేజీ చాలన్నారు చంద్రబాబు. అలా చేస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా అడగబోమని హామీనిచ్చేశారు. కేంద్రం సరేనని ప్యాకేజీలో భాగంగా పోలవరాన్ని అప్పగిస్తే... రామోజీరావు వియ్యంకుడి కంపెనీ నవయుగకు ఎలాంటి టెండర్లూ లేకుండా నామినేషన్‌పై రూ.3,302 కోట్ల విలువైన పనులు కట్టబెట్టేశారు బాబు. పనిలోపనిగా యనమల రామకృష్ణుడి బావ మరిదికీ కొంత పంచారు. ఇక అందిన ప్యాకేజీలో దత్తపుత్రుడు, తోక పత్రికకు వాటా చేరిపోయింది. కాబట్టే... ఎందుకు ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారని వాళ్లు ప్రశ్నించలేదు. ఒక్క ఒక్కరం ముక్కా రాయలేదు. ఇదీ.. దోచుకో- పంచుకో-తినుకో అంటే!

మూసేసిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ గానీ, నడుస్తున్న మార్గదర్శి చిట్స్ గానీ ఏ నిబంధననూ పాటించవు. కోట్లకు కోట్లు డిపాజిట్లు తీసుకున్నాయి. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై అక్రమంగా డిపాజిట్లు వసూలు చేస్తున్నందుకు క్రిమినల్ కేసులు నడుస్తుండగా... రూ.2వేల కోట్లు ఫైన్ కట్టాల్సిన పరిస్థితుల్లో తప్పించుకునేందుకు ఏకంగా సంస్థనే మూసేశారు. ఇక చిట్స్ సంస్థ బిడ్ పాడుకున్న వాళ్లనూ ష్యూరిటీల పేరిట నెలలకు నెలలు తిప్పుతుంది. అక్రమంగా డిపాజిట్లూ తీసుకుంటోంది. ఇలా ఏం చేసినా... చంద్రబాబు ప్రశ్నించరు. ముఖ్యమంత్రిగా ఉన్నా దాని జోలికెళ్లరు. ఇది కాదూ... డీపీటీ అంటే!!.

ఏది నిజం?

ముఖ్యమంత్రిగా షాపూర్జీపల్లోంజీ సంస్థకు వేల కోట్ల నిర్మాణ కాంట్రాక్టులు కట్టబెట్టారు నారా వారు. ఆ సంస్థను పిలిచి... పార్టీకి కాదు, మా 'బాబు' గారికి ఫండ్ కావాలన్నారు బాబు పీఏ శ్రీనివాస్. డొల్ల కంపెనీలు పుట్టుకొచ్చాయి. వాటిల్లో వందల కోట్లు ప్రవహించాయి. వాటిలో కొంత రామోజీ తనయుడి వియ్యంకుడి కంపెనీకీ (ఆర్‌వీఆర్ ఇన్‌ఫ్రా) చేరాయి. అక్కడి నుంచి చంద్ర బాబు జేబులోకీ కొంత మళ్లాయి. దుబాయ్‌లో ఆస్తులు కూడబెట్టిన బాబు... అక్కడా కొంత క్యాష్ తీసుకున్నారు మరి!. ఇదంతా సంబంధిత వ్యక్తులు స్వయంగా సంతకం చేసిన ఇన్‌కమ్‌ట్యాక్స్ అప్రైజల్ రిపోర్ట్‌లోనిదే!. కానీ దీని గురించి రామోజీ, ఆయన తోకపత్రిక పెన్నెత్తితే ఒట్టు. ఇదీ.. తోడు దొంగల డీపీటీ అంటే!!.

రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలో ఉండగా స్కిల్ డెవలప్‌మెంట్ నుంచి ఫైబర్‌నెట్ వరకూ దోచుకో- పంచుకో- తినుకో పథకాన్ని విజయవంతంగా అమలుచేసిన దుష్ట చతుష్టయం... ఇపుడో కొత్త రాగం ఎంచుకుంది. అధికార పార్టీయే ఇసుక తవ్వకాల్లో 'దోచుకో, పంచుకో, తినుకో' అన్నట్లుగా వ్యవహరిస్తోందనే కథనాలకు దిగింది. మరి ఇందులో నిజం వీసమెత్తయినా ఉందా? బాబు హయాంలో ఇసుక విషయంలో జరిగిందేంటి? ఇప్పుడు జరుగుతున్నదేంటి? ఎవరి హయాంలో దోపిడీ జరిగింది? ఎవరు పంచుకున్నారు? ఎవరు తిన్నారు? ఒకసారి చూద్దాం...

చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు... పేరుకే ఇసుక ఉచితం!!. కానీ సామాన్యులు ఒక్కరికైనా ఫ్రీగా అందితే ఒట్టు!. అంతా బాబు కనుసన్నల్లోనే. అంతా టీడీపీ నేతల చేతుల్లోనే. ఉచితం పేరిట ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా రాకుండా వేల కోట్లు దోచేసి.. పంచుకుతినేశారు. సామాన్యులకు ఉచితంగా ఇవ్వకుండా... ప్రభుత్వానికి కూడా రూపాయి రాకుండా ఇసుకను తవ్వేయటం దారుణమని భావించారు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి. అందుకే జాతీయస్థాయిలో టెండర్లు పిలిచారు. అలా టెండర్లు పిలిచే బాధ్యతను ఏకంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎంఎస్‌టీసీకి అప్పగించారు. బహిరంగ టెండర్లలో ఇసుక తవ్వి, విక్రయించే కాంట్రాక్టును జయప్రకాశ్ గ్రూపునకు చెందిన 'జేపీ పవర్ వెంచర్స్' దక్కించుకుంది. దీని కోసం ఇది ఏటా ప్రభుత్వానికి రూ.750 కోట్లు చెల్లించాలి. అంటే... ఐదేళ్లలో దాదాపు రూ.4వేల కోట్లు. గతంలో ఇందులో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి రాలేదు. మరి ఈ సొమ్ము ఎక్కడికి పోయింది? ప్రజలకు కూడా ఇసుక ఫ్రీగా దొరకనప్పుడు ప్రభుత్వానికి రావాల్సిన డబ్బు ఎవరి జేబుల్లోకి పోయింది? ఇంకెవరు... చంద్రబాబు, రామోజీ, తోకపత్రిక యజమాని, దత్తపుత్రుడు. ఈ చతుష్టయమే మొత్తం ఇసుక వ్యాపారాన్ని శాసించింది. కృష్ణానది కరకట్టపై చంద్రబాబు కట్టిన ఇంటి వెనకాల... రాత్రీపగలూ విరామం లేకుండా ఇసుక లారీలు తిరిగేవంటే ఈ దోపిడీ ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు! అక్రమంగా తవ్వేస్తున్నారని, ఉచితం పేరిట తినేస్తున్నారని తెలుగుదేశం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను అడ్డుకోబోయిన నాటి ఎమ్మార్వో వనజాక్షిని... ఏకంగా జుట్టుపట్టుకుని ఈడ్చేశాడా ఎమ్మెల్యే. అంత దారుణం జరిగినా 'ఈనాడు' వ్యతిరేకించలేదు. మనవాడే కదా అని కిమ్మనకుండా ఊరుకున్నారు రామోజీ, ఆయన తోక మీడియా. ఇక చంద్రబాబు మరో అడుగు ముందుకేశారు. ఆ ఎమ్మార్వోను పిలిచి, ఎమ్మెల్యేపై ఎలాంటి ఫిర్యాదూ చేయకుండా 'రాజీ' కుదిర్చే ప్రయత్నం చేశారు. ఇదీ.. బాబు, ఆయన బృందం స్థాయి. ఇసుకను ఉచితంగా ఇస్తూ రామోజీరావు చెప్పినట్లుగా చంద్రబాబు మహా యజ్ఞమే చేసి ఉంటే... ఈ దౌర్జన్యాలెందుకు? ఈ దొంగ తవ్వకాలెందుకు? ఒకవేళ ఇసుక తవ్వకాలు తమ చేతుల్లోనే ఉండాలనుకుంటే జాతీయ స్థాయి టెండర్లలో రామోజీరావు కూడా పాల్గొని ఉండొచ్చుగా? ఎందుకు పాల్గొనలేదు?!. మరి ఇప్పుడెందుకీ కడుపు మంట? తమ అక్రమాలకు ఇపుడు ఫుల్‌స్టాప్ పడిందనేనా? వాళ్ల జేబుల్లోకి పోయిన సొమ్ము ఇపుడు నేరుగా ప్రభుత్వానికి అందుతోందనా? ఇసుక తవ్వకాలపై మరీ పనిగట్టుకుని అపోహలు రేకెత్తించేలా తరచూ రామోజీ రాస్తున్న కథనాల్లో నిజమెంత? ఒకసారి సబ్‌కాంట్రాక్టరుగా టర్న్‌కీని తప్పించారంటూ బాధ!. మరోసారి టర్న్‌కీ సంస్థ దోచేస్తోందని శివాలు. ఇంకోసారి ఇసుక దొరకటం లేదని బాధ! మరోసారి ఇసుక విచ్చలవిడిగా విక్రయంచేస్తున్నారని బాధ!. వీటన్నిటి వెనకా అసలు బాధ మాత్రం... తమ డీపీటీకి అడ్డుకట్ట పడిందనే!.

2 కోట్ల టన్నుల ఇసుకతో... రూ.1800 కోట్లు ఎలా సాధ్యం?

'ఈనాడు' వాదన ఎంత ఘోరమంటే... రాష్ట్రంలో ఇసుకను ఎడాపెడా తవ్వేస్తున్నారని... ఇష్టారాజ్యంగా విక్రయిస్తూ కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారని శుక్రవారంనాటి వార్తలో రామోజీ మండిపడ్డారు. కానీ అదే వార్తలో... తూర్పు గోదావరి జిల్లాను సబ్‌కాంట్రాక్టుగా తీసుకున్న వ్యక్తి... వ్యాపారం సరిగా జరగటం లేదని, తాను చెల్లించాల్సింది తగ్గించమన్నాడట. కుదరదనటంతో ఆత్మహత్య చేసుకున్నాడని కూడా రాసేశారు.

ఎడాపెడా తవ్వేస్తూ కోట్లకు కోట్లు సంపాదిస్తున్నపుడు... వ్యాపారం జరగకుండా డబ్బులు చెల్లించలేని పరిస్థితి ఉంటుందా? ఏమనుకోవాలి రామోజీ మీ తెలివిని?

మరో వాదన చూద్దాం. ఇసుకపై రూ.1800 కోట్లు వసూలు చేసి ప్రభుత్వానికి రూ.765 కోట్లు కట్టి మిగిలిన సొమ్ము వైఎస్సార్‌సీపీ నేతలు దోచుకుంటున్నారనేది 'ఈనాడు' కథ. నిజానికి రాష్ట్రంలో ఏటా 2 కోట్ల టన్నుల ఇసుక అవసరం. దీనికి అనుగుణంగానే తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక టన్ను ఇసుకను ఓపెన్ రీచ్‌లలో రూ.475కి విక్రయిస్తున్నారు. అంటే.. మొత్తంగా రూ.900 కోట్లు వస్తాయి. రాష్ట్రంలో లభ్యమయ్యే ఇసుకే 2 కోట్ల టన్నులైతే దానికి రెండు రెట్లు ఎక్కడి నుంచి వస్తుంది? ఇది తెలిసి కూడా జేపీ సంస్థ నుంచి అంతకన్నా ఎక్కువ మొత్తం చెల్లించి వైఎస్సార్ సీపీ నాయకులెందుకు సబ్‌కాంట్రాక్టులు తీసుకుంటారు? ఒకటీఅరా చోట్ల తీసుకున్నా అంత ఎక్కువ మొత్తం ఎలా చెల్లిస్తారు? ఇవన్నీ కాస్త ఇంగితజ్ఞానం ఉపయోగిస్తే అర్థమవుతాయి కదా రామోజీ?

అక్రమ రవాణాపైనా అబద్ధాలేనా?

యథేచ్ఛగా పక్క రాష్ట్రాలకు తరలించేస్తున్నారని, అధిక ధరలకు విక్రయిస్తున్నారని... ఇలా చేతికొచ్చిన అబద్ధాలన్నిటినీ రాసి పారేసింది 'ఈనాడు'. వాస్తవానికి పక్క రాష్ట్రాలకు ఇసుక తరలిపోకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. దీనికోసమే ప్రత్యేకంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను కూడా ఏర్పాటు చేసింది. ఎక్కడా ఇసుక ఎక్కువ రేట్లకు విక్రయించరాదన్న ఉద్దేశంతో ప్రతి వారం పత్రికల్లో స్థానికంగా విక్రయించే రేటును ప్రకటనల రూపంలో ప్రచురిస్తోంది. అక్కడే... ఒకవేళ ఎక్కువ ధరకు విక్రయిస్తే 'సెబ్' నెంబరుకు కాల్ చెయ్యవచ్చంటూ ఆ ఫోన్ నెంబరు కూడా ఇస్తున్నారు. ఇక వినియోగదారులు నేరుగా డిపోలు, రీచ్‌ల వద్దకు వెళ్లి ఇసుక నాణ్యతను పరిశీలించి, కావాల్సినంత ఇసుకను బుక్ చేసుకునేందుకు అవకాశం కూడా కల్పించారు. ఒకవేళ ఎక్కడైనా అక్రమంగా తరలిస్తున్న వ్యవహారాలు, ఎక్కువ ధరలకు విక్రయించిన ఘటనలు జరిగితే సెబ్ తక్షణం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు కేసులు కూడా పెడుతోంది. ఇదిగో... ఈ చర్యల ఫలితంగానే ప్రభుత్వానికి భారీగా ఆదాయం రావడంతోపాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక అందుతోంది. మరి ఇసుక విధానం ఇంత పారదర్శకంగా ఉన్నపుడు 'దోచుకో.. పంచుకో.. తినుకో' ఎలా అవుతుంది రామోజీ? అబద్ధమైనా అతికినట్లుండాలి కదా?

బాబు అక్రమాలకు... ఎన్‌జీటీ 100 కోట్ల జరిమానా

చంద్రబాబు హయాంలో ఇసుక విధానం ఎంత దారుణంగా ఉందో సాక్షాత్తూ జాతీయ గ్రీన్ ట్రిబ్యునలే తేల్చిచెప్పింది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు.. సాక్షాత్తూ తన ఇంటి పక్కనే కృష్ణా నదిని తొలిచేస్తూ టీడీపీ నేతలు ఇసుకను తరలించడాన్ని ప్రోత్సహించారంటే దోపిడీ స్థాయిని అర్థం చేసుకోవచ్చు. ప్రతిరోజూ వందల లారీలు తన ఇంటి మీదుగానే అక్రమంగా తరలిపోతున్నా... వాటా వచ్చిందో లేదో చూసుకున్నారు తప్ప పర్యావరణానికి జరుగుతున్న డ్యామేజీని ఆయన పట్టించుకోలేదు. దీనిపై ఢిల్లీలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) విచారణ జరిపి... అక్రమాలు ముమ్మాటికీ నిజమని తేల్చింది. టీడీపీ ప్రభుత్వానికి ఏకంగా రూ.100 కోట్ల జరిమానా విధించింది. విచిత్రమేంటంటే జాతీయ స్థాయిలో బాబు ఇసుక మాఫియా గురించి బట్టబయలైనా... కళ్లకు గంతలు కట్టుకున్న రామోజీ ఒక్క అక్షరం కూడా రాయటానికి పూనుకోలేదు. టీడీపీ హయాంలో ఇసుక అక్రమ తవ్వకాలు విచ్చలవిడిగా జరిగినా... వినియోగదారులు బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు ఇసుకను కొనుక్కోవాల్సి వచ్చినా ఇప్పుడు రాసిన తరహాలో రామోజీ ఎన్నడూ ఒక్క వార్త కూడా రాయలేదెందుకు? ఇసుక లారీలు పెద్ద ఎత్తున పొరుగు రాష్ట్రాలకు తరలిపోయినా... టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరించినా ఎందుకు ప్రశ్నించలేదు? తమ వాటా తమకు అందేసిందనా? అది కదా... అసలైన డీపీటీ!!.

సబ్ కాంట్రాక్టులు ఎవరికివ్వాలో చెప్పగలమా?

వాస్తవానికి టెండర్లలో పాల్గొని దక్కించుకున్న కాంట్రాక్టరు... ఆ తరవాత టెండరు నిబంధనలను పాటిస్తూ ఎవరికి సబ్‌కాంట్రాక్టుకు ఇచ్చుకున్నా, తనను అలా చేయకుండా నిలువరించటం కష్టం. సబ్‌కాంట్రాక్టు ఎవరికివ్వాలన్నది కాంట్రాక్టరు ఇష్టం. ఎక్కడైనా.. ఎప్పుడైనా ఇదే పద్ధతి. పోనీ చంద్రబాబు హయాం చూసుకున్నా ఇదే తీరు కదా? కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ నాయకుడు శ్రీనివాస్‌కు ఇస్తే... ఆ శ్రీనివాస్ సదరు పనులను సీఎం రమేష్ కంపెనీకి సబ్ కాంట్రాక్టుకిచ్చాడు. మరి అప్పుడెందుకు కలమెత్తలేదు రామోజీ రావు గారూ? అసలు నిజంగానే వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులే ఇసుక తవ్వకాలు, తరలింపులు చేస్తుంటే ప్రభుత్వం ఎస్ఈబీని ఎందుకు ఏర్పాటు చేస్తుంది? అక్రమంగా తరలించిన వారిపై కేసులెందుకు పెడుతుంది? ఇదంతా రామోజీరావు బుర్రకు తట్టదా? తట్టకేం... కావాలని నాలుగు రాళ్లు విసిరితే సరి అనుకునే పాత్రికేయం మరి.

ఐదేళ్ల లూటీ ఆగిందనా మంట రామోజీ?



కొత్తా దేవుడండీ...



'ఈనాడు' పత్రికలోకి 'కొత్త దేవుళ్లు' తరచూ వస్తూనే ఉంటారు. పార్టీకి ద్రోహం చేస్తున్నారనో, క్రమశిక్షణను ఉల్లంఘించారనో పార్టీ గనక వారిని దూరంగా పెడితే... ఆ వెంటనే వారు 'ఈనాడు'కు కొత్త దేవుళ్లలా మారిపోతారు. నిన్న మొన్నటిదాకా ఓ ఎంపీ. ఇప్పుడో ఎమ్మెల్యే. వాళ్లు చెప్పినవన్నీ ఇక రామోజీ దృష్టిలో ప్రవచనాలే. నిన్న మొన్నటిదాకా పార్టీలో ఉండగా ఈ విషయాలను ఎందుకు ప్రస్తావించలేదని జనం నవ్వుకుంటారన్న ఇంగితం కూడా ఉండదు 'ఈనాడు'కు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్దినట్లుగా... డబ్బులకు అమ్ముడుపోయి ప్రతిపక్షాల పంచన చేరిన ఈ నేతల మాటలకు విలువ ఉంటుందా రామోజీ?

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

స్వయంకృతాపరాధం



రిపబ్లికన్ పార్టీ సభ్యులారా, వివేకం తెచ్చుకోండి. అబద్ధాలను నమ్మవద్దు. ఇది రాజకీయం కాదు. డోనాల్డ్ ట్రంప్ తనకు తాను చేసుకున్నారు. ఆయన మీ విశ్వాసాన్ని వమ్ము చేశారు. (అమెరికా మాజీ అధ్యక్షుల్లో నేరాభియోగాన్ని ఎదుర్కోనున్న మొదటివాడు డోనాల్డ్ ట్రంప్.)

– స్టీఫెన్ కింగ్, రచయిత

లోపలి వార్త



ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ప్రజాస్వామ్యాన్ని మోసపుచ్చాడని డెబ్బై శాతానికిపైగా జనం భావిస్తున్నారు. కానీ దానికి ఆ నియంత ఎలా స్పందిస్తున్నారు? వృద్ధులని కూడా చూడకుండా పోలీసులు కొడుతున్నారు. దీన్ని టీవీల్లో చూపించరు. ఇలాంటి వార్తలు తెలియకుండా ఉండాలని ప్రభుత్వం కోరుకుంటోంది. కానీ తెలుసుకోవాలి.

– బెర్నీ స్పాఫోర్త్, కామెంటేటర్

డబ్బే అక్కర్లేదు



డబ్బు అనేది ఎంతో ప్రాధాన్యత కలిగినదే. కానీ మనం సంతోషంగా ఉండటానికి అదొక్కటే తగిన కారణం అని చెప్పలేము.

– ఫిరోజ్ అజీజ్, ఆర్థికాంశాల నిపుణుడు

అసలు లక్ష్యం



నూతన పార్లమెంట్ భవనం ఫోటోలు చూస్తుంటే – చక్కగా, సొగసుగా ఉన్నాయి. కానీ మన కాలపు పెద్ద సమస్యలను వాస్తవికంగా చర్చిస్తే ఇంతకంటే చక్కగా ఉంటుంది.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

పట్టించుకోరా?



తేనెటీగల విషం క్యాన్సర్ కణాలను చంపుతుంది. అలాంటప్పుడు ప్రతి హాస్పిటల్‌లోనూ దాన్ని ఎందుకు వాడటం లేదు. జవాబు ఎప్పుడూ అదే. డబ్బులు ముఖ్యం.

– డీన్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

విజయవాడ ఎయిర్‌పోర్ట్‌లో 'డిజి యాత్ర' ప్రారంభం


డిజియాత్ర సేవలను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

గన్నవరం: విమాన ప్రయాణికుల బోర్డింగ్ ప్రక్రియను సులభతరం చేసే డిజియాత్ర సేవలు శుక్రవారం నుంచి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో అందుబాటులోకి వచ్చాయి. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ సేవలను ప్రారంభించారు. అనంతరం ఆయన డిజి యాత్ర సేవలను ఉపయోగించుకుని ఇండిగో విమానంలో తిరుపతికి వెళ్లారు. అంతకుముందు మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. విమానాశ్రయాల్లో ప్రయాణికుల ప్రవేశాలను సులభతరం చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. దీనివల్ల చెక్ ఇన్, బోర్డింగ్ ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ.. గత నెల రోజులుగా దీనిని ప్రయోగాత్మకంగా పరీక్షించినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 9,500 మంది ప్రయాణికులు డిజియాత్ర అప్లికేషన్‌ను రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి పూర్తిస్థాయిలో ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇది కాగిత రహిత విధానమని.. ఫేషియల్ రికగ్నిజేషన్ ఆధారంగా ఎయిర్‌పోర్ట్‌లోకి ప్రవేశించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తలశిల రఘురాం, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఎయిర్‌పోర్ట్ జాయింట్ జీఎం సూర్యభగవానులు, టెర్మినల్ మేనేజర్ అంకిత్, ఎయిర్‌పోర్ట్ ఏసీపీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో వేడుకగా ధ్వజారోహణ

- వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- శేషవాహనంపై జగదభిరాముడు
- నేడు వేణుగానాలంకారం, హంసవాహనంపై రామచంద్రుడు


ధ్వజారోహణంలో భాగంగా గరుడ పతాకాన్ని ఎగురవేస్తున్న పండితులు (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులు

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణతో ప్రారంభమయ్యాయి. తొలుత శాస్త్రోక్తంగా హోమం, పూజలు నిర్వహించిన వేదపండితులు పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం ధ్వజస్తంభంపై గ రుడ పతాకాన్ని ఎగురవేశారు. ధ్వజస్తంభానికి నవకళ పంచామృతాభిషేకం చేసి సకల దేవతలు, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. విష్వక్సేన పూజ, వాసుదేవ పుణ్యాహవాచనం, ధ్వజస్తంభ రక్షాబంధనం, ఆరాధన చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు ఆధ్వర్యంలో సతీసమేతంగా రాజంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి, జేసీ సాయికాంత్‌వర్మ, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కె.హెచ్.రాజేష్ సంప్రదాయబద్ధంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు: శ్రీకోదండరామాలయంలో శనివారం ఉదయం 7:30 గంటలకు వేణుగానాలంకారం ఉంటుంది. రాత్రికి కోదండరాముడు హంసవాహనాన్ని అధిరోహించి భక్తులను కటాక్షించనున్నారు.

తిరుమలలో వైభవంగా శ్రీరామపట్టాభిషేకం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం రాత్రి శ్రీరామపట్టాభిషేకం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామివారి ఉత్సవమూర్తులకు విశేష సమర్పణ చేపట్టారు. సాయంత్రం 5 నుంచి 5.30 గంటల వరకు సహస్రదీపాలంకారసేవ నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామివారి ఉత్సవమూర్తులకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి 8 నుంచి 9 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని బంగారువాకిలి చెంత శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ఆలయ అర్చకులు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం సుగ్రీవుడు, అంగదుడు ఉత్సవమూర్తులను వేంచేపు చేసి వారితోపాటు ఆంజనేయస్వామి వారికి పుష్పమాలలు సమర్పించారు.

రూ.30.66 కోట్ల అగరబత్తీల విక్రయం

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి


దేవుళ్ల సేవలో వినియోగించిన దండల నుంచి వేరు చేసిన పూలను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తిరుపతి రూరల్: టీటీడీ పరిధిలోని ఆలయాల్లో దేవుళ్ల సేవకు వినియోగించిన పూలతో తయారుచేస్తున్న అగరబత్తీలకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ఏడాదిన్నరలోనే రూ.30.66కోట్ల విలువైన అగరబత్తీలను విక్రయించినట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతిలోని టీటీడీ ఎస్వీ గోశాలలో రూ.11 కోట్లతో నూతనంగా నిర్మించిన ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్‌ను, రూ.2 కోట్లతో విస్తరించిన రెండో దశ అగరబత్తీల తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం రోజుకు 15వేల అగరబత్తీల ప్యాకెట్లు తయారు చేస్తున్నారని, రెండో దశ ప్లాంట్ కూడా అందుబాటులోకి రావడంతో రోజుకు 30వేల ప్యాకెట్లకు పైగా తయారుచేసే అవకాశం ఉందన్నారు. దీనివల్ల 223 మందికి పైగా స్థానిక మహిళలకు ఉపాధి లభిస్తోందన్నారు. తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో నిత్య కైంకర్యాలకు అవసరమైన 4వేల లీటర్ల పాలు, పెరుగు, వెన్న, నెయ్యిని సొంతంగా తయారు చేసుకోనున్నట్లు తెలిపారు. దాని కోసం 500 దేశీయ గోవులను భక్తుల నుంచి విరాళంగా సేకరించేందుకు చర్యలు చేపట్టామని, రూ.11 కోట్లతో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్‌ను ఏర్పాటుచేశామని వివరించారు. ఇందుకు సాంకేతిక సహకారం అందించిన ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, అమెరికాకు చెందిన న్యూటెక్ బయోసైన్సెస్ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జేఈవో సదాభార్గవి, చీఫ్ ఇంజనీరు నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు పోకల అశోక్‌కుమార్, వెటర్నరీ యూనివర్సిటీ వీసీ పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2న విజయవాడలో జితో 'అహింస రన్'

ప్రారంభించనున్న ఐవోఏ అధ్యక్షురాలు పీటీ ఉష


అహింస రన్ పోస్టర్ విడుదల చేస్తున్న జితో ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ప్రపంచ శాంతిని ఆకాంక్షిస్తూ జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జితో) ఆధ్వర్యాన ఈ నెల రెండో తేదీన విజయవాడలో 'అహింస రన్' నిర్వహించనున్నట్లు 'జితో' విజయవాడ చాప్టర్ చీఫ్ సెక్రటరీ మనీష్ దోషి తెలిపారు. విజయవాడలో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండో తేదీ ఉదయం 5.30గంటలకు నగరంలోని ఎంజీ రోడ్‌లో 3కే, 5కే, 10కే విభాగాల్లో మారథాన్ పోటీలను నిర్వహిస్తామని వివరించారు. ఈ పోటీలను రాజ్యసభ సభ్యురాలు, భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐవోఏ) అధ్యక్షురాలు పీటీ ఉష ప్రారంభిస్తారని చెప్పారు. జితో మహిళా విభాగం చైర్‌పర్సన్ త్రాప్తి జైన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 65 నగరాలు, ప్రపంచ వ్యాప్తంగా 22 దేశాల్లో ఈ అహింస మారథాన్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలో మారథాన్‌కు ఏర్పాట్లు చేశామన్నారు. విజయవాడలో నిర్వహించనున్న అహింస రన్‌లో రెండు వేల మంది పాల్గొంటారని, విజేతలకు నగదు బహుమతులు అందిస్తామని చెప్పారు. 12 ఏళ్ల దాటిన చిన్నారుల నుంచి అన్ని వయసులవారు ఈ మారథాన్‌లో పాల్గొని మెరుగైన సమాజం కోసం అడుగులు వేయవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో 'జితో' విజయవాడ చాప్టర్ చైర్మన్ అశోక్, మహిళా విభాగం చీఫ్ సెక్రటరీ సంగీత, ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ హైమా తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది, ఇంద్రకీలాద్రిపై జస్టిస్ రామసుబ్రమణియన్ పూజలు


దుర్గమ్మ సన్నిధిలో జస్టిస్ రామసుబ్రమణియన్‌కు అమ్మవారి ప్రసాదాలు అందజేస్తున్న రాంబాబు

సఖినేటిపల్లి/నరసాపురం రూరల్/ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ శుక్రవారం సందర్శించారు. ఆయన కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో జరుగుతున్న నారసింహ సుదర్శన హోమంలో పాల్గొన్నారు. తొలుత జస్టిస్ రామసుబ్రమణియన్‌కు ఆలయ ప్రధాన అర్చకులు, స్థానాచార్య తదితరులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం జస్టిస్ రామసుబ్రమణియన్‌కు అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. ఆలయ విశిష్టతలను వివరించారు. అధికారులు స్వామివారి జ్ఞాపికను బహూకరించారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం ముత్యాలపల్లిలో వేంచేసిన బండి ముత్యాలమ్మ అమ్మవారిని జస్టిస్ రామసుబ్రమణియన్ దంపతులు దర్శించుకున్నారు. విజయవాడలోని కనకదుర్గమ్మను కూడా జస్టిస్ రామసుబ్రమణియన్ దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారి పంచహారతుల సేవలో పాల్గొన్నారు. వారికి ఆలయ చైర్మన్ రాంబాబు అమ్మవారి ప్రసాదాలు అందించారు.

నేటి నుంచి ఇంద్రకీలాద్రిపై చైత్రమాస బ్రహ్మోత్సవాలు

3న ఆది దంపతుల దివ్య కల్యాణోత్సవం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల చైత్రమాస బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ ఐదో తేదీ పౌర్ణమి వరకు కొనసాగే ఈ ఉత్సవాల్లో ఆది దంపతులకు రోజుకో వాహన సేవ జరుగుతుంది. శనివారం ఉత్సవమూర్తులకు మంగళ స్నానాలు అనంతరం వధూవరులుగా అలంకరిస్తారు. సాయంత్రం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, అఖండ దీపస్థాపన, కలశారాధన, ధ్వజారోహణం జరుగుతుంది. 3వ తేదీ రాత్రి 10-30 గంటలకు శ్రీ దుర్గా మల్లేశ్వర దివ్య కల్యాణోత్సవం జరుగుతుంది. ఐదో తేదీన పూర్ణాహుతి, అవభృత స్నానం, ధ్వజావరోహణతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం అవుతాయి.

కూచిపూడి కళాపీఠం ప్రిన్సిపాల్‌కు ప్రతిభ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న రామలింగశాస్త్రి

కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న కృష్ణాజిల్లా కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రికి నృత్య విభాగంలో ప్రతిభ పురస్కారం లభించింది. ఈ మేరకు ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు, తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం నుంచి ప్రతిభ పురస్కారం అందుకున్నారు. తనతోపాటు వివిధ రంగాల్లో నిష్ణాతులైన మరో పది మందికి పురస్కారాలు అందించినట్లు ప్రిన్సిపాల్ రామలింగశాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కళాపీఠం అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

గోడకూలి ఇద్దరు మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- పార్వతీపురం మన్యం జిల్లాలో ఘటన


శంకరరావు (ఫైల్)


మాణిక్యం(ఫైల్)

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం సర్వపాడు గిరిజన గ్రామంలో శుక్రవారం ఇంటి మట్టి గోడ కూలి ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు, కొమరాడ ఎస్‌ఐ జగదీష్‌నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. సర్వపాడుకు చెందిన జీలకర్ర మాణిక్యం కొత్త ఇంటిని నిర్మించాలని నిర్ణయించుకున్నారు. తన పాత ఇంటి మట్టిగోడలు తొలగించేందుకు గ్రామానికి చెందిన కేంద్రిక శంకరరావు, మండంగి రవి, జీలకర్ర హరికృష్ణ, మెల్లిక రాజును కూలికి పిలిచారు. మాణిక్యంతో పాటు కూలీలు నలురుగు పనిలో నిమగ్నమైన వేళ గోడ ఒక్కసారిగా వారిపై కూలిపోయింది. ప్రమాదంలో కేంద్రిక శంకరరావు (33) అక్కడికక్కడే దుర్మరణం చెందగా, జీలకర్ర మాణిక్యం (55) ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందారు. మిగిలిన ముగ్గురికి గాయాలు కావడంతో పార్వతీపురం కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనాస్థలాన్ని తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి, పార్వతీపురం సీఐ విజయానందం పరిశీలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

మరమ్మతులు షురూ

- వేసవిలో కాలువలు, డ్రెయిన్ల పూడికతీతకు కార్యాచరణ
- కాలువలకు రూ.12 కోట్లతో ప్రతిపాదనలు
- డ్రెయిన్ల అభివృద్ధికి రూ.8 కోట్లతో ప్రతిపాదనలు

భీమవరం(ప్రకాశం చౌక్):

పంట కాలువలతో పాటు మురుగునీటి పారుదలలో ముఖ్యమైన డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. ఏటా రబీ పంట ముగిసిన అనంతరం వేసవిలో ఈ పనులు చేపడతారు. అందుకు సంబంధించి కార్యచరణను ఇరిగేషన్, డ్రెయినేజ్ శాఖల అధికారులు రూపొందిస్తున్నారు. రబీ సాగుకు వచ్చే నెల 15 వరకు సాగునీరు అందించి తర్వాత కాలువలను మూసివేస్తారు. కాలువలకు నీరు ఆపేసిన తర్వాత కాలువలు, డ్రెయిన్ల అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు తయారు చేశారు.


జీ అండ్ వీ పంట కాలువ

జిల్లాలో కాలువలు, డ్రెయిన్ల వివరాలు

ఇరిగేషన్ సబ్ డివిజన్లు:
తాడేపల్లిగూడెం, ఉండి, తణుకు, నర్సాపురం

డ్రెయినేజ్ సబ్ డివిజన్లు:
తాడేపల్లిగూడెం, ఆకివీడు, భీమవరం, పాలకొల్లు

ప్రధాన పంట కాలువలు: 4
చిన్న కాలువలు : 150
ప్రధాన డ్రెయిన్లు : 6
చిన్న డ్రెయిన్లు :120

పంట కాలువల అభివృద్ధికి రూ.12 కోట్లతో ప్రతిపాదనలు

జిల్లాలో సాగునీరు, తాగు నీరు అందించే పంట కాలువలకు సంబంధించి 100 పనుల కోసం రూ.12 కోట్లతో అంచనా వేసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాలువల తూడు తొలగింపు, గట్ల పటిష్టం, లాకుల మరమ్మతులు, స్లూయిజ్ మరమ్మతులు, లాకు తలుపుల మరమ్మతులు తదితర పనులు చేయనున్నారు.


రూ.8 కోట్లతో డ్రెయిన్ల అభివృద్ధి

ముంపు నీరును బయటకు తీసుకువెళ్లే డ్రెయిన్ల మరమ్మతులు కూడా ముఖ్యం. ఈ వేసవిలో డ్రెయిన్ల బాగుకు 60 పనులు గుర్తించి రూ.8 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. డ్రెయిన్లలో పూడికతీత పనులు, తూడు తొలగింపు, గట్ల పటిష్టం తదితర పనులు చేయనున్నారు. వచ్చే నెల మొదటి వారంలో కాడా(కమెండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కాలువలు, డ్రెయిన్లు అభివృద్ధి పనులపై చర్చించి ప్రతిపాదించిన పనులను మంజూరు చేయించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కాలువల అభివృద్ధిపై దృష్టి

గత ప్రభుత్వం జిల్లాలోని పంట కాలువలు, డ్రెయిన్ల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో మెషీన్లు తీసుకొచ్చి కాస్త తూడు తొలగించి లక్షల్లో బిల్లుల పెట్టుకుని దోచుకున్నారు. వేసవిలో కాలువల పూడిక తీత పనులకు అనుకులంగా ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ఒక్క కాలువలో కూడా పూడికతీత పనులు గానీ, లాకుల మరమ్మతులు గానీ చేయించలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏటా వేసవిలో కాలువలు, డ్రెయిన్ల అభివృద్ధి పనులు చేస్తుంది. దాంతో రబీ(దాళ్వా) పంటకు చివరి వరకు సాగునీరు అందించగలుగుతున్నారు.

వెంటనే చేపడతాం



ఈ వేసవిలో కాలువలు, డ్రెయిన్ల అభివృద్ధి పనుల కోసం గుర్తించిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పనులపై కమిటీతో చర్చించి పనులు మంజూరు చేయగానే కాలువలు, డ్రెయిన్ల అభివృద్ధి పనులు చేపడతాం. అభివృద్ధి పనులకు సంబంధించి రూ.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఏప్రిల్ 15 తర్వాత ఈ పనులు చేపడతాం.

– పి.నాగార్జునరావు, ఇరిగేషన్ ఎస్‌ఈ, భీమవరం

ఉపాధి హామీలో రికార్డు

రాష్ట్రంలో ఏలూరు జిల్లాకు 4వ స్థానం

మార్చి 28 నాటికి 1.44 కోట్ల పనిదినాల కల్పన


ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలు

ఏలూరు (టూటౌన్): ఉపాధి హామీ చరిత్రలో అత్యధిక పని దినాలు కల్పించిన జిల్లాగా ఏలూరు రాష్ట్రంలో నాలుగో స్థానం సాధించింది. ఏలూరు జిల్లాలోని 28 మండలాల పరిధిలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 1.44 కోట్ల పనిదినాలు కల్పించి రికార్డు సృష్టించారు. ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యం 1.42 కోట్లు పనిదినాలు కాగా దాన్ని అధిగమించి పనులు కల్పించడం ద్వారా చరిత్ర సృష్టించింది. జిల్లా వ్యాప్తంగా 3.71 లక్షల కుటుంబాలకు చెందిన 6.65 లక్షల మందికి ఈ ఆర్థిక సంవత్సరంలో పనులు కల్పించారు. వీరికి వేతనాలుగా రూ.303.85 కోట్లు చెల్లించారు. మెటీరియల్ కాంపోండ్‌గా రూ.106.13 కోట్ల చెల్లింపులు చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా 2022-23లో మొత్తం రూ.409.98 కోట్లు ఖర్చు చేశారు. గత తొమ్మిదేళ్ళలో ఉపాధి హామీ పనుల గ్రాఫ్‌ను పరిశీలిస్తే రికార్డు స్థాయిలో పనులు కల్పించిన ఘనత జిల్లాకు దక్కుతుంది. గతంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్నప్పుడు ఖర్చు చేసిన మొత్తం కన్నా కేవలం ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఖర్చు చేయడం గమనార్హం. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి అధికారుల సహకారంతో ఈ అపూర్వ ఘట్టం ఆవిష్కృతం అయినట్లు డ్వామా అధికారులు చెబుతున్నారు.

సమష్టి కృషితో ఈ ఘనత సాధించాం



ఏలూరు జిల్లాలో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు మార్గదర్శకత్వంలో ఎంపీడీఓలు, ఏపీడీలు, ఏపిఓలు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బేర్‌ఫుట్ టెక్నీషియన్లు ఇలా వివిధ విభాగాల అధికారుల నిర్విరామ కృషి ఫలితంగా ఇంత ఘనమైన విజయాన్ని సాధించాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రతి ఉపాధి వేతనదారుడూ సంతోషించేలా ఈ పథకాన్ని జిల్లాలో అమలు చేస్తాం. ఈ విజయంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు.

– డి.రాంబాబు, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా నీటియాజమాన్య సంస్థ, ఏలూరు

● తెలంగాణ

పట్టాభిషిక్తుడైన రామయ్య

- భద్రాచలంలో వైభవంగా పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం
- స్వర్ణ సింహాసనంపై కొలువుదీరిన సీతారాములు
- పట్టువస్త్రాలు సమర్పించిన తెలంగాణ గవర్నర్ తమిళిసై

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సకలగుణాభి రాముడి పట్టాభిషేక మహోత్సవం భద్రాచలంలో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. వసంత ప్రయుక్త నవాహ్నిక బ్రహోత్సవాల్లో భాగంగా శ్రీరామనవమి తెల్లవారి రామచంద్ర మూర్తికి పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. రామాలయ ప్రాంగణంలోని యాగశాల లో ఉదయం చతుఃస్థానార్చన హోమం నిర్వహించారు. ఆ తర్వాత శంఖ, చక్ర, ధనుర్బాణాలు ధరించిన రాజాధిరాజు రా మయ్య, పట్టమహిషి సీతమ్మవారు, యు వరాజు లక్ష్మణుడితోపాటు భక్తాగ్రేసరుడు ఆంజనేయుడి ఉత్సవ విగ్రహాలను భక్తుల జయజయ ధ్వానాల నడుమ అయోధ్యాపురం (మిథిలా స్టేడియం) తీసుకొచ్చి స్వర్ణ సింహాసనంలో అధిష్టింపజేశారు.

2046లో మహాసామ్రాజ్య పట్టాభిషేకం..

రామరాజ్య స్థాపన లక్ష్యంగా శ్రీరామపట్టాభిషేకం ప్రతీ ఏటా నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది జరిగిన పుష్కర పట్టాభిషేం తిరిగి 2035లో, 60 ఏళ్లకు ఓసారి జరిగే మహాసామ్రాజ్య పట్టాభిషేక వేడుకలు 2046లో జరగనున్నాయి.

క్లుప్తంగా

చిన్నారి సహా ఆరుగురిని బలిగొన్న మస్కిటో కాయిల్


న్యూఢిల్లీ: దోమల కోసం పెట్టిన మస్కిటో కాయిల్ దిండుపై పడి నిప్పంటుకుని నిద్రిస్తున్న మూడేళ్ల చిన్నారి సహా ఆరుగురిని బలి తీసుకుంది. ఢిల్లీలోని శాస్త్రిపార్క్ ఏరియాలోని మచ్చి మార్కెట్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అక్బర్ అలీ కుటుంబీకులు శుక్రవారం ఉదయం రంజాన్ 'సెహ్రీ'అనంతరం 5 గంటల సమయంలో నిద్రకు ఉపక్రమించారు. గాఢనిద్రలో ఉండగా గ్రౌండ్‌ఫ్లోర్‌లోని గదిలో పెట్టిన మస్కిటోకాయిల్ పక్కనే ఉన్న దిండుపై పడి నిప్పు అంటుకుంది. దట్టమైన పొగలు మొదటి అంతస్తు వరకు వ్యాపించాయి. విషపూరిత పొగతో ఊపిరాడక మూడేళ్ల హమ్జాతో పాటు మొత్తం ఆరుగురు చనిపోయారు. వీరిలో నలుగురు ఇటీవలే బిహార్ నుంచి వచ్చిన రిక్షా కార్మికులు. కాలిన గాయాలైన 9 మందిని ఆస్పత్రులకు తరలించారు. మిగతా వారు సురక్షితంగా బయటపడ్డారు. ఆ ఇంట్లో సుమారు 25 మంది ఉంటున్నట్లు యజమాని అలీ చెప్పారు.

సిసోడియానే సూత్రధారి.. బెయిలివ్వలేం: కోర్టు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఆప్ నేత మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ప్రాథమిక సాక్ష్యాలను బట్టి చూస్తే ఈ నేరపూరిత కుట్రకు ఆయనే సూత్రధారి అని ప్రత్యేక న్యాయమూర్తి ఎం.కె.నాగ్‌పాల్ అభిప్రాయపడ్డారు. ''ఈ మొత్తం ఉదంతంలో సిసోడియా పూర్తిస్థాయి భాగస్వామి. మద్యం విధానం రూపకల్పన మొదలుకుని ఉద్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు తీసుకున్న చర్యల దాకా అన్ని విషయాల్లోనూ ఆయనది కీలకపాత్ర. ఈ దశలో జైలు నుంచి విడుదల చేస్తే దర్యాప్తుకు తీవ్ర విఘాతం కలుగుతుంది. అందుకే బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నా'' అని పేర్కొన్నారు. ఈ కేసులో సిసోడియాను ఫిబ్రవరి 26న సీబీఐ అరెస్టు చేయడం తెలిసిందే. అనంతరం మార్చి 9న ఈడీ కూడా ఆయన్ను అరెస్టు చూపింది.

నేడే సిద్ధూ విడుదల!

పాటియాలా: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ క్రికెటర్ నవజోత్ సింగ్ సిద్ధూ (59) శనివారం జైలు నుంచి విడుదల కానున్నట్లు సమాచారం. 1988లో రోడ్డుపై జరిగిన దాడికి సంబంధించిన కేసులో ఆయన ప్రస్తుతం పంజాబ్‌లోని పాటియాలా కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నారు. ఆ కేసులో ఆయనకు న్యాయస్థానం ఏడాది జైలు శిక్ష విధించింది. 2022 మే 20వ తేదీ నుంచి ఆయన జైలులో ఉంటున్నారు. ఈ ఏడాది మే 16న జైలు నుంచి విడుదల కావాల్సి ఉంది. సత్ప్రవర్తన కింద 45 రోజులపాటు శిక్షను తగ్గించినట్లు తెలుస్తోంది. దీన్ని జైలు అధికారులు ధ్రువీకరించలేదు.



ముద్దాయి ట్రంప్!

న్యూయార్క్: అమెరికా చరిత్రలో రాజకీయంగా మరో పెను సంచలనానికి తెరలేచింది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందే చెప్పినట్టుగా ఆయన అరెస్టయ్యే అవకాశాలున్నాయి. పోర్న్‌స్టార్ స్టార్మీ డేనియల్స్ (స్టెఫానీ గ్రెగరీ క్లిఫర్డ్)తో లైంగిక సంబంధాలు బయటపెట్టకుండా ఉండేందుకు ఆమెకు డబ్బులు చెల్లించి అనైతిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారన్న ఆరోపణల కేసులో డొనాల్డ్ ట్రంప్‌పై అభియోగాలు నమోదయ్యాయి. న్యూయార్క్‌లోని మన్‌హట్టన్ గ్రాండ్ జ్యూరీ నేరాభియోగాలు నమోదు చేసినట్టుగా ధ్రువీకరించింది. ట్రంప్ లాయర్లతో కేసు విచారణను పర్యవేక్షిస్తున్న మన్‌హట్టన్ అటార్నీ జనరల్ అల్విన్ బ్రాగ్ మాట్లాడారు. ట్రంప్ లొంగిపోవడానికి సహకరించాలని కూడా బ్రాగ్ సూచించారు. దీంతో ట్రంప్ క్రిమినల్ కేసు విచారణను ఎదుర్కోవడంతో పాటు ఇలాంటి నేరాభియోగాలు ఎదుర్కొన్న మొట్టమొదటి మాజీ అధ్యక్షుడిగా అపఖ్యాతిని మూటకట్టుకున్నారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి మరోసారి వైట్‌హౌస్‌లోకి అడుగు పెట్టాలని కలలు కంటున్న వేళ నేరాభియోగాలు నమోదు కావడం నైతికంగా ట్రంప్‌కు ఎదురు దెబ్బ తగిలినట్టయింది. తనను అరెస్ట్ చేస్తారని, అదే జరిగితే రిపబ్లికన్ శ్రేణు లు, తన అభిమానులు దేశవ్యాప్తంగా ఘర్షణలకు దిగాలని కూడా గత వారం ఆయన పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.

కేసు నేపథ్యం ఇదీ..



2016 అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ తనతో ఉన్న లైంగిక సంబంధాలను బయటపెట్టకుండా ఉండేందుకు పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌ను డబ్బులిచ్చి ప్రలోభ పెట్టారన్న ఆరోపణలున్నాయి. అధ్యక్షుడిగా తన పరువు తీయకుండా ఉండడానికి ట్రంప్ లక్షా 30 వేల డాలర్లను అప్పట్లో తన లాయర్ మైఖేల్ కొహెన్ ద్వారా ముట్టజెప్పినట్టు డేనియల్స్ ఆరోపించారు. ఆ ఒప్పందం చెల్లదంటూ 2018లో ఆమె కోర్టుకెక్కారు. 2006 సంవత్సరంలో తనకు 27 ఏళ్ల వయసున్నప్పుడు ఒక గోల్ఫ్‌కోర్టులో ట్రంప్ పరిచయమయ్యారని, తనతో గడిపితే ఆయన నిర్వహించే రియాల్టీ షో 'ది అప్రెంటీస్'లో అవకాశం ఇస్తానని ఆశ కల్పించారని కొన్ని ఇంటర్వ్యూల్లో ఆమె చెప్పారు. ఆ తర్వాత తరచూ ఫోన్‌లో మాట్లాడేవారని 2007లో కలిసినప్పుడు ట్రంప్‌తో సన్నిహితంగా గడపడానికి నిరాకరించానని, అందుకే తనకు ఆ షో లో అవకాశం ఇవ్వకుండా ముఖం చాటేశారని తెలిపారు. ఈ విషయాన్ని బయట ఎక్కడా వెల్లడించవద్దని బెదిరించేవారని డేనియెల్స్ ఆరోపించారు. అయితే ట్రంప్ ఆమె ఆరోపణల్ని కొట్టిపారేశారు. ఇప్పుడు జ్యూరీ అభియోగాలు నమోదు చేయడంతో డేనియెల్స్ తన మద్దతుదారులందరికీ ధన్యవాదాలు చెప్పారు. తనకు ఎన్నో సందేశాలు వస్తున్నా స్పందించలేకపోతున్నానని, సంబరాలు కూడా చేసుకోలేకపోతున్నానని ట్వీట్ చేశారు.

ట్రంప్ కోర్టులో లొంగిపోతే ఆయన అరెస్ట్ ఎలా ఉండబోతోందన్న ఉత్కంఠ నెలకొంది. ట్రంప్ న్యూయార్క్ అధికారులకి సహకరిస్తారని ఆయన తరఫు లాయర్ స్పష్టం చేయడంతో ఆయనపై ఎలాంటి అరెస్ట్ వారెంట్లు జారీ చేయలేదు. ప్రస్తుతం ఫ్లోరిడాలో ఉన్న ట్రంప్‌కి సొంతంగా విమానం ఉంది. న్యూయార్క్‌లో ఏదైనా విమానాశ్రయానికి తన విమానంలో వెళ్లి అక్కడ్నుంచి మన్‌హట్టన్ కోర్టు హాలుకి కారులో వెళతారు. మంగళవారం నాడు ట్రంప్ కోర్టు ఎదుట లొంగిపోయే అవకాశాలున్నాయి.

వేలి ముద్రలు, ఫొటో తీసుకొని...

సర్వసాధారణంగా సామాన్య నిందితుల్ని కోర్టులో హాజరు పరచాలంటే వారికి సంకెళ్లు వేసి నడిపించుకుంటూ తీసుకువెళతారు. కానీ ట్రంప్ దేశానికి మాజీ అధ్యక్షుడు కావడంతో అలా జరిగే అవకాశాల్లేవు. మీడి యా కవరేజీకి అవకాశం లేకుండా ట్రంప్‌ని ప్రత్యేక ద్వారం నుంచి లోపలికి అనుమతించే అవకాశాలున్నాయి. క్రిమినల్ కేసులో అభియోగాలు నమోదు కావడంతో ట్రంప్ వేలిముద్రలు, పోలీసు రికార్డుల కోసం ఆయన ఫొటో తీసుకుంటారు. న్యాయమూర్తి ఎదుట హాజరు పరచడానికి ముందు ట్రంప్‌ని ప్రత్యేక సెల్‌లో ఉంచే బదులుగా వేరే ఒక గదిలో ఉంచుతారు. ఒక్కసారి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచిన తర్వాత ఈ కేసు పురోగతి ఎలా ఉండబోతుందన్నది తెలుస్తుంది.

ట్రంప్‌పై నేరాభియోగాలు..

- నమోదు చేసిన న్యూయార్క్ గ్రాండ్ జ్యూరీ
- క్రిమినల్ కేసులో విచారణ ఎదుర్కోనున్న తొలి అమెరికా మాజీ అధ్యక్షుడు
- పోర్న్ స్టార్ స్టార్మీ డేనియల్స్‌కు డబ్బులిచ్చిన అనైతిక ఒప్పందం కేసులో ఎదురుదెబ్బ..
- న్యాయవ్యవస్థను ఆయుధంగా వాడుకుంటున్నారు: ట్రంప్
- అరెస్టయితే ట్రంప్ భవిష్యత్‌పై చర్చోపచర్చలు

రాజకీయ అణచివేత: ట్రంప్

రాజకీయంగా తనను అణచివేయడానికి డెమొక్రాట్లు ఈ కుట్రకు పాల్పడ్డారని ట్రంప్ ఆరోపించారు. తనపై అభియోగాలు నమోదైన విషయం తెలిసిన వెంటనే ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ''ఇదంతా రాజకీయ అణచివేత. దేశ చరిత్రలో ఎన్నికల పరంగా ఉన్నత స్థాయిలో జరుగుతున్న జోక్యం ఇది. రాజకీయ ప్రత్యర్థుల్ని శిక్షించడానికి న్యాయవ్యవస్థని ఒక ఆయుధంగా వాడుకుంటున్నారు. నన్ను లొంగదీసుకోవడానికి డెమొక్రాట్లు అబద్ధాలు చెప్పారు. మోసాలు చేశారు. దొంగతనాలకు పాల్పడ్డారు. చివరికి ఇలాంటి అనూహ్యమైన చర్యకి దిగారు. ఒక అమాయకుడిపై అభియోగాలు నమోదు చేశారు. అధ్యక్షుడు జో బైడెన్ ఏం చెబితే మన్‌హట్టన్ జ్యూరీ అదే చేస్తోంది''అని ట్రంప్ ఆ ప్రకటనలో విరుచుకుపడ్డారు. మరోవైపు ట్రంప్ తరఫు లాయర్లు ఆయన ఏ తప్పు చేయలేదని దీనిని న్యాయపరంగానే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

ట్రంప్‌పై నేరాభియోగాలు మోపిన న్యూయార్క్ జ్యూరీ ఆ అభియోగాల పత్రాన్ని సీల్ వేసి ఉంచింది. ట్రంప్‌ను అరెస్ట్ చేసిన తర్వాతే సీల్ విప్పుతారు. ఈ కేసుని విచారించే న్యాయమూర్తి స్వయంగా కోర్టు హాలులో నేరాభియోగాలను చదివి వినిపిస్తారు. ఆయనపై ఏయే సెక్షన్ల కింద ఎలాంటి అభియోగాలు నమోదయ్యాయో అప్పుడే అందరికీ తెలుస్తుంది.

బెయిల్ లభిస్తుందా?

ఆ అభియోగాలను బట్టి ఆయనకు బెయిల్ లభిస్తుందా, లేదా అన్నది స్పష్టమవుతుంది. ట్రంప్‌పై ప్రయాణపరమైన ఆంక్షలుంటాయా, లేదా వంటివన్నీ కూడా ఆయన న్యాయమూర్తి ఎదుట హాజరైన తర్వాతే తేలుతాయి. ఈ కేసులో దోషిగా తేలితే ట్రంప్‌కు నాలుగేళ్ల కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. భారీగా జరిమానా కూడా విధిస్తారని కొందరు న్యాయనిపుణులు చెబుతున్నారు.

రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి ఎన్నికల్లో పోటీ పడుతున్న డొనాల్డ్ ట్రంప్ తనపై మోపిన అభియోగాలను రాజకీయంగా అనుకూలంగా మార్చుకునే వ్యూహాల్లో ఉన్నారు. అమెరికా చరిత్రలో అనూహ్యమైన ఈ పరిణామాన్ని రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని ప్రచారం చేయడానికి ట్రంప్ మద్దతుదారులు సిద్ధమవుతున్నారు.

రిపబ్లికన్ల నుంచి మద్దతు ఎంత?

ఈ కేసులో ట్రంప్‌పై అభియోగాలను ప్రాసిక్యూషన్ రుజువు చెయ్యలేకపోతే ట్రంప్ తన ఇమేజ్ మరింత పెరుగుతుందన్న భావనలో ఉన్నారు. అయితే రిపబ్లికన్ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ట్రంప్ మద్దతుదారులు ఈ కేసు వల్ల అధ్యక్ష ఎన్నికల్లో తమ పార్టీకి జరిగే లాభంపై ఇప్పట్నుంచే లెక్కలు వేస్తున్నారు. ''ఇది చాలా చిన్న కేసు. ట్రంప్‌ను వేధించడానికే ఈ కేసుని బయటకు తెచ్చారు''అని న్యూహ్యాంప్‌షైర్‌లో రిపబ్లికన్ పార్టీ చీఫ్ గ్రెగ్ హగ్ వ్యాఖ్యానించారు. ట్రంప్ రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి కావాలంటే పార్టీలో 25 నుంచి 30 శాతం కంటే ఎక్కువ మంది ఆయనకు మద్దతు పలకాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో అది కష్టమని ప్రత్యర్థి శిబిరం భావిస్తోంది. నేరాభియోగాలు ఎదుర్కొన్నా, శిక్షపడి జైలుకి వెళ్లినా ఎన్నికల్లో పోటీ చేయకూడదని అమెరికన్ రాజ్యాంగంలో నిబంధనలు లేవు. కానీ అలాంటి వ్యక్తిని అధ్యక్ష అభ్యర్థిని చేస్తే అనవసరంగా పార్టీ పరువు పోతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేరాభియోగాలతో ట్రంప్ ఇమేజ్ మరింత డ్యామేజ్ అయి మరో అభ్యర్థి, ఫ్లోరిడా గవర్నర్ రాన్ డెసాంటిస్‌కు అనుకూలంగా మారే అవకాశాలు ఉన్నాయన్న అభిప్రాయమైతే వినిపిస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

రిచర్డ్ వర్మకు కీలక పదవి

అమెరికా విదేశాంగ శాఖ డిప్యూటీ సెక్రటరీగా నియామకం



వాషింగ్టన్: అమెరికా విదేశాంగ శాఖ డిప్యూటీ సెక్రటరీగా భారతీయ అమెరికన్ రిచర్డ్ వర్మకు కీలక పదవి దక్కింది. శాఖకు సంబంధించిన నిర్వహణ, వనరుల వ్యవహారాలను ఆయన చూసుకుంటారు. దీన్ని అత్యంత శక్తిమంతమైన విదేశాంగ శాఖలో కీలకమైన సీఈఓ స్థాయి పోస్టుగా పరిగణిస్తుంటారు. 54 ఏళ్ల వర్మ నియామకాన్ని సెనేట్ 67–26 ఓట్లతో ఆమోదించింది. మాజీ దౌత్యవేత్త అయిన వర్మ ఒబామా హయాంలో విదేశాంగ శాఖ అసిస్టెంట్ సెక్రెటరీ (న్యాయ వ్యవహారాలు)గా కూడా పని చేశారు. 2015 నుంచి రెండేళ్లపాటు భారత్‌లో అమెరికా రాయబారిగా ఉన్నారు. వర్మ 1968లో అమెరికాలోని భారతీయ కుటుంబంలో జన్మించారు. అమెరికా వైమానిక దళ స్కాలర్‌షిప్‌తో కాలేజీ చదువు పూర్తి చేశారు. లాహిగ్ వర్సిటీ నుంచి బీఎస్, జార్జ్‌టౌన్ వర్సిటీ నుంచి ఎల్ఎల్ఎం, పీహెచ్‌డీ చేశారు. అనంతరం యూఎస్ ఎయిర్ ఫోర్స్‌లో జడ్జ్ అడ్వొకేట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. దేశాధ్యక్షుని నిఘా సలహా బోర్డులో, సామూహిక జనహనన ఆయుధాలు, ఉగ్రవాద కమిషన్ సభ్యునిగా చేశారు. ప్రస్తుతం మాస్టర్‌కార్డ్ చీఫ్ లీగల్ ఆఫీసర్, గ్లోబల్ పబ్లిక్ పాలసీ హెడ్‌గా ఉన్నారు. ఫోర్డ్ ఫౌండేషన్‌తో పాటు మరెన్నో ప్రతిష్టాత్మక బోర్డుల్లో సభ్యునిగా, ట్రస్టీగా కొనసాగుతున్నారు. విదేశాంగ శాఖ నుంచి అత్యుత్తమ సేవా మెడల్, వైమానిక దళం నుంచి మెరిటోరియస్ సర్వీస్ మెడల్, కౌన్సిల్ ఆఫ్ ఫారిన్ రిలేషన్స్‌నుంచి ఇంటర్నేషనల్ అఫైర్స్ ఫెలోషిప్ తదితరాలు దక్కించుకున్నారు.

షికారిపుర నుంచి విజయేంద్ర పోటీ

వరుణ నుంచి చేసే ప్రసక్తే లేదని తేల్చేసిన యడియూరప్ప

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుడు సిద్దరామయ్యపై పోటీ పడడానికి బీజేపీ నేత బి.ఎస్. యడియూరప్ప కుమారుడు వెనకడుగు వేశారు. వరుణ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో ఉన్న సిద్దరామయ్యపై తన కుమారుడు విజయేంద్ర పోటీపడే అవకాశాలున్నాయని నిన్నటికి నిన్న చెప్పిన యడియూరప్ప ఒక రోజు గడిచిందో లేదో మాట మార్చారు. తన కుమారుడు వరుణ నుంచి పోటీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పేశారు. శివమొగ్గ జిల్లాలోని తన సొంత నియోజకవర్గమైన షికారిపుర నుంచి విజయేంద్ర పోటీ చేస్తారని శుక్రవారం విలేకరులకు చెప్పారు. ఈ విషయాన్ని హైకమాండ్‌కు కూడా చెప్పానని వెల్లడించారు. అయితే వరుణ నుంచి విజయేంద్ర పోటీ చేయాలన్న ఒత్తిడి ఉందని అంగీకరించారు.

నడుస్తున్న కార్లో గ్యాంగ్‌రేప్

సాక్షి, బెంగళూరు: ఉద్యాననగరి బెంగళూరులో దారుణం జరిగింది. నడుస్తున్న కారులో దాదాపు 4 గంటలపాటు యువతిపై నలుగురు కామాంధులు అత్యాచారానికి ఒడిగట్టారు. నగరంలోని ఈజీపురకు చెందిన ఓ యువతి, తన స్నేహితుడితో కలిసి మార్చి 25న రాత్రి 9.30 గంటల సమయంలో కోరమంగళలోని పార్కులో కూర్చుంది. ఇద్దరూ సిగరెట్ తాగుతుండగా దగ్గర్లోనే కూర్చున్న ఓ యువకుడు పొగతో ఇబ్బందిగా ఉందంటూ వాదనకు దిగాడు. తర్వాత అక్కడి నుంచి వెళ్లిన అతడు, మరో ఇద్దరు స్నేహితులతో తిరిగి వచ్చాడు. బెదిరించి యువతి స్నేహితుడి అక్కడి నుంచి పంపించివేశారు. అనంతరం రాత్రి 11 గంటల సమయంలో మరో స్నేహితుడు కారులో రాగా అందరూ కలిసి యువతిని బలవంతంగా కారులో ఎక్కించుకున్నారు. తెల్లవారు జామున 3.30 గంటల వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో కారు నడుస్తుండగానే నలుగురూ ఒకరితర్వాత ఒకరు ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టారు. ఈజీపురలోనే రోడ్డు పక్క ఆమెను వదిలేసి వెళ్లిపోయారు. తీవ్ర అస్వస్థతకు గురైన బాధితురాలు రెండు రోజులపాటు ఆస్పత్రిలో చికిత్స పొందింది. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సతీశ్, విజయ్, శ్రీధర్, కిరణ్ అనే 22–26 ఏళ్ల నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు కూడా ఈజీపురకు చెందిన వారేనని పోలీసులు తెలిపారు.

అమృత్‌పాల్ కోసం డేరాల్లో గాలింపు

హోషియార్‌పూర్: వివాదాస్పద సిక్కు మత బోధకుడు, 'వారిస్ దే పంజాబ్' చీఫ్ అమృత్‌పాల్ సింగ్ ఆచూకీ ఇంకా లభించలేదు. అతడి కోసం పంజాబ్ పోలీసులు వేట మరింత ముమ్మరం చేశారు. హోషియార్‌పూర్ జిల్లాలో ప్రస్తుతం గాలింపు ఉధృతంగా కొనసాగుతోంది. సిక్కు మత సంస్థలైన 'డేరా'ల్లోనూ పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారు. హోషియార్‌పూర్ జిల్లాలోని మర్నియాన్‌తో పాటు సమీప గ్రామాల్లో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. నివాసిత ప్రాంతాలే కాకుండా పశువుల పాకలు, పొలాల్లో బోరుబావుల వద్ద ఉండే గదులను సైతం వదిలిపెట్టడం లేదు. డేరాల్లో అమృత్‌పాల్ తలదాచుకొని ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఆ దిశగా గాలింపు కొనసాగిస్తున్నట్లు చెబుతున్నారు. పోలీసులు ఇంటింటికీ తిరిగి అనుమానితులను ప్రశ్నిస్తున్నారు.

ఆస్పత్రి నుంచి నేడు పోప్ ఫ్రాన్సిస్ డిశ్చార్జి

రోమ్: కేథలిక్కుల మత గురువు పోప్ ఫ్రాన్సిస్(86) శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవుతారని వాటికన్ వర్గాలు తెలిపాయి. సెంట్ పీటర్స్ స్క్వేర్‌లో బుధవారం సంప్రదాయ వారాంతపు ప్రసంగం అనంతరం అస్వస్థతకు గురైన పోప్‌ను రోమ్‌లోని గెమెల్లి పాలీక్లినిక్‌లో చేర్పించారు. బ్రాంకైటిస్‌తో బాధపడుతున్నట్లు పరీక్షల్లో తేలింది. యాంటీబయాటిక్ చికిత్సకు స్పందిస్తున్నారని వాటికన్ ప్రతినిధి చెప్పారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కుదుటపడుతోందన్నారు. అయితే, ఆదివారం నుంచి ఈస్టర్ వీక్ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారా లేదా అనేది సందిగ్ధంలో పడింది. ఇప్పటికే మోకాలి నొప్పితో బాధపడుతున్న పోప్ కొన్ని కార్యక్రమాల్లో మాత్రమే పాల్గొంటున్నారు. కాగా, పోప్ ఫ్రాన్సిస్ త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షిస్తూ ప్రధాని మోదీ శుక్రవారం ట్వీట్ చేశారు.

మోదీ సర్టిఫికెట్లు చూపించాల్సిన అవసరం లేదు

గుజరాత్ హైకోర్టు తీర్పు ● కేజ్రీవాల్‌కు రూ.25,000 జరిమానా



అహ్మదాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్హత సర్టిఫికెట్ల వ్యవహారంలో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. మోదీకి చెందిన డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లను బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. ఈ సర్టిఫికెట్లను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు అందజేయాలంటూ కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) ఏడేళ్ల క్రితం జారీ చేసిన ఉత్తర్వును న్యాయస్థానం కొట్టివేసింది. అంతేకాకుండా కేజ్రీవాల్‌కు రూ.25,000 జరిమానా విధించింది. ఈ జరిమానా సొమ్మును నాలుగు వారాల్లోగా గుజరాత్ రాష్ట్ర న్యాయసేవల సంస్థ(జీఎస్ఎల్ఎస్ఏ)లో డిపాజిట్ చేయాలని కేజ్రీవాల్‌ను ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వుపై స్టే ఇవ్వాలంటూ కేజ్రీవాల్ తరఫు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించింది.

అసలేం జరిగింది?

తన విద్యార్హతల విషయంలో ప్రభుత్వ రికార్డులను బయటపెట్టడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, నరేంద్ర మోదీ విద్యార్హతల సర్టిఫికెట్లను బహిర్గతం చేయాలని కోరుతూ కేజ్రీవాల్ 2016 ఏప్రిల్‌లో సమాచార హక్కు చట్టం కింద సీఐసీకి దరఖాస్తు చేశారు. దీంతో మోదీకి చెందిన డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లను కేజ్రీవాల్‌కు ఇవ్వాలంటూ గుజరాత్ యూనివర్సిటీ, ఢిల్లీ యూనివర్సిటీని సీఐసీ ఆదేశించింది. సీఐసీ ఆదేశాలను సవాలు చేస్తూ గుజరాత్ యూనివర్సిటీ గుజరాత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సీఐసీ ఆదేశాలపై మూడు నెలల తర్వాత హైకోర్టు స్టే విధించింది. ఈ కేసులో న్యాయస్థానం ఫిబ్రవరిలో మళ్లీ విచారణ ప్రారంభించింది. గుజరాత్ యూనివర్సిటీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. మోదీ విద్యార్హతల విషయంలో దాచిపెట్టడానికి ఏమీ లేదని, సమాచారమంతా ప్రజాబాహుళ్యంలో ఇప్పటికే అందుబాటులో ఉందని వెల్లడించారు. యూనివర్సిటీ వెబ్‌సైట్‌లోనూ వివరాలు ఉన్నాయని తెలిపారు. ఒక వ్యక్తి బాధ్యతారహితమైన అత్యుత్సాహానికి సమాధానం చెప్పాల్సిన పనిలేదన్నారు. మోదీ సర్టిఫికెట్లను ప్రత్యేకంగా బయటపెట్టడంలో ప్రజాప్రయోజనం ఏమీ లేదని పేర్కొన్నారు. అలాగే ఇది ప్రధానమంత్రి గోప్యతకు భంగం కలిగిస్తుందని తుషార్ మెహతా వివరించారు. అయితే, మోదీ సర్టిఫికెట్లు ఇంటర్నెట్‌లో లేవని, అందుకే ఆధారాలు కోరుతున్నామని కేజ్రీవాల్ తరఫు న్యాయవాది చెప్పారు. జస్టిస్ బీరెన్ వైష్ణవ్ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది. మోదీ సర్టిఫికెట్లను పీఎంఓ గానీ, గుజరాత్ వర్సిటీ గానీ చూపించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. కేజ్రీవాల్‌కు జరిమానా విధించింది. కేంద్ర ప్రభుత్వ సమాచారం ప్రకారం.. ప్రధాని మోదీ 1978లో గుజరాత్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్(డిగ్రీ), 1983లో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి పోస్టు–గ్రాడ్యుయేషన్(పీజీ) పూర్తి చేశారు.

అప్పీల్ చేస్తాం: ఆప్

గుజరాత్ హైకోర్టు తీర్పుపై డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) గుజరాత్ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రణవ్ ఠక్కర్ చెప్పారు. ప్రధాన మంత్రి విద్యార్హతల సమాచారాన్ని తెలుసుకొనే హక్కును ఈ తీర్పుతో ప్రజలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అరవింద్ కేజ్రీవాల్‌కు కోర్టు జరిమానా విధించడం తమకు ఆశ్చర్యం కలిగించిందన్నారు.

ఆ హక్కు ప్రజలకు లేదా?: కేజ్రీవాల్

ప్రధానమంత్రి విద్యార్హతలను తెలుసుకొనే హక్కు దేశ ప్రజలకు లేదా? అని కేజ్రీవాల్ నిలదీశారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ''ప్రధానమంత్రి ఎంతవరకూ చదువుకున్నారో తెలుసుకొనే హక్కు ప్రజలకు లేదా? సర్టిఫికెట్లను కోర్టుకు చూపించేందుకు ప్రధాని ఎందుకు తిరస్కరించారు? ప్రధాని చదివిన డిగ్రీ, పీజీ సర్టిఫికెట్లు చూపించాలని కోరితే జరిమానా విధించారు. అసలేం జరుగుతోంది? నిరక్షరాస్యుడు, లేదా తక్కువ చదువు కున్న ప్రధానమంత్రి దేశానికి ప్రమాదకరం'' అని పునరుద్ఘాటించారు.

నాసా 'మూన్ టు మార్స్' చీఫ్‌గా మనోడు!



వాషింగ్టన్: అమెరికా అంతరిక్ష సంస్థ నాసా 'మూన్ టు మార్స్' కార్యక్రమం హెడ్‌గా భారత సంతతికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, రోబోటిక్స్ ఇంజనీర్ అయిన అమిత్ క్షత్రియ నియమితులయ్యారు. చంద్రుడిపై సుదీర్ఘ కాలం మకాం వేయడానికి, అక్కడి నుంచి అంగారక గ్రహంపైకి మనుషులను పంపే బృహత్తర లక్ష్యంతో నాసా ఈ మిషన్‌కు రూపకల్పన చేసింది. 'మూన్ టు మార్స్' కార్యక్రమానికి సారథ్యం వహించనున్న అమిత్‌క్షత్రియ నాసా ఎక్స్‌ప్లోరేషన్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్ మిషన్ డైరెక్టరేట్‌లో కొత్తగా ఏర్పాటయ్యే కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తారు. ఇప్పటి వరకు ఆయన కామన్ ఎక్స్‌ప్లోరేషన్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్ డివిజన్ తాత్కాలిక డిప్యూటీ అసోసియేట్ అడ్మినిస్ట్రేటర్‌గా ఉన్నారు. 2003 నుంచి అంతరిక్ష కార్యక్రమాల్లో పనిచేస్తున్నారు. ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి అమెరికా వలస వచ్చారు. క్షత్రియ విస్కాన్సిన్‌లోని బ్రూక్‌ఫీల్డ్‌లో పుట్టారు.

దేశ విభజనను పాక్ ప్రజలూ తప్పుబడుతున్నారు

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

భోపాల్: పాకిస్తాన్ ప్రజలు సంతోషంగా లేరని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. దేశ విభజన తప్పని పాకిస్తాన్ ప్రజలంతా అంటున్నారన్నారు. అఖండ భారత్ వాస్తవం కాగా విభజిత భారత్ ఒక పీడకల అని అభివర్ణించారు. భారతదేశ విభజన తప్పనే విషయాన్ని, స్వాతంత్ర్యం వచ్చిన ఏడు దశాబ్దాల అనంతరం ఇప్పుడు వారు నమ్ముతున్నారని భగవత్ వ్యాఖ్యానించారు. 'స్వాతంత్ర్యానికి ముందు భారత్ నుంచి తెగదెంపులు చేసుకుని అహంకారపూరితంగా వెళ్లిన వారింకా సంతోషంగా ఉన్నారా? లేదు, బాధలు పడుతున్నారు' అంటూ పాకిస్తానీయులనుద్దేశించి ఆయన అన్నారు. రెండు దేశాల మధ్య దెబ్బతిన్న సంబంధాలపై ఆయన.. 'పాకిస్తాన్‌పై భారత్ దాడి చేయాలన్నది నా ఉద్దేశం ఎంతమాత్రం కాదు. ఇతరులపై దాడులు చేయాలంటూ పిలుపునిచ్చే సంస్కృతి భారత్‌లో లేదు. ఆత్మరక్షణ కోసం దాడులకు తగిన బుద్ధి చెప్పాలనేదే భారత్ సంస్కృతి. దీనినే ఆచరిస్తాం. ఇదే కొనసాగుతుంది'అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య యోధుడు హేము కలానీ జయంతిని పురస్కరించుకుని సింధీలు భోపాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భగవత్ మాట్లాడారు.

పాక్‌లో ఆహార పంపిణీలో మళ్లీ తొక్కిసలాట

కరాచీ: పాకిస్తాన్‌లోని రేవు నగరం కరాచీలో మరో విషాదం చోటుచేసుకుంది. రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం ప్రజలకు ఆహార పదార్థాలు పంపిణీ చేస్తుండగా, తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 11 మంది మృతిచెందారు. మరికొందరు గాయపడ్డారు. బాధితుల్లో మహిళలు, చిన్నారులు సైతం ఉన్నారు. ఆహార పదార్థాల పంపిణీ జరుగుతుండగా, కొందరు అక్కడే ఉన్న కరెంటు తీగపై కాలు వేశారని, దాంతో భయందోళనకు గురై ఒకరినొకరు తోసుకున్నారని, ఫలితంగా పక్కనే ఉన్న కాలువలో పలువురు పడిపోవడం, 11 మంది మరణించడం క్షణాల్లో జరిగిందని అధికారులు వెల్లడించారు. ఉచిత ఆహార పంపిణీ కార్యక్రమాన్ని పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ గతవారం ప్రారంభించారు. పంజాబ్ ప్రావిన్స్‌లో ఇటీవలే గోధుమ పిండి పంపిణీలో తొక్కిసలాట జరిగి 11 మంది దుర్మరణం చెందిన సంగతి తెలిసిందే.

కాల్వలోకి దూసుకెళ్లిన కారు..ఏడుగురు మృతి

సంబల్‌పూర్(ఒడిశా): ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో శుక్రవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఝర్సుగూడ జిల్లా బడధారకు చెందిన కొందరు బొలెరో వాహనంలో పరమన్‌పూర్‌లో గురువారం జరిగిన వివాహవేడుకకు వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా వారి వాహనం అదుపుతప్పి, బోల్తాపడి రోడ్డు పక్కనే ఉన్న ఘూమ్ కెనాల్‌లోకి దూసుకెళ్లింది. ఘటనలో ఏడుగురు చనిపోగా, మరో నలుగురు గాయపడినట్లు సంబల్పూర్ కలెక్టర్ అనన్య దాస్ చెప్పారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు.



శుక్రవారం కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ జిల్లాలో ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై కారును తనిఖీ చేస్తున్న ఎన్నికల అధికారులు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న విషయం తెలిసిందే. గంటి సుబ్రమణ్య ఆలయానికి వెళ్తుండగా జరిపిన ఈ తనిఖీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ఇండోర్ ఆలయంలో విషాదం.. 36కు చేరిన మరణాలు

గల్లంతైన వారినందరినీ వెలికితీశామన్న అధికారులు ● సీఎం చౌహాన్‌కు నిరసనల సెగ

ఇండోర్: ఇండోర్‌లోని బేలేశ్వర్ మహాదేవ్ ఝులేలాల్ ఆలయంలో గురువారం మెట్ల బావి పైకప్పు కూలిన ఘటనలో మృతుల సంఖ్య 36కు పెరిగింది. గల్లంతైన వారందరినీ వెలికితీశారు. ''కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనలో గల్లంతైనట్లు భావిస్తున్న మొత్తం 36 మృతదేహాలను వెలికితీశాం. గాయపడిన మరో 17 మందిని ఆస్పత్రులకు తరలించాం. ఇద్దరిని ప్రథమ చికిత్స అనంతరం ఇళ్లకు పంపించి వేశాం'' అని అధికారులు తెలిపారు. ''అన్వేషణ కార్యక్రమాన్ని ఆపలేదు. బావిలో పడిన స్లాబ్ శిథిలాలను, పూడిక మొత్తం తొలగించే పని ఇంకా కొనసాగుతోంది'' సహాయ, రక్షణ కార్యక్రమాల్లో ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పాలుపంచుకుంటున్నారు. ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్ సంయుక్త బృందం బావిలోకి క్రేన్‌ను, ట్రాలీని దించి, మృతదేహాలను బయటకు తీసుకువచ్చింది. ఆలయ ప్రాంతం ఇరుగ్గా ఉండటంతో సహాయ కార్యక్రమాలు మొదట సజావుగా సాగలేదు. గోడను పగులగొట్టి పైపును దించి బావిలో నీటినంతటినీ బయటకు పంప్ చేశారు'' అని వివరించారు. స్థానిక పటేల్‌నగర్ ఏరియాలోని ఆలయంలో గురువారం నవమి పూజల్లో పెద్ద సంఖ్యలో జనం పాల్గొన్నారు. కొందరు భక్తులు ఆలయంలోని పురాతన మెట్లబావిపై ఏర్పాటు చేసిన స్లాబ్‌పైకి చేరారు. స్లాబ్ కూలడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే.



ఘటనాస్థలిని పరిశీలించిన సీఎం

ఉదయం సంఘటనా స్థలిని సందర్శించిన మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌కు నిరసనల సెగ తగిలింది. మృతుల కుటుంబాలకు సంతాపం తెలుపుతుండగా సీఎం ముర్దాబాద్, సిగ్గు సిగ్గు అంటూ ప్రజలు నినాదాలు చేశారు. అంతకుముందు ఆయన ఆస్పత్రుల్లో క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. దర్యాప్తు అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
శనివారం । 1 । ఏప్రిల్ । 2023

నెల రోజులు నిరసనలు

- కాంగ్రెస్ నిర్ణయం

సాక్షి, చెన్నై: రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజులు నిరసనలకు కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ నేత ముకుల్ వాస్నిక్ రాష్ట్ర నేతలను ఆదేశించారు. శుక్రవారం చెన్నైలోని సత్యమూర్తి భవన్‌లో కాంగ్రెస్ జిల్లాల కార్యదర్శుల సమావేశం జరిగింది. ఇందులో రాహుల్‌గాంధీపై అనర్హత వేటును తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేశారు. ఆయనపై కేంద్రం వ్యవహరించిన తీరును ఖండిస్తూ ఏప్రిల్ 2వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల నిరసనకు నిర్ణయించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీపరంగా ఉన్న 74 జిల్లాల కార్యదర్శుల నేతృత్వంలో వేర్వేరుగా నిరసనలకు కార్యాచరణ సిద్ధం చేశారు.

న్యూస్‌రీల్

3న జాతీయపార్టీల నేతలతో స్టాలిన్ భేటీ

సాక్షి, చెన్నై: లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధం అయ్యే విధంగా జాతీయ స్థాయిలోని ప్రతి పక్ష పార్టీలను ఏకం చేసే విధంగా ఓ సమావేశానికి డీఎంకే అధ్యక్షుడు సీఎం స్టాలిన్ నిర్ణయించారు. ఏప్రిల్ 3న చెన్నై నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతీయ స్థాయి నేతలతో సమావేశం కానున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా బీజేపీ యేతర పార్టీలను ఏకం చేయడానికి జాతీయ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ సైతం ఓ ప్రయత్నానికి సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ఈనెల 3న జాతీయ స్థాయి నేతలతో సమావేశం నిమిత్తం వీడియో కాన్ఫరెన్స్ భేటీ ఏర్పాట్లు చేస్తున్నారు. చెన్నై నుంచి ఈ సమావేశంలో స్టాలిన్ పాల్గొననున్నారు. బీఆర్ఎస్, తృణముల్ పార్టీలకు చెందిన ముఖ్య నేతలు, వామపక్ష నేతలు, కశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా తదితర బీజేపీ యేతర పార్టీలు, తమిళనాడులోని మిత్ర పక్ష పార్టీలు అంటూ మొత్తం 18 పార్టీల నాయకులను ఈ సమావేశానికి స్టాలిన్ ఆహ్వానించారు.

వృద్ధురాలికి అరుదైన శస్త్ర చికిత్స

సాక్షి, చెన్నై : చెన్నై వైద్యులు 89 ఏళ్ల వృద్ధురాలికి అరుదైన అడ్వాన్సుడు ఎండోరాలజీ, గర్భాశయ శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. దీనిపై శుక్రవారం సవిత మెడికల్ కళాశాల వైద్యులు ప్రొఫెసర్ ముత్తు లత మీడియాకు వివరించారు. మేరీ జాన్సన్(89) కొద్ది రోజుల క్రితం తమ ఆసుపత్రికి వచ్చినట్టు తెలిపారు. ఆమెను గైనిక్ బృందం ప్రొఫెసర్ హిప్సిబా, యూరాలజీ బృందం డాక్టర్ గ్రిఫిన్ పరిశీలించారని తెలిపారు. ఆమెకు మూత్రాశయంలో సమస్యలు గుర్తించినట్టు పేర్కొన్నారు. 2600 బ్లాడర్ స్టోన్లు ఉండడాన్ని గుర్తించి ఏక కాలంలో రెండు రకాల శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ణయించామన్నారు. ఆమె కుటుంబ సభ్యులు అంగీకరించడంతో ఆధునిక పద్ధతులను అనుసరించి అడ్వాన్సుడు ఎండోరాలజీ, గర్భాశయ శస్త్ర చికిత్సలను విజయవంతం చేశామన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నట్టు చెప్పారు.

ఎనిమిది మంది శిశువులకు అస్వస్థత

- ఆశ్రమంలో కలకలం
- శ్వాస సమస్యకు చికిత్స

సాక్షి, చెన్నై : తిరుచ్చిలోని ప్రభుత్వ సహకారంతో నడుస్తున్న పసి బిడ్డల ఆశ్రమంలో ఎనిమిది మంది శిశువులకు టీకా రూపంలో అస్వస్థత నెలకొంది. వీరికి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. తిరుచ్చి తిరువానై మాంబలం రోడ్డులో ప్రభుత్వ సహకారంతో పసిబిడ్డల ఆశ్రమం నడుపుతున్నారు. ఇక్కడ తిరుచ్చి పరిసర జిల్లాల్లోని అనాథ శిశువులను తీసుకొచ్చి ఆశ్రయం కల్పిస్తున్నారు. ఇక్కడ 3 నుంచి 9 నెలల శిశువులు 20 మంది ఉన్నారు. వీరికి నెలసరి టీకా ఆరోగ్య కేంద్రంలో గురువారం వేశారు. ఈ పరిస్థితులలో శుక్రవారం టీకా వేసిన పిల్లలలో ఎనిమిది మందికి శ్వాస సమస్య శుక్రవారం తలెత్తింది. దీంతో ఆశ్రమ నిర్వాహకులు కలవరం చెందారు. ఆగమేఘాలపై పిల్లలను తిరుచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పిల్లల్లో పౌష్టికాహార లోపం ఉన్నట్టు గుర్తించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

విభిన్న ప్రతిభకు ప్రాధాన్యం

సాక్షి, చెన్నై: నైపుణ్యం, విభిన్న ప్రతిభ, అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా రాష్ట్రంలో పెట్టుబడులు విస్తృతం చేయడానికి సిటీ గ్రూప్ నిర్ణయించింది. చెన్నైలోని సిటీ సొల్యూషన్స్ సెంటర్ (సీఎస్‌సీ)ని శుక్రవారం సిటీ గ్రూప్ సీఈఓ జెన్ ఫ్రెజర్, ఏపీఏసీ సీఈఓ పీటర్ బాబేజ్, సిటీ ఇండియా సీఈఓ అషుఖుల్లర్‌సందర్శించారు. ఇక్కడి సదుపాయాలు, మరింతగా చేయాల్సిన ఏర్పాట్లు, సాంకేతికత, ఇన్నో వేషన్ కార్యక్రమాలు, మెరుగైన సామర్థ్యం, విభిన్న, అత్యంత నైపుణ్యం కలిగిన టాలెంట్ , కెరీర్ అవకాశాలను పరిశీలించారు. అషు ఖుల్లర్ మట్లాడుతూ, 80కు పైగా దేశాలలో దశాబ్దానికి పైగా తమ సేవలు విస్తృతంగా జరుగుతున్నాయని వివరించారు. ప్రస్తుతం చెన్నైలో కల్పించిన వసతులు, డిజిటల్ అంశాలను పరిశీలించామన్నారు. సీఎస్‌సీలు గ్లోబల్ బ్యాంకింగ్, మార్కెటింగ్, సెక్యూరిటీ, రిస్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్, క్యాష్ మేనేజ్ మెంట్, అత్యుత్తమ డిజిటల్ బ్యాంకింగ్ అనుభవాన్ని అందించడానికి ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. అలాగే, నైపుణ్యం, విభిన్న ప్రతిభ, అత్యాధునిక మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు విస్తృతం చేయనున్నామన్నారు.



కళాక్షేత్రలో కలకలం

- విద్యార్థినుల పోరుబాట
- సీఎంకు బాధిత విద్యార్థినుల లేఖ
- విచారణ వేగవంతం
- అసెంబ్లీని తాకిన లైంగిక వేధింపుల సెగ
- చట్టపరంగా చర్యలు..సీఎం



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై : ప్రసిద్ధి చెందిన నాట్య, సంగీత కళా నిలయం కళాక్షేత్రలో లైంగిక వేధింపుల వ్యవహారం శుక్రవారం కలకలం రేపింది. విద్యార్థినుల పోరుబాట, సామాజిక మాధ్యమాలలో సమాచారం వైరల్‌గా మారడంతో జాతీయ మహిళా కమిషన్ రంగంలోకి దిగింది. సీఎం ఎంకే స్టాలిన్‌కు బాధిత విద్యార్థినులు లేఖ రాయడంతో వ్యవహారం అసెంబ్లీని సైతం తాకింది. చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఎం ప్రకటించారు. అయితే, ఇంతవరకు తమకు బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెన్నై పోలీసు అదనపు కమిషనర్ ప్రేమానంద్ సిన్హా స్పష్టం చేశారు.

చెన్నై తిరువాన్మియూరు కేంద్రంగా కళాక్షేత్ర ఫౌండేషన్ కొనసాగుతోంది. ఇది 1930లో నెలకొల్పిన సంగీత, నాట్య కళానిలయం. పురాతన, ప్రసిద్ధి చెందిన ఈ కళాక్షేత్రంలో శిక్షణ పొందేందుకు దేశ విదేశాల నుంచి విద్యార్థినులు మొగ్గు చూపుతుంటారు. దీని నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం సైతం నిధులను కేటాయిస్తోంది. ఈ ఫౌండేషన్ పరిధిలోని రుక్మిణి దేవి కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో కొంత కాలంగా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న లైంగిక వేధింపుల వ్యవహారం తాజాగా వెలుగులోకి రావడంతో కలకలం రేగింది.

ఫిర్యాదు...విచారణ..

ఇక్కడ వందలాది మంది విద్యార్థినులు శిక్షణ పొందుతున్నారు. ఈ ఫౌండేషన్‌కు డైరెక్టర్‌గా రేవతి రామచంద్రన్ వ్యవహరిస్తున్నారు. ప్రిన్సిపల్‌గా ఉమామహేశ్వరి ఉన్నారు. ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థినులను స్పెషల్ క్లాస్ పేరిట అధ్యాపకులుగా ఉన్న హరిపద్మన్, సంజిత్ రాయ్ , సాయి కృష్ణ, శ్రీనాథ్ తమ వద్దకు పిలిపించుకుని లైంగిక



విద్యార్థినులతో మాట్లాడుతున్న పోలీసులు

వేధింపులకు పాల్పడుతున్నట్టు కొంత మంది విద్యార్థినులు డైరెక్టర్‌కు కొద్ది రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఆమె విచారణకు కమిటీని నియమించారు. ఓపెన్ హౌస్‌గా ఈ కమిటీ విద్యార్థినులందరినీ విచారించింది. అయితే, ఏ ఒక్కరూ ధైర్యం చేసి ముందుకు రాలేదు. ఇవన్నీ ఆరోపణలే అని తేల్చిన ఆ కమిటీ తన నివేదికను డైరెక్టర్‌కు సమర్పించింది. అయినా, ఆ అధ్యాపకుల ఆగడాలు తగ్గకపోవడంతో బాధిత విద్యార్థినులు సామాజిక మాధ్యమాలను అస్త్రంగా చేసుకుని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

అసెంబ్లీకి వ్యవహారం...

తమకు న్యాయం చేయాలని విద్యార్థినులు సీఎంకు లేఖ రాసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో వ్యవహారం అసెంబ్లీకి చేరింది. కాంగ్రెస్, వీసీకే పార్టీలు ఈ వ్యవహారంపై సీఎం స్టాలిన్ సమాధానం ఇవ్వాలని కోరాయి. దీంతో సీఎం స్టాలిన్ ప్రసంగించారు. విద్యార్థినులు ఆందోళన చేస్తున్న సమాచారంతో వారికి భద్రతగా మహిళా పోలీసుల అధికారి పర్యవేక్షణలో మహిళా పోలీసు బృందాన్ని రంగంలోకి దించినట్టు వివరించారు. అయితే, ఈ వ్యవహారంపై పోలీసులకు ఇంతవరకు లిఖిత పూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు నిర్ధారణ అయిన పక్షంలో, వేధింపులకు పాల్పడిన వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించబోమన్నారు. చట్టపరంగా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ వ్యవహారంపై చెన్నై పోలీసు అదనపు కమిషనర్ ప్రేమానంద్ సిన్హా మీడియాతో మాట్లాడుతూ, తమకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు రాలేదని, అయితే, ఈ వ్యవహారంపై సామాజిక మాధ్యమాలలో తప్పుడు సమాచారం, ప్రచారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రంగంలోకి మహిళా కమిషన్..

సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్న విద్యార్థినుల ఆవేదనను జాతీయ మహిళా కమిషన్ చైరపర్సన్ రేఖా శర్మ గుర్తించారు. తమిళనాడు డీజీపీ శైలేంద్రబాబును విచారణకు ఆదేశించారు. ఆయన కళాక్షేత్ర డైరెక్టర్ రేవతి రామచంద్రన్‌ను విచారించారు. అవన్నీ ఆరోపణలే అని తమ విచారణలో వెలుగు చూసినట్టు డీజీపీకి ఆమె వివరణ ఇచ్చినట్టు సమాచారం. అదే సమయంలో గురువారం రేఖ శర్మ స్వయంగా విచారణకు రంగంలోకి దిగడంతో వ్యవహారం ముదిరింది. ఆమె వద్ద తమ ఆవేదనను స్వయంగా విద్యార్థినులు వ్యక్తం చేయడంతో కళాశాల యాజమాన్యం ఆగమేఘాలపై ఏప్రిల్ 6వ తేదీ వరకు సెలవు ప్రకటించింది. దీంతో 60 మంది విద్యార్థినులు తమకు న్యాయం జరగాలంటూ కళాశాలలో నిరసనకు దిగారు. ముఖ్యమంత్రి స్టాలిన్‌కు లేఖ రాశారు. దీంతో శుక్రవారం కళాక్షేత్ర వార్తల్లోకి ఎక్కింది. కళాశాలలో విద్యార్థినుల పోరాటం కొనసాగుతుండడంతో మహిళా పోలీసులు రంగంలోకి దిగారు. విద్యార్థినులకు కళాశాల వెలుపల నుంచి భద్రత కల్పించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ కుమారి ఆ కళాశాలకు చేరుకుని విద్యార్థినుల వద్ద విచారించారు. వారి వాంగ్మూలం సేకరించారు. ఆ నలుగురు అధ్యాపకులు ఇక, విద్యా బోధనలకు హాజరు కారని యాజమాన్యం విద్యార్థినులకు హామీ ఇచ్చింది. అయితే, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థినులు పోరు బాట కొనసాగిస్తున్నారు.



కళాశాలలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ కుమారి విచారణ

మాస్క్‌లు తప్పనిసరి!

- నేటి నుంచి అమల్లోకి
- ఆరోగ్యశాఖా మంత్రి సుబ్రమణియన్



సాక్షి, చెన్నై: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులు, విజిటర్లు, వైద్యసిబ్బంది ప్రతిఒక్కరూ మాస్క్‌లు తప్పనిసరిగా ధరించాల్సిందేనని ఆరోగ్యశాఖా మంత్రి ఎం సుబ్రమణియన్ తెలిపారు. శనివారం నుంచి ఈ కొత్త కట్టుబాటు అమల్లోకి వస్తున్నట్టు ప్రకటించారు. దేశ వ్యాప్తంగా మళ్లీ కరోనా కేసుల సంఖ్య పెరుగుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఇది వరకు రోజుకు సింగిల్ డిజిట్ కేసులు నమోదు అయ్యేవి. ప్రస్తుతం డబుల్ డిజిట్ వేగం పెరిగి ట్రిపుల్ డిజిట్ సంఖ్యను మరి కొద్దిరోజుల్లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ముందు జాగ్రత్తలపై ఆరోగ్యశాఖ దృష్టి పెట్టింది. ఆస్పత్రుల్లో ముందస్తు ఏర్పాట్లు వేగవంతం చేశారు. మున్ముందు మరింతగా కేసుల సంఖ్య పెరిగిన పక్షంలో ఎదుర్కొనేందుకు తగ్గ మందులు, ఆక్సిజన్, ప్రతేక బెడ్లు సిద్ధం చేశారు. అదేసమయంలో ప్రజలు సైతం ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించే విధంగా హుకుం జారీ చేశారు. అయితే, వీటిని అచరించడంలో ప్రజలు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులు నిబంధనలు తప్పనిసరిగా పాటించే విధంగా కొత్త కట్టుబాట్లు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి.

కొత్త కట్టుబాటు..

ఈ కొత్తకట్టుబాటు గురించి మంత్రి సుబ్రమణియన్ శుక్రవారం మీడియాకు వివరించారు. ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలాగే, ప్రజల్ని రక్షించే వృత్తిలో ఉన్న వైద్యులు, ఇతర సిబ్బందికి కూడా రక్షణ కల్పించాల్సిన బాధత్య ఉందన్నారు. ఇందుకోసం కొత్త కట్టుబాటు తప్పనిసరి చేశామన్నారు. శనివారం నుంచి రాష్ట్రంలో జిల్లా ఆస్పత్రులు, నగర, మండల ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వం తరఫున కొనసాగుతున్న క్లినిక్‌లు, ఆరోగ్యశిబిరాలకు వచ్చే రోగులు, వారి సహాయకులు, విజిటర్లు ఇలా ప్రతి ఒక్కరూ మాస్క్‌లను తప్పనిసరిగా ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. వైద్య సిబ్బంది, ఇతర సిబ్బంది మాస్క్‌లు ధరించి విధుల్లో కొనసాగాలని ఆదేశించారు.

తుది విచారణకు సిద్ధం

- కోర్టులో పన్నీరు, పళణి స్పష్టీకరణ
- ఏప్రిల్ 3న నిర్ణయం




పళణి, పన్నీరు

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే వివాదంలో తుది విచారణకు సిద్ధం అని హైకోర్టుకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పన్నీరు సెల్వం, సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం స్పష్టం చేశారు. దీంతో ఈ వ్యవహారంలో తుది విచారణ నిమిత్తం ఏప్రిల్ 3వ తేదీ కోర్టు తన నిర్ణయాన్ని వెల్లడించనుంది.

అన్నాడీఎంకే వివాదాలు కోర్టు పిటిషన్లు, అప్పీలు పిటిషన్ల రూపంలో బుల్లి తెర ధారవాహికను తలపిస్తూ ముందుకు సాగుతున్న విషయం తెలిసిందే. పళణిస్వామి నేతృత్వంలో జరిగిన పార్టీ సర్వసభ్య సమావేశం, అందులోని తీర్మానాలకు, ప్రధాన కార్యదర్శి ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ప్రత్యేక బెంచ్ తీర్పు వెలువరించింది. దీంతో పళణిస్వామి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పగ్గాలు చేపట్టారు. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ పన్నీరుసెల్వం , ఆయన మద్దతు సీనియర్ నేతలు వైద్యలింగం, జేసీడీ ప్రభాకర్, మనోజ్ పాండియన్ హైకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలు చేశారు.

ఇక తుది విచారణే..

న్యాయమూర్తులు మహాదేవన్, మహ్మద్ షఫీ నేతృత్వంలోని ద్విసభ్య బెంచ్ ముందు శుక్రవారం ఈ అప్పీలు పిటిషన్లు విచారణకు వచ్చాయి. అన్నాడీఎంకే వివాదాల పిటిషన్ల విచారణ గత ఏడాది కాలంగా కోర్టుల్లో కొనసాగుతూ రావడంపై న్యాయమూర్తులు ఓ దృష్టి పెట్టినట్టున్నారు. ఇందుకు అద్దం పట్టే విధంగా తుది విచారణకు సిద్ధమా అని పన్నీరు, పళణి తరపు న్యాయవాదులను ఉద్దేశించి ప్రశ్నించారు. ఈ సమయంలో పన్నీరు తరపు న్యాయవాదులు స్పందిస్తూ తన కచ్చిదారుడ్ని పార్టీ నుంచి తొలగించడంలో నిబంధనలు ఉల్లంఘించినట్టు ప్రత్యేక బెంచ్ స్పష్టం చేసిన విషయాన్ని ద్విసభ్య బెంచ్ దృష్టికి తెచ్చారు. ఈ వ్యహారంలోనే నిబంధనల ఉల్లంఘన జరిగిన నేపథ్యంలో, ఆ తర్వాత పరిణామాలన్నీ ఎలా ఆమోద యోగ్యం అవుతాయన్న విషయాన్ని కోర్టుకు వివరించారు. దీంతో న్యాయమూర్తులు స్పందిస్తూ, ఈ వ్యవహారంలో తుది విచారణకు సిద్ధమా అని ప్రశ్నించారు. దీంతో తాము సిద్ధంగా ఉన్నామని పళణి, పన్నీరు తరపు న్యాయవాదులు స్పష్టం చేశారు. దీంతో తదుపరి విచారణను ఏప్రిల్ 3వ తేదీకి న్యాయమూర్తులు వాయిదా వేశారు. ఆ రోజున తీసుకునే నిర్ణయం మేరకు నిరంతరాయంగా వాదనలు, విచారణను ముగించి త్వరితగతిన తీర్పు వెలువరించే అవకాశాలు ఉన్నాయి. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పగ్గాలు తన గుప్పెట్లోకి రావడంతో ఢిల్లీలోని కేంద్రం పెద్దలను కలిసి ఆశీస్సులు అందుకునేందుకు పళణిస్వామి సిద్ధమయ్యారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తమతో పొత్తుకు అనుకూలంగా స్పష్టమైన సమాచారం ఇవ్వడంతో బీజేపీ అధినేతందరిని కలిసేందుకు ఢిల్లీ పయనానికి రెడీ అయ్యారు. శని లేదా ఆదివారం ఆయన ఢిల్లీకి బయలు దేరే అవకాశాలు ఉన్నట్టు అన్నాడీఎంకే వర్గాలు పేర్కొంటున్నాయి.

తెల్లగా పుట్టాడని బిడ్డను కడతేర్చిన తండ్రి



మృతిచెందిన రెండు నెలల శిశువు



కౌశల్య, రంజిత్‌కుమార్

సాక్షి, చెన్నై : తామిద్దరూ నల్లగా ఉన్నా బిడ్డ తెల్లగా ఉండడంపై తండ్రి అనుమానం చెందాడు. రెండు నెలల బిడ్డను గోడ కేసి కొట్టి హతమార్చాడు. ఈ సంఘటన షోళింగనల్లూరు సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. కాంచీపురం జిల్లా మధురాంతకం సమీపంలోని విప్పేడు గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్(24) తన సమీప బంధువు కుమార్తె కౌశల్యను ఐదు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరు ప్రేమించుకుంటున్నప్పుడే కౌశల్య గర్భం దాల్చింది. రెండు నెలల క్రితం మగ బిడ్డకు జన్మనిచ్చింది. షోళింగనల్లూరు సమీపంలోని సెమ్మంజేరిలో తల్లిదండ్రుల ఇంట్లో ఉన్న కౌశల్య, బిడ్డను చూసేందుకు రంజిత్‌కుమార్ వచ్చాడు. తాను, తన భార్య ఇద్దరూ నల్లగా ఉన్నామని, తమకు పుట్టిన బిడ్డ తెల్లగా ఉండడంతో షాక్‌కు గురయ్యాడు. భార్యపై అనుమానం వ్యక్తం చేయడం మొదలెట్టాడు. మార్చి మొదటి వారంలో కౌశల్యను తన ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరూ గొడవపడ్డారు. దీంతో ఆగ్రహించిన కౌశల్య గత వారం తల్లిదండ్రుల ఇంటికి వచ్చేసింది. శుక్రవారం ఉదయం సెమ్మంజేరికి వచ్చిన రంజిత్‌కుమార్ కౌశల్యతో గొడవ పడ్డాడు. వీరి గొడవకు బెదిరిన పసిబిడ్డ ఏడుస్తుండడంతో రంజిత్ కుమార్ ఉన్మాదిగా మారి బిడ్డను గోడకేసి కొట్టి కింద పడేశాడు. తీవ్రంగా గాయపడిన బిడ్డను ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు బిడ్డ మరణించినట్టు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని రంజిత్‌కుమార్‌ను అరెస్టు చేశారు. పసిబిడ్డ మృతదేహాన్ని రాయపేట ఆసుపత్రికి తరలించారు.

'బడి' బహిష్కరణ

- ఏకనాపురం వాసుల నిరసన
- మంత్రి వ్యాఖ్యలతో ఆగ్రహం

సాక్షి, చెన్నై: అసెంబ్లీ వేదికగా మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ చేసిన వ్యాఖ్యలు ఏకనాపురం గ్రామ ప్రజల్లో ఆగ్రహాన్ని రేపింది. శుక్రవారం నుంచి తమ పిల్లలను బడికి పంపించబోయేది లేదని ప్రకటిస్తూ నిరసనకు దిగారు.

పరందూరు విమానాశ్రయానికి వ్యతిరేకంగా ఆ పరిసర 13 గ్రామాల ప్రజలు పోరాటాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో ఏకనాపురం గ్రామంలో పంచాయతీ కార్యాలయం నిర్మాణం గురువారం అసెంబ్లీలో ప్రస్తావనకు వచ్చింది. శ్రీపెరంబదూరు ఎమ్మెల్యే సెల్వ పెరుంతొగై ప్రశ్నకు సమాధానం ఇస్తూ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ వ్యాఖ్యలు చేశారు. ఏకనాపురం గ్రామం కూడా పరందూరు విమానాశ్రయం పరిధిలోనే ఉందని, ఇక్కడ ఎలాంటి నిర్మాణాలకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఈ ప్రకటన ఏకనాపురం గ్రామ ప్రజలలో ఆగ్రహాన్ని రేపింది.

బడికి దూరంగా..

పరందూరు విమానాశ్రయం వ్యవహారంలో ఇంత వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఎలాంటి రూపు రేఖలు సిద్ధం కాలేదని తమకు హామీ ఇచ్చి, ఇప్పుడు అసెంబ్లీలో మరో విధంగా మంత్రి వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా పరిగణించారు. శుక్రవారం నుంచి తమ పిల్లలను బడికి పంపించడం మానేశారు. దీంతో అక్కడి పాఠశాలలు నిర్మానుష్యంగా మారాయి. విధులకు వచ్చిన ఉపాధ్యాయులు పిల్లలు రాకపోవడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో కాంచీపురం జిల్లా అధికారులు ఆగ్రామానికి చేరుకుని బుజ్జగించే ప్రయత్నం చేసినా ఫలితం శూన్యం. ఇక, తమపిల్లలు బడులకు రారు అని, తమ బతుకే ప్రశ్నార్థకం అవుతుంటే, ఇక చదువులు ఎందుకు అని నినదిస్తూ గ్రామంలోని పిల్లలు, వారి తల్లిదండ్రులు ర్యాలీ నిర్వహించారు. వీఏఓ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఇక, తమ పిల్లలు ఎవరూ బడికి రారు అని స్పష్టం చేశారు.

ద్రావిడ సంస్కృతికి తమిళ సంప్రదాయమే మూలం



విద్యార్థులకు బహుమతుల ప్రదానం

తిరువళ్లూరు: ద్రావిడ సంస్కృతికి ఆయువుపట్టు తమిళ సంప్రదాయమేనని ప్రముఖ కవి మనుష్యపుత్రన్ స్పష్టం చేశారు. తిరువళ్లూరు జిల్లా పూందమల్లిలోని పణిమల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో గ్రేట్ తమిళ్ డ్రీమ్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, ప్రముఖ కవి మనుష్యపుత్రన్ హాజరై ప్రసంగించారు. కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గ్రేట్ తమిళ్ డ్రీమ్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. నేటి తరం యువకులు తమిళుల సంప్రదాయం, సంస్కృతిని పరిరక్షించి భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. కవి మనుష్యపుత్రన్ మాట్లాడుతూ తమిళుల వారసత్వం, నాగరికత, సామాజిక ఆర్థిక పరిస్థితులు, భాషా ప్రాధాన్యత, సాహిత్యం, కళలను నేటి తరం యువతకు తెలియజేయడానికి వంద కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. తమిళుల సంప్రదాయానికి లక్ష సంవత్సరాల చరిత్ర వున్నట్టు పురావస్తు శాఖ సైతం స్పష్టం చేసిందని ఆయన గుర్తు చేశారు.చివరలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

రాష్ట్ర హోదాకు పట్టు

- పుదుచ్చేరి అసెంబ్లీలో తీర్మానం
- ప్రతిపక్షాల నినాదమే ప్రభుత్వ ఎజెండా
- సీఎం రంగన్న వ్యాఖ్య



పుదుచ్చేరి అసెంబ్లీ

సాక్షి, చెన్నై: కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరికి రాష్ట్ర హోదాకు పట్టుబడుతూ అసెంబ్లీ వేదికగా శుక్రవారం తీర్మానం చేశారు. ప్రతిపక్షాలు తీసుకొచ్చిన ఈ తీర్మానాన్ని ఆహ్వానిస్తే, ఇదే తమ ఎజెండా అని సీఎం రంగస్వామి వ్యాఖ్యలు చేశారు. ఫ్రెంచ్ వారి గుప్పెట్లో నుంచి భారత దేశంలోకి అనుసంధానం తర్వాత పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంగా ఉంటున్న విషయం తెలిసిందే. ఇది తమిళనాడుకు కూతవేటు దూరంలో ఉంది. ఇక్కడ ఫ్రెంచ్ సంస్కృతి ఒకప్పుడు అధికంగా ఉన్నా, ప్రస్తుతం తమిళ సంస్కృతి, సంప్రదాయాలలో పుదుచ్చేరి భాగంగా మారింది. పూర్తిగా భాషాపరంగా, సంస్కృతి సంప్రదాయాల పరంగా తమిళనాడుతో కలిసినట్టుగా పరిస్థితి ఉంటోంది. అదేసమయంలో ప్రతి పని, ప్రతి ప్రాజెక్టు, ప్రజా సంక్షేమ నిధి కోసం కేంద్రం వద్ద చేతులు చాచాల్సిన పరిస్థితి పాలకులకు తప్పడం లేదు. నిధుల రాకతో జాప్యం నెలకొంటే ఇబ్బందులు మరీ ఎక్కువే. ఈపరిస్థితుల్లో గత కాంగ్రెస్ హయంలో పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించాలన్న నినాదం తెర పైకి వచ్చినా, కాంగ్రెస్ పాలకులు పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి. తాజాగా పుదుచ్చేరిలో ఎన్ఆర్ కాంగ్రెస్-బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. దీంతో పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ, కేంద్రం నిధుల రాకలతో జాప్యంపై పలుమార్లు సీఎం రంగస్వామి అసంతృప్తిని వ్యక్తం చేశారు.

అసెంబ్లీలో తీర్మానం..

గత వారం రోజులుగా పుదుచ్చేరి అసెంబీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. ఇందులో ప్రధాన ప్రతి పక్షం డీఎంకే, వారి మిత్రపక్షం కాంగ్రెస్ సభ్యులు రాష్ట్ర హోదా నినాదాన్ని తెరపైకి తెస్తూ వచ్చారు. తీర్మానానికి పట్టుబట్టారు. ఈ పరిస్థితుల్లో శుక్రవారం సమావేశం ప్రారంభం కాగానే, సీఎం రంగస్వామి ప్రత్యేక హోదా నినాదాన్ని ప్రస్తావించారు. ప్రతి పక్షాల నినాదం తమ ఎజెండా కూడా అని వ్యాఖ్యలు చేశారు. పుదుచ్చేరికి రాష్ట్ర హోదా కల్పించాలన్న నినాదానికి బలం చేకూర్చే విధంగా సభలో తీర్మానం చేశారు. ఇందుకు అధికార ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ, డీఎంకే, కాంగ్రెస్ పార్టీల సభ్యులు ముక్తకంఠంతో అంగీకారం తెలియజేశారు. దీంతో తీర్మానం సభ ఆమోదం పొందింది. తక్షణం లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరాజన్ ద్వారా కేంద్రానికి ఈ తీర్మానం పంపించేందుకు చర్యలు తీసుకున్నారు.

సూర్యప్రభపై సీతారాములు



శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నవమి ఉత్సవాల్లో రెండవ రోజు శుక్రవారం రాత్రి సూర్యప్రభపై సీతారాములను ఉంచి విశేష పూజలు చేశారు. వాసవీ క్లబ్ ఆఫ్ షావుకారు పేట బృందం భక్తి గీతాలు ఆలపించి అలరించారు.
– కొరుక్కుపేట:

చెన్నై శనివారం । 1 । ఏప్రిల్ । 2023 సాక్షి

క్లుప్తంగా

బాల్యవివాహాలు చేసే వారికి కఠిన శిక్ష


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

వేలూరు: బాల్యవివాహాలు చేసే వారికి కఠిన శిక్ష పడుతుందని కలెక్టర్ భాస్కర పాండియన్ తెలిపారు. తిరుపత్తూరు కలెక్టరేట్‌లో సామాజిక భద్రతా విభాగం, జిల్లా బాలల పరిరక్షణ యూనిట్, బాలల అభివృద్ధి వలంటీర్లకు, అధికారులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 968 అంగన్‌వాడీ కేంద్రాలు సమగ్ర శిశు అభివృద్ధి పథకంలో పనిచేస్తున్నాయన్నారు. వీటిలో చిన్నారుల కోసం తయారు చేసిన ఆహారాన్ని, పౌష్టికాహారాన్ని పరిశుభ్రంగాను, రుచికరంగా తయారు చేసి ఇవ్వాలన్నారు. పిల్లల్లో హిమోగ్లోబిన్ పెంచేందుకు ఆకుకూరలు, కూరగాయలు, మాంసం అధికంగా ఇచ్చేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలన్నారు. శిశు సంక్షేమ శాఖ అధికారి తిరుమావళవన్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి స్టెల్లా, తమిళరసి, రాజన్‌బాబు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

వేలూరు: వేలూరు జిల్లా మేల్ మనూరు ప్రాంతంలో శ్రీలంక స్థిరవాసుల కోసం రూ.11 కోట్లతో 220 ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నిర్మాణ పనులను కలెక్టర్ కుమరవేల్ పాండియన్ శుక్రవారం తనఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని 20వ తేదీలోపు పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌లను ఆదేశించామన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రతిరోజూ ఇంజినీర్‌లు పనుల నాణ్యతను తనఖీ చేయాలని ఆదేశించామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామమూర్తి, సబ్ కలెక్టర్ కవిత, ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్తి, ఇంజినీర్ సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో మరిన్ని హోమియో కేంద్రాలు


మందులను పరిశీలిస్తున్న మంత్రి సుబ్రమణ్యం


వైద్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

• మంత్రి సుబ్రమణ్యం

తిరువళ్లూరు: రాష్ట్ర వ్యాప్తంగా హోమియోపతి వైద్య విభాగాలను ఏర్పాటు చేసి త్వరలోనే అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం తెలిపారు. తిరువళ్లూరు జిల్లా విల్లివాక్కం యూనియన్‌లోని కొల్లుమేడు ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఇండియన్ మెడిసిన్, హోమియోపతి సిద్ధ వైద్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన వైద్య సంక్షేమ పథకాలను నోటిఫికేషన్‌ల ద్వారా అమలు చేసి అందజేస్తున్నట్టు వివరించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందిస్తున్నట్టు వివరించిన మంత్రి, శరీరానికి సరిపోయే విధంగా తక్కువ మొత్తంలో ఉప్పు, చక్కెర, నూనెతో ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కరోనా వైరస్ వేగంగా విస్తరించిన సమయంలోనే సిద్ధ, ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజలకు గతంలో కంటే ఎక్కువ నమ్మకం కలిగిందన్నారు. ప్రజలకు వున్న ఆసక్తి మేరకు రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని హోమియోపతి వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 90 ప్రాంతాల్లో హోమియోపతి కేర్ సెంటర్‌లు పని చేస్తున్నామని, త్వరలోనే మరిన్ని ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్, మాధవరం సుదర్శనం పాల్గొన్నారు.

కాట్పాడిలో మహిళల బ్యాంకు ప్రారంభం


బ్యాంకును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మహిళా ప్రతినిధులు

వేలూరు: వేలూరు జిల్లా కాట్పాడిలో మహిళలతో నడిచే ఫెడరల్ బ్యాంకును కింగ్‌స్టన్ ఎడ్యుకేషన్ గ్రూఫ్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ సంగీత కదిర్ ఆనంద్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఫెడరల్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాలిని వారియర్ మాట్లాడుతూ కాట్పాడి బ్రాంచ్‌లో మా సిబ్బంది ప్రపంచ స్థాయిలో బ్యాంకింగ్ సేవలను అందిస్తారన్నారు. ఈ బ్రాంచ్‌లో మహిళలు మాత్రమే విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిలో ఖాతాదారులకు అనుకూలంగా అన్ని సేవలను అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. బ్యాంకు ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్, రుణాలు, సేవింగ్స్, కరెంట్ అకౌంట్‌లను ఖాతాదారుల కోరిక మేరకు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మేయర్ సుజాత, నరువి ఆస్పత్రి వైస్ చైర్మన్ అనితా సంపత్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నందకుమార్, చెన్నై జోన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఇక్బాల్ మనోజ్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ మీనాక్షి సుందరం పాల్గొన్నారు.

తిరుత్తణి మున్సిపాలిటీకి గ్రేడ్-1 స్థాయి

తిరుత్తణి: తిరుత్తణి మున్సిపాలిటీని గ్రేడ్-1 స్థాయికి రాష్ట్ర ప్రభుత్వం పెంచడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తిరువళ్లూరు జిల్లాలోని తిరుత్తణి మున్సిపాలిటీ ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. 21 వార్డుల్లో 40వేలకు పైబడిన ఓటర్లున్నారు. చెన్నైకు సమీపంలోని తిరుత్తణి వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పట్టణదారి పడుతున్నారు. దీంతో పట్టణంలో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరాలు వున్నాయి. అయితే నిధులకొరతతో పాటు సమస్యలు అభివృద్ధికి అడ్డంగా మారడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ సరస్వతి కోరడంతో స్పందించిన ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం తిరుత్తణి మున్సిపాలిటీని గ్రేడ్-1గా ప్రకటించారు. దీంతో పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులతో పాటు అధికారులు, పట్టణ విస్తరణ పనులు ఊపందుకోనున్నాయి.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు


యూనియన్ సమావేశంలో ప్రసంగిస్తున్న చైర్‌పర్సన్ సుజాత

తిరువళ్లూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని యూనియన్ చైర్ పర్సన్ సుజాత ఆదేశించారు. తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు యూనియన్ సమావేశం చైర్ పర్సన్ సుజాత అధ్యక్షతన శుక్రవారం ఉదయం నిర్వహించారు. సమావేశానికి అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరుకాగా, కౌన్సిలర్ హాజరై తమ ప్రాంతంలో ఉన్న సమస్యలను చర్చించారు. కౌన్సిలర్‌లకు నిధుల కేటాయింపులో పక్షపాతం చూపకూడదు. తాగునీరు, రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను విడుదల చేయాలని సూచించారు. వేసవిలో గతంలో తాగునీటి సమస్య ఏర్పడిన 12 గ్రామాలను గుర్తించి అక్కడ ముందస్తు చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో వైస్ చైర్మన్ సరస్వతి, కౌన్సిలర్‌లు వెంకటేషన్, ద్రావిడ భక్తన్, యోగానందం, సురేష్, కార్తీక్, నరేష్ పాల్గొన్నారు.

కౌన్సిలర్-రిపోర్టర్ మధ్య తోపులాట :
యూనియన్ సమావేశంలో పీఎంకే కౌన్సిలర్ వెంకటేషన్ తమ ప్రాంతంలోని కొన్ని సమస్యలను ప్రస్తావించడం ప్రారంభించారు. దీంతో సమస్యలను ప్రస్తావన సమయంలో అక్కడే వున్న ఓ ప్రైవేటు టీవీ చానల్ రిపోర్టర్ వీడియో చిత్రీకరణ చేస్తుండడాన్ని గమనించిన కౌన్సిలర్ వీడియో చిత్రీకరణ వద్దని వారించారు. వద్దని చెప్పడానికి మీరెవరని ప్రశ్నించడంతో వివాదం చెలరేగింది. దీంతో కౌన్సిలర్ రిపోర్టర్ మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్‌లకే భద్రత లేదని ఆరోపిస్తూ కౌన్సిలర్‌లు మూకుమ్మడిగా వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. అనంతరం ఇకపై కౌన్సిల్ సమావేశాలకు రిపోర్టర్‌లను అనుమతించవద్దని తీర్మానం చేయడంతో పాటు ఎస్పీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి రిపోర్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజతో నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగస్వామి

తిరుత్తణి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన భవనానికి శుక్రవారం భూమిపూజతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తిరుత్తణి యూనియన్‌లోని కృష్ణసముద్రం గ్రామపంచాయతీలోని మడం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో నూతన భవనం నిర్మాణానికి వీలుగా విద్యాశాఖ నిధుల నుంచి రూ.28 లక్షలతో కట్టణ నిర్మాణ పనుల భూమి పూజలో సర్పంచ్ నాగస్వామి పాల్గొని పనులను ప్రారంభించారు.

సంక్షిప్త రామాయణం పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో అతిథులు, నిర్వాహకులు

కొరుక్కుపేట: పెరంబూర్ తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో 'సంక్షిప్త రామాయణం' పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 96వ అనన్య సామాన్య ధారావాహిక కార్యక్రమం గిరుగంబాక్కంలోని సబర్మతి హెల్త్ రిట్రీట్ వేదికగా జరిగింది. కార్యక్రమంలో తమ్మినేని బాబు, శ్రీదేవి రామాచార్యులు పాల్గొని, 100 శ్లోకాలతో నెల్లుట్ల శ్రీనివాసులు సంకలనం చేసిన సంక్షిప్త రామాయణం పుస్తకాన్ని అవిష్కరించారు. తొలిప్రతిని జనని సంస్థ ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య స్వీకరించారు. రచయిత, సమితి కార్యదర్శి టీఆర్‌ఎస్ శర్మ పుస్తక సమీక్ష చేశారు. సినీ గేయరచయిత భువనచంద్ర పంపిన సందేశాన్ని సభలో చదివి వినిపించారు. డాక్టర్ రాంబాబు, డా. నిర్మలాపళని వేలు, కిడాంబి లక్ష్మీకాంత్, ఊటుకూరు నాగేశ్వరరావు దంపతులు, విజయలక్ష్మి, ఈశ్వరమ్మ. సరోజనమ్మ, వసుంధర దేవి, ఆర్వీ దీక్ష, పద్మ, నెల్లుట్ల లీల పాల్గొన్నారు.

20 తీర్మానాలు ఆమోదం


కౌన్సిలర్ల సమావేశం

పళ్లిపట్టు: పొదటూరుపేట టౌన్ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిలర్ల సమావేశంలో 20 తీర్మానాలు ఆమోదించారు. పళ్లిపట్టు సమీపంలోని పొదటూరుపేట టౌన్ పంచాయతీ కౌన్సిలర్ల సాధారణ సమావేశం చైర్‌పర్సన్ రవిచంద్రన్, కార్యనిర్వహణాధికారి వెంకటేశన్ సమక్షంలో నిర్వహించారు. ఇందులో అన్నాడీఎంకే, డీఎంకే, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు పాల్గొన్నారు. సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాలకు సంబంధించి సభ్యుల మధ్య చర్చ జరిగింది. ప్రధానంగా టౌన్ పంచాయతీకి సొంతమైన స్థలంలో తాడ్కో బోర్డు ద్వారా పది దుకాణాలు నిర్మించి అద్దె వసూలులో తాడ్కోకు 50 శాతం, టౌన్ పంచాయతీకి 50 శాతం చెల్లించాల్సి వున్నా పదేళ్ల నుంచి తాడ్కో అధికారులు చెల్లింకపోవడంతో టౌన్ పంచాయతీకి ఆడిట్ సమస్య తలెత్తుతున్న క్రమంలో దుకాణాలను టౌన్ పంచాయతీకి అప్పగించాలని తీర్మానించారు. అలాగే విద్యుత్, తాగునీరు, రోడ్లకు సంబంధించి ప్రవేశపెట్టిన తీర్మానాలు ఆమోదించారు. ఉపాధ్యక్షుడు రామన్ పాల్గొన్నారు.

తమిళులకు పొద్దుపొడుపు వాడివాసల్


వాడివాసల్ చిత్రంలో సూర్య

తమిళసినిమా: ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్న నటుడు సూర్య. ఇంతకుముందు నటించిన జై భీమ్, సూరరై పోట్రు చిత్రాలు విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఇక సూరరై పోట్రు చిత్రం సూర్యకు జాతీయ ఉత్తమ నటుడు అవార్డును తెచ్చిపెట్టింది. కాగా ప్రస్తుతం దర్శకుడు శివ దర్శకత్వంలో తన 42వ చిత్రంలో నటిస్తున్నారు. నటి దిశాపటాని నాయకిగా నటిస్తున్న ఈ చిత్రం పలు ప్రత్యేకతలను సంతరించుకుంటుంది. దీనికి జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు. త్రీడీ ఫార్మెట్‌లో రూపొందుతున్న చిత్రం ఇది. అంతే కాకుండా ఈ చిత్రాన్ని ఏకంగా 10 భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో సూర్య పలు గెటప్‌లలో కనిపిస్తారని సమాచారం. ఇది చారిత్రక కథ చిత్రంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్ ఇటీవల విడుదల చేయగా విశేష స్పందన తెచ్చుకుంది. కాగా దీనికి వీర్ అనే టైటిల్ ప్రచారంలో ఉంది. అయితే చిత్ర టైటిల్‌ను యూనిట్ వర్గాలు ఈ నెల 14న తమిళ్ ఉగాది సందర్భంగా వెల్లడించనున్నట్లు తాజా సమాచారం. ప్రస్తుతం చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కాగా నటుడు సూర్య తర్వాత చిత్రం ఏమిటన్న విషయంపై ఆసక్తి నెలకొంది. వాడివాసల్ చిత్రం చేయాల్సి ఉంది. అదే విధంగా దర్శకులు సుధా కొంగర కూడా లైన్‌లో ఉన్నారు. కాగా సూర్య తర్వాతి చిత్రం గురించి నిర్మాత కలైపులి ఎస్ థాను క్లారిటీ ఇచ్చారు. ఆయన సూర్య కథానాయకుడుగా వెట్రిమారన్ దర్శకత్వంలో వాడివాసల్ అనే ఓ భారీ చిత్రాన్ని నిర్మించ తలపెట్టిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి వర్క్‌షాప్ కూడా నిర్వహించారు. ఇది జల్లికట్టు క్రీడా నేపథ్యంలో సాగే కథా చిత్రంగా ఉంటుందని సమాచారం. ఈ చిత్ర అప్‌డేట్‌ను నిర్మాత థాను ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. దర్శకుడు వెట్రిమారన్ విడుదలై చిత్రాన్ని పూర్తి చేశారని, తర్వాత వాడివాసల్ చిత్రాన్ని తెరకెక్కిస్తానని తెలిపారు. త్వరలోనే చిత్ర షూటింగ్ ప్రారంభమవుతుందని, ఇది ప్రపంచ తమిళుల పొద్దుపొడుపుగా ఉంటుందని నిర్మాత పేర్కొన్నారు.

కోలీవుడ్ టాక్స్

రోహిణీ థియేటర్ చర్యకు కమల్ ఖండన


కమలహాసన్


ప్రియాభవాని శంకర్

తమిళసినిమా: చెన్నైలోని రోహిణి థియేటర్ నిర్వాహకం చర్యలను పలువురు సినీ ప్రముఖులు తీవ్రంగా ఖండిస్తున్నారు. నటుడు శింబు కథనాయకుడిగా నటించిన చిత్రం పత్తుతల. నిర్మాణ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రం గురువారం తెరపైకి వచ్చింది. దీంతో శింబు అభిమానులు వేకువజాము నుంచే థియేటర్ ముందు గుమికూడారు. అలాంటి వారిలో సంచార జాతి ప్రేక్షకులు ఉన్నారు. వీరు స్థానిక కోయంబేడులోని రోహిణి థియేటర్లో పత్తుతల చిత్రాన్ని చూడడానికి వచ్చారు. టికెట్లు కూడా కొనుగోలు చేసి థియేటర్లోకి వెళ్లడానికి ప్రయత్నించారు. అయితే అక్కడ థియేటర్ కార్మికుడు వారిని అడ్డుకోవడం వివాదాస్పదంగా మారింది. ఈ సంఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కొంత సమయం తర్వాత వారిని లోపలికి అనుమతించారు. అయితే ఈ వ్యవహారంపై థియేటర్ నిర్వాహకం వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఈ వ్యవహారాన్ని కమలహాసన్, విజయ్‌సేతుపతి, సూరి, దర్శకుడు వెట్రిమారన్, నటి ప్రియా భవాని శంకర్ తీవ్రంగా ఖండించారు. తాజాగా కమలహాసన్ ట్విట్టర్లో పేర్కొంటూ టికెట్ తీసుకున్న తర్వాత కూడా సంచార జాతి ప్రజలను థియేటర్లోకి అనుమతించకపోయిన సంఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన తర్వాత వారిని అనుమతించడం ఖండించదగ్గ విషయం అని పేర్కొన్నారు. దర్శకుడు వెట్రిమారన్ శ్రమజీవులను థియేటర్లోకి రానీయకుండా అడ్డుకోవడం ప్రమాదకరం అని పేర్కొన్నారు. సూరి స్పందిస్తూ జరిగిన సంఘటనకు తాను విచారం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రియా భవాని శంకర్ స్పందిస్తూ సంచార జాతి ప్రజలకు మద్దతు తెలిపారు. అందరూ ఎవరి పని వారు చేసుకుంటూ పోతున్నప్పుడు టికెట్ ఉన్నా కూడా మమ్మల్ని ఎందుకు థియేటర్లోకి అనుమతించడం లేదు అని సంచార జాతి మహిళా ప్రశ్నే ఇలాంటి వ్యతిరేక చర్యలకు తొలి గొంతు అని భవాని శంకర పేర్కొన్నారు. ఈ సంఘటనపై స్థానిక కోయంబేడు పోలీసులు రోహిణి థియేటర్ నిర్వాకంపై అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

జూన్‌కు టాకీ పార్ట్ పూర్తి

తమిళసినిమా: విక్రమ్ చిత్ర విజయంతో మంచి హైప్‌లో ఉన్న నటుడు కమలహాసన్ తాజాగా నటిస్తున్న చిత్రం ఇండియన్ 2. శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ సంస్థ భారీ ఎత్తున నిర్మిస్తున్న విషయం తెలిసిందే. నటి కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవాని శంకర్, నటుడు సిద్ధార్థ్, సముద్రకని, బాబిసింహ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. దీనికి అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్ర తర్వాత షెడ్యూల్ కోసం ఇండియన్ 2 చిత్ర యూనిట్ తైవాన్, దక్షిణాఫ్రికాలకు బయలుదేరనున్నట్లు సమాచారం. ఇండియన్ 2 చిత్ర షూటింగ్ టాకీ పార్ట్‌ను జూన్ నెలకంతా పూర్తిచేయనున్నట్లు శంకర్ చెప్పారు. ఇక పాటల చిత్రీకరణ, వీఎఫ్ ఎక్స్ కార్యక్రమాలు బ్యాలెన్స్ ఉంటాయని, కాగా చిత్రం సింగిల్ సాంగ్‌ను త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. సంగీత దర్శకుడు అనిరుధ్ ఆ పనిలోనే ఉన్నారని తెలిపారు. కాగా లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్ర విడుదల హక్కులను రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ పొందడం విశేషం. చిత్రాన్ని దీపావళికి తెరపైకి తీసుకురానున్నట్లు సమాచారం. కాగా ఇండియన్ చిత్రం సంచల విజయాన్ని సాధించిన నేపథ్యంలో దానికి సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.


షూటింగ్ సెట్‌లో కమల్‌తో దర్శకుడు శంకర్

నాకూ రాజకీయాలు తెలుసు..


విజయ్‌సేతుపతి

తమిళసినిమా: ఇప్పుడు జాతీయస్థాయిలో మారుమోగుతున్న పేరు నటుడు విజయ్‌సేతుపతి. తొలుత చిన్న చిన్న పాత్రల్లో నటించి ఒక్కో మెట్టు ఎక్కుతూ కథానాయకుడు స్థాయికి ఎదిగిన నటుడు ఈయన. ఆ తర్వాత తెలుగు, మలయాళం, హిందీ భాషల్లో నటిస్తూ పాన్ ఇండియా నటుడిగా పేరు తెచ్చుకున్నారు. ఇమేజ్ చట్రంలో ఇరుక్కోని స్టార్ నటుడు ఎవరైనా ఉన్నారంటే అది విజయ్ సేతుపతినే అని చెప్పొచ్చు. విలక్షణ నటుడిగా రాణిస్తున్న ఈయన తాజాగా సూరి కథానాయకుడిగా నటించిన విడుదలై చిత్రంలో ప్రధాన పాత్రను పోషించారు. వెట్రిమారన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తొలి భాగం శుక్రవారం తెరపైకి వచ్చింది. కాగా ప్రస్తుతం ఈయన మదురైలో తన తాజా చిత్రం షూటింగ్‌లో పాల్గొంటున్నారు. కాగా ఇటీవల ముఖ్యమంత్రి స్టాలిన్ జీవిత చరిత్రను ఆవిష్కరించే విధంగా చిత్రాల ప్రదర్శనను చెన్నైలో నిర్వహించారు. దానికి మంచి స్పందన రావడంతో ఈ చిత్రలేఖన ప్రదర్శనకు నటుడు ప్రత్యేకంగా వెళ్లి ముఖ్యమంత్రి స్టాలిన్ చిత్రపటాలను తిలకించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ 70 ఏళ్ల జీవిత చరిత్రను ఈ చిత్ర ప్రదర్శనలో చూశానన్నారు. ఈ చిత్ర ప్రదర్శనను నేటి యువత చూస్తే ముఖ్యమంత్రి స్టాలిన్ ఏమిటన్నది అర్థమవుతుందన్నారు. ఆయన వారసత్వం కారణంగా ముఖ్యమంత్రి కాలేదని నిరంతర శ్రమతోనే ముఖ్యమంత్రి అయ్యారు అని తెలుస్తుందన్నారు. ఈ తరం యువత రాజకీయాల గురించి తెలుసుకోవాలన్నారు. తనకు రాజకీయాల గురించి తెలుసని, అయితే తనకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని విజయ్ సేతుపతి పేర్కొన్నారు.

నా తొలి క్రష్ ఎవరంటే?


శ్రుతిహాసన్

తమిళసినిమా: సంచలనానికి మరో పేరు ఉంటే అది నటి శ్రుతిహాసనే అవుతుంది. విశ్వ నటుడు కమలహాసన్ వారసురాలు అయిన ఈమె తొలుత సంగీత దర్శకురాలిగా తన తండ్రి నటించిన ఉన్నైపోల్ ఒరువన్ చిత్రం ద్వారా పరిచయం అయ్యారు. ఆ తరువాత నటిగా తెరంగేట్రం చేశారు. హిందీలో లక్ చిత్రం, తెలుగులో అనగనగా ఒక ధీరుడు చిత్రాల్లో నటించిన తర్వాతే కోలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు. ఆ విధంగా శ్రుతిహాసన్‌కు తమిళంలో కంటే తెలుగులోనే మంచి విజయాలు వరించాయి. ఇటీవల తెలుగులో ఈ బ్యూటీ నటించిన వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య చిత్రాలు సంచలన విజయాన్ని సాధించాయి. ప్రస్తుతం ప్రభాస్ సరసన సోలార్ చిత్రంలో నటిస్తున్నారు. ఇది పాన్ ఇండియా చిత్రంగా త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. మరో కొత్త చిత్రానికి సైన్ చేయకపోయినా శ్రుతిహాసన్ నిత్యం వార్తల్లో ఉంటారు. తన గ్లామరస్ ఫోటోలను సామాజిక మాధ్యమాలలో విడుదల చేస్తూ నెటిజన్లకు బాగానే పని చెబుతుంటారు. అదేవిధంగా నిజాలను నిర్భయంగా చెప్పే నటి ఎవరైనా ఉన్నారంటే అది శ్రుతిహాసనే. తన ప్రియుడితో కలిసిన ఫొటోలను ధైర్యంగా సామాజిక మాధ్యమాలకు తెలియజేసే నటి ఈ బ్యూటీ. ఇప్పటికే రెండు మూడు సార్లు ప్రేమలో విఫలమైన శ్రుతి మళ్లీ ప్రేమలో పడినట్లు ప్రచారం సామాజిక మాధ్యమాల్లో హోరెత్తుతోంది. కాగా ఇటీవల ఈమె ఒక ఇంటర్వ్యూలో పేర్కొంటూ తన తొలి క్రష్ నటుడు ఎవరన్న ప్రశ్నకు ఏ మాత్రం తడుముకోకుండా హాలీవుడ్ నటుడు బ్రూస్‌లీ అని చెప్పారు.

క్లుప్తంగా

ముదుమలై క్యాంపులో గున్న ఏనుగు మృతి

అన్నానగర్: ధర్మపురి జిల్లా హొగ్నెనికల్ అటవీ ప్రాంతం పెన్నాగరం సమీపంలోని నీరగుండి ప్రాంతం వద్ద 11వ తేదీన తల్లి నుంచి విడిపోయిన నాలుగు నెలల మగ ఏనుగు పిల్ల వ్యవసాయ యోగ్యమైన భూమిలో పడింది. సమాచారం అందుకున్న ఫారెస్ట్ గార్డులు అగ్నిమాపక శాఖ సాయంతో దాన్ని రక్షించారు. నీలగిరి జిల్లా ముదుమలై టైగర్ రిజర్వ్‌లోని పెంపకం శిబిరానికి గత నెల 17న తీసుకువెళ్లారు. తెప్పగాడు క్యాంపులో చిత్రీకరించబడిన ఆస్కార్ విజేత డాక్యుమెంటరీ ది ఎలిఫెంట్ విస్పరర్స్‌లో నటించిన బగస్ బొమ్మాన్, బెల్లి దంపతులు దానికి పరిచర్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఏనుగు పిల్లకు విరేచనాలు కావడంతో పశు వైద్యులు గ్లూకోజ్ ఇచ్చారు. తరువాత తీవ్ర చికిత్స అందిస్తూ వచ్చారు. చికిత్స అందక అది శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు మృతి చెందింది.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

తిరువొత్తియూరు: పుదుచ్చేరి నుంచి దిండివనంకు మద్యం తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1,344 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. మైలం సమీపంలోని కుట్టేరిపట్టు – తిరుచ్చి జాతీయ హైవేలో కమిషనర్ ఇలవలగి, సహాయ కమిషనర్ జ్ఞాన శేఖరన్, తమిళరసన్ పోలీసులు కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో కారులో పరిశీలించగా 37 అట్టపెట్టెల్లో 1,344 మద్యం బాటిల్స్ ఉన్నాయి. వాటిని పుదుచ్చేరి నుంచి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. విచారణలో తిరువణ్ణామలై జిల్లా వడకరై మన్నూరు గ్రామానికి చెందిన సెల్వరాజు కుమారుడు ప్రకాష్ (26), కీల్ పెన్నూర్ గ్రామానికి చెందిన ఏలుమలై కుమారుడు విక్రమ్ (22) వాటిని తరలిస్తున్నట్టు తేలింది. వారిని అరెస్టు చేసి మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

తిరువొత్తియూరు: చిన్న వయసులోనే ప్రేమ వద్దని, బాగా చదువుకోవాలని తల్లి మందలించడంతో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన తిరుచ్చి జిల్లాలో జరిగింది. తాత్యాంగార్ పేట వడక్కు కురుంబూర్ వీధికి చెందిన మారిముత్తు, సుభాషిని దంపతుల కుమార్తె పదో తరగతి చదువుతోంది. మారిముత్తు కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. సుభాషిని (38) ఉసిరి మండల అభివృద్ధి కార్యాలయంలో పనిచేస్తున్నారు. వారి కుమార్తె (15) అమ్మమ్మ ఇంటిలో ఉంటూ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన డిప్లొమా చదువుతున్న బాలుడి(17)తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ విషయం తెలుసుకున్న తల్లి కుమార్తెను మందలించింది. రెండు రోజుల క్రితం విద్యార్థినికి పుట్టిన రోజు కావడంతో ప్రియుడు ఆమెతో తీసుకున్న ఫొటోలను ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశాడు. దీన్ని చూసిన సుభాషిని కుమార్తెను మళ్లీ మందలించింది. దీంతో విద్యార్థిని ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. గమనించిన స్థానికులు ఆమెను నామక్కల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. తాతయ్యగారు పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హాస్టల్ భవనం నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య

అన్నానగర్: మదురై కామరాజ్ యూనివర్సిటీ విద్యార్థిని హాస్టల్ భవనం మూడవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. తేని జిల్లా ఉప్పిలి నాయకన్‌పట్టికి చెందిన మహేశ్వరి (25) మదురై కామరాజ్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. ఈ ఏడాది గ్రాడ్యుయేషన్ సమీపిస్తుండడంలో విద్యార్థులు గురువారం సంబరాలు చేసుకున్నారు. రాత్రి 11 గంటలకు విద్యార్థుల మధ్య చిరు క్రీడా పోటీలు, వేడుకలు నిర్వహించారు. మిగతా విద్యార్థులు గ్రౌండ్ ఫ్లోర్‌లో సంబరాలు చేసుకుంటుండగా మహేశ్వరి మూడో అంతస్తు పైకి వెళ్లింది. ఉన్నట్టుండి కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. నాగమలై పుదుకోట్టై పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మహేశ్వరి ఆత్మహత్య చేసుకుందా? లేక ప్రమాదవశాత్తు జారి పడిందా? లేక మరేవైన కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బహుమతులు వచ్చాయని రూ.12 లక్షల మోసం

అన్నానగర్ : అరియలూర్‌కు చెందిన వ్యక్తికి గిఫ్ట్ పార్సిల్ వచ్చిందని చెప్పి రూ.12 లక్షల మోసం చేసిన కేసులో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. అరియలూరు జిల్లా కడకూర్ గ్రామానికి చెందిన విమల్‌రాజ్ తల్లి జయంతికి 5 నెలల క్రితం సెల్ ఫోన్‌కు వాట్సాప్ కాల్ వచ్చింది. అందులో ఒక మహిళ ఇంగ్లండ్ నుంచి మాట్లాడుతున్నట్టు చెప్పింది. జయంతికి తన కూతురు పుట్టిన రోజుకి గిఫ్ట్ మనీ, గిఫ్ట్ ఐటమ్స్ పంపిస్తున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం విమానాశ్రయంలో ఉన్నాయని, వాటికి జీఎస్టీ రూ.35 వేలు చెల్లించాలని సూచించింది. దీంతో విమల్‌రాజ్ రూ.35 వేలు చెల్లించాడు. తర్వాత అప్పుగా తీసుకుని రూ.12 లక్షల వరకు చెల్లించాడు. బహుమతులు రాకపోవడంతో మోసపోయామని భావించి గురువారం విమల్‌రాజ్ అరియలూరు జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భవిష్యత్‌కు పునాది.. పాఠశాల జీవితం

- జెట్ చెన్నై అధ్యక్షుడు పి.రవీంద్రకుమార్‌రెడ్డి


విద్యార్థులతో జెట్ చెన్నై నిర్వాహకులు, ఉపాధ్యాయులు

కొరుక్కుపేట: పాఠశాల జీవితం విద్యార్థుల భవిష్యత్‌కు గట్టి పునాది అని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్) – చెన్నై అధ్యక్షుడు పి.రవీంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. జెట్ – చెన్నై సంస్థ ఆధ్వర్యంలో త్రిదండి చిన జీయర్ స్వామి మంగళ శాసనాలతో శుక్రవారం ఉదయం చెన్నై కీల్పాక్, పుందమల్లి హైరోడ్డులో ఉన్న కాంచీపురం అరుల్ మిగు ఏకాంబరేశ్వర మెట్రిక్యులేషన్ పాఠశాల విద్యార్థులతో కలిసి శ్రీరామ నవమి పూజలు చేశారు. విద్యార్థులకు వడపప్పు, పానకం పంపిణీ చేశారు. పి.రవీంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ చిన జీయర్ స్వామి రూపొందించిన ప్రజ్ఞ శ్లోకాలను 2014 నుంచి జెట్ సభ్యులు పి.కమలతోపాటు మరికొంతమంది పిల్లలకు నేర్పిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు 600 మంది విద్యార్థులు ఈ ప్రజ్ఞ శ్లోకాలను నేర్చుకున్నారని తెలిపారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, సనాతన ధర్మాన్ని నేర్పించి సన్మార్గంలో నడిచేలా జెట్ –చెన్నై కృషి చేస్తుందన్నారు. ఈ పాఠశాలలో ప్రజ్ఞ ప్రారంభించటానికి జెట్ మాజీ అధ్యక్షురాలు ఆనంద కుమారి పునాది వేశారన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ జయంతి వరద రాజన్ మాట్లాడుతూ తమ పాఠశాలలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం చిన్నారులు రామకథను చదివి వినిపించారు. సభ్యులు శారద శ్రీరామ కీర్తనను ఆలపించారు. కార్యక్రమంలో జెట్ – చెన్నై కార్యనిర్వాహకులు పి.కమల, సభ్యులు అన్నపూర్ణ, డాక్టర్ చలపతి, శాంతి, డాన్స్ టీచర్ రాజం సుబ్రహ్మణ్యన్ పాల్గొన్నారు.

బ్రిటీష్ కాలం నాటి నాణేలు లభ్యం


బ్రిటీష్ కాలం నాటి నాణేలు

అన్నానగర్: బ్రిటీష్ రాణి విక్టోరియా, కింగ్ జార్జ్ హయాంలో ముద్రించిన నాణేలను శుక్రవారం తిరుపుల్లాని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గుర్తించారు. రామనాథపురం జిల్లా తిరుపుల్లాని సురేష్ సుధా అలఘున్ మెమోరియల్ ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలలో పురాతన నాణేలు, కుండల పెంకులను గుర్తించడం, శాసనాలను చదవడం వాటిని యాంటిక్విటీస్ కన్జర్వేషన్ ఫోరం ద్వారా లిప్యంతరీకరించడంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. సెలవులు, ఖాళీ సమయాల్లో విద్యార్థులు తమ ప్రాంతాల్లోని పురాతన వస్తువులు, నాణేలను సేకరిస్తున్నారు. ఈ స్థితిలో పాఠశాల పురాతన వస్తువుల పరిరక్షణ మండలి కార్యదర్శి, పురావస్తు శాస్త్రవేత్త వీ.రాజగురు శుక్రవారం మాట్లాడుతూ 9వ తరగతి విద్యార్థి ప్రవీణ్‌రాజ్, 6వ తరగతి విద్యార్థి అయ్యప్పకు కీవలస, సేదుక్కరై ప్రాంతాల్లో బ్రిటీష్ కాలం నాటి నాలుగు వృత్తాకార నాణేలు లభించాయి. ఒకటి 1833లో విడుదలైన నాణెం. ఇది విద్యార్థి ప్రవీణ్ రాజ్‌కి కీళవలసైలో దొరికింది. దీనిపై ఒక వైపు ఈస్టిండియా కంపెనీ ముద్ర, మరొక వైపు స్కేల్ ముద్రించారు. స్కేల్ పైన ఇంగ్లీషులో క్వార్టర్ అణా అని, దాని కింద అరబిక్ శాసనం ఉంది. మరొకటి 1887లో విక్టోరియా రాణి హయాంలో ముద్రించింది. దీనిపై పావు వంతు అణా, ఇండియా–1887 అని ఆంగ్లంలో రాసి ఉంది. వెనుక వైపు విక్టోరియా ఎంప్రెస్ రాసిన, ఆమె చిత్రం ఉన్నాయి. 1876లో క్వీన్ విక్టోరియా చక్రవర్తిగా ప్రకటించారు. అందుకే 1877 తర్వాత వచ్చిన నాణేలపై ఆమెను చక్రవర్తి (సామ్రాజ్ఞి) అని పేర్కొన్నారు. సేదుకర బీచ్‌లో విద్యార్థి అయ్యప్పకి లభించిన రెండు నాణేల్లో ఒకటి 1835లో విడుదలైంది. ఇది పరిమాణంలో చిన్నది. దానికి ఒకవైపు ఇంగ్లీషులో ఈస్ట్ ఇండియా కంపెనీ అని రాసి ఉంది. మధ్యలో 1/12 అని ఉంది. మరో వైపు కంపెనీ లోగో కూడా ఉంది. మరొకటి 1941లో లోగో కింగ్ జార్జ్ పాలనలో విడుదల చేసింది. దాని వెనుక భాగంలో జార్జ్ ప్రతిమ ఉంది. తిరుపుల్లానికి వచ్చే భక్తులు సేతుక్కరై సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. ఇది ప్రాచీన కాలం నుంచి వస్తున్న ఆచారం. స్నానం చేసిన తర్వాత తమ బట్టలు, నాణేలను సముద్రంలో వదిలేస్తారు. అయ్యప్పకు దొరికిన నాణేలు అలా వదిలేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ప్రవీణ్ రాజ్ కనిపెట్టినది ప్రజల గుట్టల్లో ఉంది. తిరుపుల్లాని విద్యార్థులు ఇప్పటికే తమ ప్రాంతాల్లో పాండ్య, చోళుల కాలం నాటి నాణేలను గుర్తించారు.

అర్ధరాత్రి పేలుడు

- ఒకరికి గాయాలు
- పోలీసుల విచారణ ముమ్మరం


పేలుడు జరిగిన ప్రాంతం


గాయపడిన వ్యక్తి

తిరువళ్లూరు: తిరువళ్లూరు రైల్వేస్టేషన్ సమీపంలో వున్న బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి పెద్ద శబ్దంతో పేలుడు సంభవించడంతో అక్కడ వుంటున్న సంచార జాతుల వారు పరుగులు తీశారు. రైల్వే బ్రిడ్జి వద్ద సుమారు 50 సంచార జాతులకు చెందిన కుటుంబాలు తాత్కాలికంగా నివాసం వుంటున్నారు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో సంచారజాతుల వారు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక టెంట్ కాలిపోయింది. ఈ ప్రమాదంలో నటరాజ్ అలియాస్ అజిత్(28) గాయపడ్డాడు. పేలుడు శబ్దంతో అక్కడ నివాసం వుంటున్న వారు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది అక్కడికి చేరుకుని గాయపడిన వ్యక్తిని వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో మట్టిని సేకరించి పరిశోధనల కోసం చెన్నైకి పంపారు. పోలీసుల ప్రాథమిక విచారణలో నాటుబాంబు తయారీకి ఉపయోగించే వస్తువు పేలినట్టు నిర్ధారించారు. దీనిపై తిరువళ్లూరు టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.20 లక్షల విలువైన సముద్ర నత్తలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సముద్ర నత్తలు

అన్నానగర్: మండపం సమీపంలో శుక్రవారం శ్రీలంకకు అక్రమంగా తరలిస్తున్న రూ.20 లక్షల విలువచేసే 250 కిలోల సముద్రపు నత్తలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రామనాథపురం జిల్లా మండపం సమీపంలోని వెదలై బీచ్ ప్రాంతం నుంచి శ్రీలంకకు అక్రమంగా సముద్రపు నత్తలు తరలిస్తున్నట్లు పోలీసులకు శుక్రవారం తెల్లవారుజామున సమాచారం అందింది. అనంతరం క్యూ డివిజన్ పోలీసులు, ప్రత్యేక విభాగం పోలీసులు వెదలై బీచ్ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ వేదాల దక్షిణ తీరంలో ఒక ప్రదేశంలో సముద్రపు నత్తలను అక్రమంగా తరలించడానికి యత్నిస్తున్న వారిని పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించగా వారు పరుగులు తీశారు. 250 కిలోల సముద్రపు నత్తలు, ప్రాసెస్ చేయడానికి ఉపయోగించే పాత్రలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. మండపం అటవీ రేంజర్ మహేంద్రన్‌ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న స్మగ్లర్ల కోసం గాలిస్తున్నారు. స్వాధీనం చెసుకున్న నత్తల అంతర్జాతీయ విలువ రూ.20 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

వాహనం ఢీకొని జింక మృతి



అన్నానగర్: కడమలైక్కుండు సమీపంలో శుక్రవారం ఉదయం వాహనం ఢీకొని ఓ జింక మృతి చెందింది. తేని జిల్లా కడమలైక్కుండు సమీపంలోని కండమనూరు అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం రోడ్డుపై జింక మృతిచెంది కనిపించింది. విషయం తెలిసి అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని జింక మృతదేహాన్ని వెటర్నరీ డాక్టర్‌తో పోస్ట్‌మార్టం చేయించారు. నీటి కోసం వెతుకుతున్న క్రమంలో జింక వాహనం ఢీకొని చనిపోయిందని, జింకకు 3 సంవత్సరాల వయస్సు ఉంటుందని అటవీశాఖ అధికారులు తెలిపారు.

గాయకుడు విజయ్ ఏసుదాస్ ఇంట్లో చోరీ

తమిళసినిమా: ప్రముఖ గాయకుడు ఏసుదాస్ తనయుడు గాయకుడు, నటుడు విజయ్ ఏసుదాస్ ఇంట్లో చోరీ జరిగింది. ఆయన తన భార్య దర్శన బాలతో కలిసి స్థానిక ఆల్వార్ పేటలోని మూడవ వీధిలో నివసిస్తున్నారు. వేడుకలో పాల్గొనేందుకు భార్య తన బీరువాలో ఉన్న నగలు తీసుకునేందుకు ప్రయత్నించారు. అందులో 60 కాసుల బంగారం చోరీకి గురైనట్లు తెలిసింది. తన ఇంటిలో పనిచేస్తున్న మేనక, పెరుమాళ్‌పై అనుమానంతో అభిరామిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మేనక, పెరుమాళ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఐశ్వర్య రజనీకాంత్ ఇంట్లో చోరీ, ఇప్పుడు విజయ్ ఏసుదాస్ ఇంట్లో చోరీ జరగడంతో కోలీవుడ్‌లో కలకలానికి దారి తీసింది.

చెత్తకుండీలో పసికందు


వైద్యసిబ్బందికి అప్పగిస్తున్న పసికందు

అన్నానగర్: సెంజీ సమీపంలో శుక్రవారం చెత్తకుండీలో పడేసిన పసికందును సురక్షితంగా రక్షించారు. విల్లుపురం జిల్లా సెంచి సమీపంలోని ముట్టత్తూరు గ్రామ బస్టాండ్ సమీపంలో ఉన్న చెత్తకుండీలోంచి శుక్రవారం ఉదయం శిశువు ఏడుపు వినిపించింది. బస్సు కోసం ఎదురు చూస్తున్న జనం ఇది విని చెత్త కుండీలో చూసే సరికి పుట్టిన కొద్ది గంటలకే పట్టిన ఓ మగబిడ్డ అక్కడ ఏడుస్తూ కనిపించింది. ఆ పసికందును ఎవరో చెత్త కుండీలో పడేసినట్లు గుర్తించారు. దిగ్భ్రాంతి చెందిన ప్రజలు పసికందును రక్షించి చికిత్స నిమిత్తం ఊతంపట్టులోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అప్పగించారు. అక్కడ వైద్యులు పసికందుకు చికిత్స అందించారు. అనంతరం చిన్నారిని విల్లుపురం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించారు. ఫిర్యాదు మేరకు కంజనూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి

అన్నానగర్: బన్రూటి సమీపంలో ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. కడలూరు జిల్లా బన్రూటి సమీపంలోని వీరపెరుమానల్లూరు గ్రామానికి చెందిన కేశవన్ కుమారుడు శరవణన్ (25). తిరుపూర్‌లోని ఓ ప్రైవేట్ బనియన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అదే కంపెనీలో పనిచేస్తున్న అరియలూరు జిల్లా ఉదయార్ పాళయం కొలయనూరు గ్రామానికి చెందిన శేఖర్ కుమార్తె కన్మణి (22)తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఈ స్థితిలో శరవణన్, కన్మణి వీరపెరుమానల్లూర్ శివాలయంలో ఈ ఏడాది జనవరిలో వివాహం చేసుకున్నారు. తర్వాత ఇద్దరూ శరవణన్ తల్లిదండ్రుల ఇంట్లోనే ఉన్నారు. కొన్ని రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ స్థితిలో 23వ తేదీన ఇంట్లో ఒంటరిగా ఉన్న కన్మణి విషం తాగింది. ఆమెని బంధువులు బన్రూటి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఆమెకి ప్రథమ చికిత్స అందించి కడలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కన్మణి శుక్రవారం ఉదయం మృతిచెందింది. ఈ విషయం తెలిసి కన్మణి తల్లిదండ్రులు, బంధువులు కడలూరుకు వచ్చి కన్నీరుమున్నీరుగా విలపించారు. శేఖర్ పుదుప్పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రూ.5.86 కోట్ల మోసం కేసులో మహిళ అరెస్ట్

తిరువొత్తియూరు: అధిక వడ్డీ పేరుతో రూ.5.86 కోట్లు మోసం చేసిన కేసులో మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఐదుగురి కోసం గాలిస్తున్నారు. చెన్నై ముగప్పేరులో బహుళ అంతస్తుల భవనం ఉంది. ఇందులో ఆల్విన్, రాబిన్ అనే వారు ఏఆర్‌టీ అనే పేరుతో పలు దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీటిలో లీమా, ప్రియా, సమీర్, జవహర్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. నగల దుకాణంలో లక్ష డిపాజిట్ చేసిన వారికి వారానికి రూ.3 వేల చొప్పున నెలకు రూ.12 వేలు వడ్డీ ఇస్తామని, సగం ధరకే బంగారు, వడ్డీ లేకుండా నగలపై అప్పు తీసుకోవచ్చని అల్విన్, రాబిన్ ప్రకటన ఇచ్చారు. దీంతో కొందరు నగల దుకాణంలో డిపాజిట్ చేశారు. ఇలా రూ.5.86 కోట్లు వసూలు చేశారు. కొద్ది రోజులు వడ్డీ చెల్లించారు. తర్వాత చెల్లించలేదు. దీంతో డిపాజిట్ చేసిన వారు ఆల్విన్, రాబిన్‌ను ప్రశ్నించారు. వారు కిరాయి రౌడీతో బెదిరించడంతో బాధితులు నొలంబూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రాబిన్, ఆల్విన్ దుకాణాలకు తాళం వేసి అదృశ్యమయ్యారు. పోలీసులు విచారణ చేపట్టి ఆల్విన్, రాబిన్‌పై నాలుగు విభాగాల కింద కేసు నమోదు చేసి విచారణ జరిపారు. గురువారం సాయంత్రం పుళల్ ప్రాంతంలో ఉన్న ప్రియాను పోలీసులు అరెస్టు చేశారు. ఆమెను మద్రాసు హైకోర్టులో హాజరుపరిచి పులల్ జైలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి ఆల్విన్, రాబిన్ సహా ఐదుగురి కోసం గాలిస్తున్నారు.

1,200 ఏళ్ల నాటి దవ్వై శిల్పం లభ్యం


దవ్వై శిల్పం

అన్నానగర్: దిండివనం సమీపంలో గురువారం 1,200 సంవత్సరాల నాటి దవ్వై శిల్పం లభించింది. దిండివనం సమీపంలోని సారం గ్రామంలోని విల్లుపురానికి చెందిన సెంగుట్టువన్ అనే చరిత్రకారుడు గురువారం క్షేత్ర పరిశోధన చేస్తుండగా పల్లవుల దవ్వై శిల్పం దొరికింది. ఆయన మాట్లాడుతూ సారం గ్రామంలో చాలా పురాతనమైన అగస్తీశ్వర స్వామి ఆలయం ఉందని తెలిపారు. అందులో పల్లవ రాజు నిరుపతుంగవరం శాసనాలు, పల్లవుల కాలం నాటి శిల్పాలు ఉన్నాయని తెలిపారు. పట్టణానికి పశ్చిమాన ఉన్న ఒక సరస్సులో మూడు వంతులు నీటిలో మునిగి ఉన్న రాతి పలకపై చెక్కిన దవ్వై శిల్పాన్ని గుర్తించినట్టు చెప్పారు. పల్లవుల కాలంనాటి కళకు నిదర్శనంగా, అందమైన శిరోభూషణాన్ని కలిగి ఉన్న ఈ శిల్పం 8వ శతాబ్దం నాటిదని పేర్కొన్నారు. 1,200 ఏళ్ల నాటి ఈ శిల్పాన్ని నీటి నుంచి బయటకు తీసి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ఇది తమిళనాడులో ఒక పురాతన మాతృదేవత ఆరాధన. సారం అగస్తీశ్వర ఆలయ సముదాయంలో ఇప్పటికే దవ్వై శిల్పం ఉందని గమనించామన్నారు. ఈ తనిఖీల్లో సారం అగస్తీశ్వర ఆలయ కార్యనిర్వహణాధికారి ధనశేఖర్ ఉన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


సదస్సులో పాల్గొన్న అతిథులు, వక్తలు

కొరుక్కుపేట: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగాలని ఎల్ అండ్ టీకి చెందిన కాలేజ్ కనెక్ట్ బిజినెస్ హెడ్ ఫెబిన్ పిలుపునిచ్చారు. చెన్నై వడపళనిలోని ఎస్ఆర్ఎం ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సిఓఎం) ఆధ్వర్యంలో శుక్రవారం ఎమర్జింగ్ అప్రోచెస్ ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్ – రిడీస్ కవరింగ్ క్వాలిటీ బిజినెస్ ప్రాక్టీసెస్ (ఐసిఈఏబిఎం– 2023) పేరుతో రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఇందులో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ రీసెర్చ్ స్కాలర్‌లు, వక్తలు పాల్గొని వ్యవస్థాపక రంగంలో నాణ్యమైన పద్ధతులపై సూచనలు, సలహాలు చేశారు. ఎస్ఆర్ఎం ప్రో–చాన్సలర్ డాక్టర్ రవి పచ్చముత్తు, ఎస్ఆర్ఎం వల్లియమై ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ హరిణి రవి, ఒమన్‌లోని స్టార్టప్ ఎకోసిస్టమ్ బిల్డర్స్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అల్ వహైబీ తదితరులు పాల్గొన్నారు. ఫెబిన్ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. అరబ్ ఓపెన్ యూనివర్సిటీ – ఒమన్ హెడ్ ఆఫ్ ఫ్యాకల్టీ డాక్టర్ కబాలి పి సుబ్రమణియన్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చెన్నై జనరల్ మేనేజర్ వి.మురుగానందం మాట్లాడారు. కార్యక్రమంలో సీఓఎం హెడ్ సి.ప్రసీద, ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రాజేశ్వరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏ.కలైవాణి, సీఈటీ డీన్ సి.వి.జయకుమార్, అకడమిక్ డైరెక్టర్ ఎస్.రామచంద్రన్ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి


మాట్లాడుతున్న జోషి

కొరుక్కుపేట: పాత కోస్టల్ ఆక్వా కల్చర్ యాక్ట్ (సీఏఏ) కారణంగా లక్షలాది గ్రామీణ తీర ప్రాంతాల ప్రజల జీవనోపాధిపై ప్రభావం పడుతుంది. 2005 నాటి తీర ఆక్వా కల్చర్ చట్టం సవరణలో జాప్యం ప్రపంచ ఆక్వా కల్చర్‌లో భారతదేశ ఆధిపత్యాన్ని తగ్గిస్తుంది. ఈ చట్టాన్ని వెంటనే సవరించాలని అఖిల భారత రొయ్యల హేచరీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. శుక్రవారం చెన్నై ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జోషి కె.శంకర్ మాట్లాడుతూ 12 సముద్ర జిల్లాలు, 20వేల ఎకరాల ఆక్వా పెంపకం , 85 రొయ్యల హేచరీలు, లక్ష మంది ప్రత్యక్ష ఉద్యోగులు, వందలాది మంది మత్స్యకారులతో అనుసంధానించబడిన సామాజిక ఆర్థిక కార్యకలాపాలతో తమిళనాడు రెండవ అతిపెద్ద తీరప్రాంతాన్ని కలిగి ఉందని అన్నారు. ఆయా గ్రామాలు వారు ప్రత్యక్షంగా సహకరించడమే కాకుండా రవాణా వ్యాపారాలకు కూడా పరోక్షంగా సహకరిస్తారని తెలిపారు. దురదృష్టవశాత్తూ కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం వాటిని సరిదిద్దడానికి, రొయ్యల పరిశ్రమను ఆదుకోవడానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోతే ఈ వ్యాపారాలు, వాటి కార్యకలాపాలు ప్రతి ఒక్కటి నిరుపయోగంగా మారే ప్రమాదం ఉందని డాక్టర్ జోషి ఆందోళన వ్యక్తం చేశారు 2005 చట్టాన్ని వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు.

నకిలీ నోట్ల కేసులో ఇద్దరి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న నకిలీ నోట్లు

అన్నానగర్: కారైకుడిలో శుక్రవారం నకిలీ నోట్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. శివగంగై జిల్లాలోని కరైకుడి ముత్తుపట్నం ప్రాంతంలో ఓ వ్యక్తి ఫైనాన్స్ సంస్థను నడుపుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ తన కుటుంబానికి వైద్యం కోసం రూ.10 లక్షలు అప్పుగా అడిగింది.

ఇందుకు రూ. 5 లక్షలు డిపాజిట్ చేస్తే ఆర్థిక సంస్థ మీకు రూ.10 లక్షల రుణాన్ని ఇస్తుంది. డిపాజిట్ సొమ్ముపై వడ్డీ కూడా ఇస్తున్నామని చెప్పారు. నమ్మిన మహిళ అక్కడ రూ.5 లక్షలు డిపాజిట్ చేసింది. దాన్ని తీసుకుని సంస్థను నడుపుతున్న వ్యక్తులు రూ.10 లక్షల రుణాన్ని ఇవ్వకుండా ఆలస్యం చేస్తూ వచ్చారు. మోసపోయానని భావించిన మహిళ కారైకుడి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే కంపెనీకి వెళ్లి విచారణ చేపట్టగా అక్కడ కట్టలుకట్టలుగా నగదు ఉన్నట్లు చూశారు. విచారణలో కట్టల నోట్ల పైన, కింద మాత్రం ఒరిజినల్ రూ.500 నోట్లను ఉంచారు. మిగతాదంతా తెల్లకాగితం కావడంతో.. షాక్‌కు గురయ్యారు. వెంటనే పోలీసులు నకిలీ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకుని అక్కడే ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు.

మద్యం ప్యాకెట్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు

అన్నానగర్: తిరుప్పత్తూర్‌లో కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం ప్యాకెట్లను శుక్రవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఓ యువకుడిని అరెస్టు చేశారు. తిరుపత్తూరు సమీపంలో ఉన్న పెరియగరం గ్రామానికి చెందిన వాసుదేవన్ (33). ఇతను కర్ణాటక మద్యం ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు కందిలి పోలీసులకు శుక్రవారం సమాచారం అందింది. సమాచారం మేరకు పోలీసులు అతని ఇంటికి వెళ్లి పరిశీలించగా 100 కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని వాసుదేవన్‌ని అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

అద్భుతం..నాట్య ప్రదర్శన


ప్రనౌతి భరతనాట్య ప్రదర్శన

కొరుక్కుపేట: టీటీడీ స్థానిక సలహా మండలి సభ్యుడు గోకుల్ కృష్ణన్ కుమార్తె, కలైమామణి ఊర్మిళా సత్యనారాయణన్ శిష్యురాలు వి.జి ప్రనౌతి శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని గురువారం రాత్రి స్థానిక టి.నగర్ జీఎస్ శెట్టి రోడ్డులో నూతనంగా ప్రారంభించిన పద్మావతి అమ్మవారి ఆలయంలో నాట్య సంకల్ప భరతనాట్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ వేడుకలను టీటీడీ స్థానిక సలహా మండలి చెన్నై ప్రెసిడెంట్ ఏజే శేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం నాట్య సంకల్ప పేరుతో వి జి ప్రనౌతి భారత నాట్య ప్రదర్శన ఇచ్చారు. తనదైన నృత్యంతో ప్రనౌతి అందరి మన్ననలు అందుకుంది.


ఏలూరు జిల్లా ముసునూరులో చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు


అనంతపురం జిల్లా కల్లూరులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, మహిళలు


పల్నాడు జిల్లా నూజెండ్లలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు


తిరుపతిలో మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన

ఘనంగా 'ఆసరా' సంబరాలు


శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరులో సీఎం జగన్ కటౌట్‌కు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, మహిళా సంఘాల సభ్యులు


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనంతసాగరంలో లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- శుక్రవారం 83 మండలాల్లో ఘనంగా ఆసరా పంపిణీ
- పొదుపు సంఘ మహిళలతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ముఖాముఖి సమావేశాలు
- సీఎం జగన్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తూ కృతజ్ఞత తెలిపిన మహిళలు

సాక్షి, అమరావతి : వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమాలతో పొదుపు సంఘాల మహిళలు రాష్ట్రమంతటా సంబరాలు చేసుకుంటున్నారు. శుక్రవారం రాష్ట్రమంతటా 83 మండలాల్లో పొదుపు సంఘాల మహిళల లబ్ధిదారులతో ముఖాముఖి సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆయా ప్రాంత పొదుపు సంఘ మహిళలకు ప్రభుత్వం మూడో విడతలో అందజేస్తున్న ఆర్థిక మొత్తం చెక్కులను అందజేసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని వారికి వినిపించారు. మహిళలు సీఎం చిత్రపటాలకు పాలాభిషేకాలు చేస్తూ కృతజ్ఞతలు తెలియజేయగా, కొన్ని చోట్ల 'థాంక్యూ సీఎం సార్' 'థాంక్యూ జగనన్నా..' అని రాసిన మట్టి కుండలను ప్రదర్శిస్తూ సంతోషాన్ని వ్యక్తంచేశారు. మార్చి 25న సీఎం వైఎస్ జగన్ ఏలూరు జిల్లా దెందులూరులో 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత పంపిణీని లాంఛనంగా ప్రారంభించగా, ఏప్రిల్ 5వ తేదీ వరకు మహిళలతో ముఖాముఖి నిర్వహిస్తూ, వారికి చెక్కులు పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 346 మండలాల్లో పొదుపు సంఘాల మహిళలతో ముఖాముఖి సమావేశాలు జరిగినట్లు సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్ 'సాక్షి'కి తెలిపారు.

వైఎస్సార్‌సీపీని గెలిపిస్తేనే మహిళలకు భవిష్యత్

ఆసరా చెక్కుల పంపిణీ సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



శ్రీకాకుళం రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టకపోతే మహిళల భవిష్యత్ అంధకారంలోకి వెళ్లిపోతుందని, ప్రతిపక్షాలను గెలిపిస్తే మీ చేయి మీరే విరుచుకున్నవారు అవుతారని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపులశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురంలో శుక్రవారం 6 పంచాయతీలకు కలిపి వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ..కొంతమంది పచ్చపార్టీ నాయకులు వైఎస్సార్‌సీపీ ఓడిపోవాలని అంటున్నారని, పొరపాటున పార్టీ ఓడితే ముందుగా నష్టపోయేది డ్వాక్రా సంఘాల మహిళలేనని గుర్తుంచుకోవాలన్నారు. పథకాల పేరిట డబ్బులు వృథా చేస్తున్నారని చంద్రబాబు పదేపదే చెబుతున్నాడని.. మహిళలకు చేయూత ఇవ్వడం తప్పా అని ప్రశ్నించారు. ప్రతి ఇల్లాలు సంతోషంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా విధానమన్నారు. చంద్రబాబును అధికారంలోకి తీసుకొస్తే రాష్ట్రం సర్వనాశనమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయాలు ప్రారంభం

సాక్షి, అమరావతి: చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయాలను జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్ విధానంలో శుక్రవారం ప్రారంభించారు. చిత్తూరు జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోమువీర్రాజు పాల్గొనగా, అనంతపురం జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి పురందేశ్వరి పాల్గొన్నారు.

టీడీపీతో పొత్తు పెట్టుకోం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



యాదమరి(చిత్తూరు జిల్లా): కుటుంబ పార్టీ అయిన టీడీపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని, జనసేన పార్టీతో మాత్రమే పొత్తు పెట్టుకుంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవ దేవుని ప్రార్థించానని తెలిపారు. స్వామివారి ఆలయం పునఃనిర్మాణం తరువాత శిల్పకళ, హిందుత్వం ఉట్టి పడుతున్నాయన్నారు.


ప్రజా చైతన్యానికి జర్నలిజం దోహదపడాలి

- మంత్రి వేణు, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని
- జర్నలిజం డిప్లొమా కోర్సు నోటిఫికేషన్ విడుదల


నోటిఫికేషన్ విడుదల చేస్తున్న మంత్రి వేణు, ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి పాత్రికేయ వృత్తి దోహదపడాలని, ఆ దిశగా చురుకైన పాత్ర పోషించాలని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. డిప్లొమా ఇన్ జర్నలిజం కోర్సు నోటిఫికేషన్‌ను రాజమహేంద్రవరంలో మంత్రి శుక్రవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రెస్ అకాడమీ డిప్లొమా కోర్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 8,699 మంది జర్నలిస్టులకు హెల్త్‌కార్డులు అందజేశామని చెప్పారు. తద్వారా వారిపై ఆధారపడిన 26,700 మంది కుటుంబసభ్యులకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నామన్నారు. ఇప్పటివరకు వివిధ వైద్య సేవల కోసం రూ.2.70 కోట్ల మేర చెల్లింపులు చేసినట్లు చెప్పారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జర్నలిజం డిప్లొమా కోర్సు కోసం నాగార్జున వర్సిటీతో ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. శుక్రవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని.. తరగతులను కరస్పాండెన్స్ విధానంలో(ఆన్‌లైన్) నిర్వహిస్తారన్నారు. pressacademy.ap.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుకు ఏప్రిల్ 15 వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. జర్నలిస్టులకు రూ.1,500, ఇతరులకు రూ.2 వేలు ఫీజుగా నిర్ణయించామన్నారు. ప్రెస్ సెక్రటరీ, ప్రెస్ అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో డీడీ ద్వారా మాత్రమే ఫీజు చెల్లించాలని సూచించారు. జర్నలిస్టులకు ఇంటర్మీడియట్, ఇతరులకు డిగ్రీ కనీస విద్యార్హతగా ఉండాలన్నారు. పాత్రికేయులు ఏఆర్‌వీ సత్యనారాయణమూర్తిని, సాయిబాబాను మంత్రి వేణు, కొమ్మినేని సత్కరించారు. ప్రెస్ అకాడమీ అకడమిక్ డైరెక్టర్ ఎల్‌వీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత అక్రమ మైనింగ్‌కు విద్యార్థి బలి



పొందూరు: టీడీపీ నాయకుడు చేస్తున్న గ్రావెల్ అక్రమ మైనింగ్ ఓ విద్యార్థి జీవితాన్ని బలితీసుకుంది. ఈ ఘటన శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం వీఆర్ గూడెంలో జరిగింది. స్థానిక ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలు.. సంతకవిటి మండలం జీఎస్ పురం గ్రామానికి చెందిన బగాది మణికంఠ(20) శ్రీకాకుళంలో బీఎస్సీ సెకండియర్ చదువుతున్నాడు. తల్లి వెంకటలక్ష్మి కూలి పనులు చేస్తుంది. 4 రోజుల కిందట మణికంఠ పొందూరు మండలంలోని వావిపల్లిపేటలో ఉంటున్న అమ్మమ్మ, తాతయ్యల ఇంటికి వచ్చాడు. సమీపంలోని వీఆర్ గూడెం కొండపై టీడీపీ నాయకుడు సువ్వారి మధుసూధనరావు రాత్రి వేళల్లో గ్రావెల్ అక్రమ మైనింగ్ చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మణికంఠ గురువారం రాత్రి పని కోసం క్వారీకి వెళ్లాడు. అక్కడ లారీ డ్రైవర్ నాగరాజు అజాగ్రత్తగా బండి నడిపి మణికంఠను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన మణికంఠ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ క్వారీ అక్రమంగా నిర్వహిస్తున్నది కావడంతో.. ఘటనను క్వారీకి దూరంగా జరిగినట్టుగా చిత్రీకరించేందుకు సువ్వారి మధుసూదనరావు, డ్రైవర్ ప్రయత్నించారు. ఎస్‌ఐ లక్ష్మణరావు అక్కడకు చేరుకొని దర్యాప్తు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధుసూదనరావు, లారీ డ్రైవర్, ఘటనకు సంబంధమున్న మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

భూ'సారం' కనిపెట్టేలా

▶ మొదటి పేజీ తరువాయి

ఏప్రిల్ 3వతేదీ నుంచి శ్రీకారం చుట్టనున్నారు. నమూనాలను రాష్ట్రంలోని 20 భూసార పరీక్షా కేంద్రాలతో పాటు నియోజకవర్గ స్థాయిలో అందుబాటులో ఉన్న 72 వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రీ ల్యాబ్స్ ద్వారా పరీక్షించనున్నారు. డిసెంబర్ కల్లా మిగిలిన మరో 55 అగ్రి ల్యాబ్స్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించిన తర్వాత వాటిలో కూడా భూసార పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ల్యాబ్‌లో రోజుకు 50 శాంపిళ్ల చొప్పున 12 పారామీటర్లతో పరీక్షించి 24 గంటల్లో ఫలితాలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఫలితాలను రైతుల మొబైల్‌కు పంపడమే కాకుండా ప్రతి రైతుకు సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేయనున్నారు. మట్టి నమూనాల సేకరణ నుంచి పరీక్షలు, ఫలితాలు, సిఫార్సుల అమలు వరకు పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందిస్తున్నారు. భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకు తగిన మోతాదులో ఎరువుల వినియోగంపై ఆర్బీకేల స్థాయిలో రైతులకు అవగాహన కల్పించనున్నారు.

ప్రతి ల్యాబ్‌లో రూ.25 లక్షల విలువైన పరికరాలు

భూసార పరీక్షా కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు అగ్రిల్యాబ్స్‌లో పరికరాలను సమకూరుస్తున్నారు. పీహెచ్, ఈసీ, నైట్రోజన్, ఫాస్పరస్, పొటాష్, ఆర్గానిక్ కార్బన్, సల్ఫర్‌తో పాటు జింక్, బోరాన్, కాపర్, మాంగనీస్, ఐరన్ (సూక్ష్మ పోషకాలు) లోపాలను పరీక్షించనున్నారు. ఇందుకోసం ప్రతి ల్యాబ్‌లో రూ.25 లక్షల ఖర్చుతో అత్యాధునిక పరికరాలను సమకూరుస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో కనీసం 3.22 లక్షల నమూనాలను పరీక్షించి ఫలితాలను ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యే నాటికి అందించనున్నారు. డిసెంబర్‌లో మరో 1.15 లక్షల నమూనాలను పరీక్షించి రబీ సీజన్ ప్రారంభమయ్యేలోగా రైతులకు అందించాలని నిర్ణయించారు. వచ్చే సీజన్ కల్లా నియోజకవర్గ స్థాయి ల్యాబ్స్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చి ఏటా ఖరీఫ్ సీజన్‌లో 5.14 లక్షలు, రబీలో 1.84 లక్షల శాంపిళ్లను పరీక్షించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

ప్రతి రైతుకు సాయిల్ హెల్త్ కార్డు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏప్రిల్ 3వతేదీ నుంచి మట్టి నమూనాల సేకరణకు శ్రీకారం చుడుతున్నాం. ప్రస్తుత సీజన్‌లో కనీసం 3 లక్షలకు పైగా నమూనాలు పరీక్షించాలని లక్ష్యంగా నిర్ణయించాం. ప్రతి రైతుకు సాయిల్ హెల్త్ కార్డులిస్తాం. రబీ సీజన్‌కు ముందు కూడా నమూనాలను పరీక్షిస్తాం. మరోవైపు తొలిదశలో మండలానికి ఒక ఆర్బీకేలో ఎంపిక చేసిన సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో ప్లాంట్ డాక్టర్ కాన్సెప్ట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చేలా సన్నాహాలు జరుగుతున్నాయి.

– చేవూరు హరికిరణ్, స్పెషల్ కమిషనర్, వ్యవసాయశాఖ

జీతం చెల్లించకుంటే ఆ మహిళ బతికేదెట్లా?

- వ్యక్తిగత హాజరుకు ఆదేశాలిస్తేనే కోర్టు ఆదేశాలను అమలు చేస్తున్నారు
- అధికారుల తీరుపై హైకోర్టు అసహనం

సాక్షి, అమరావతి: ఓ మహిళా ఉద్యోగికి జీతం చెల్లించాలని తాము ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడంపై అధికారులపై హైకోర్టు శుక్రవారం అసహనం వ్యక్తం చేసింది. జీతం చెల్లించకుంటే ఆ మహిళ ఎలా బతకాలని అధికారులను ప్రశ్నించింది. హెచ్‌ఆర్‌ఏ, డీఏ తదితరాలను కలిపి చెల్లించే దానిని జీతం అంటారే తప్ప, వాటిని తీసేసి ఇస్తే జీతం అనరని స్పష్టం చేసింది. ఆ ఉద్యోగిని దాఖలు చేసిన అఫిడవిట్‌కు సమాధానం ఇవ్వాలని కోర్టు ముందు హాజరైన సీనియర్ ఐఏఎస్ అధికారిణి, సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, వైద్య విద్య శాఖ అప్పటి డైరెక్టర్, వైఎస్సార్ వైద్య విశ్వవిద్యాలయం ప్రస్తుత వీసీ కె.బాబ్జీ, విజయవాడ ప్రభుత్వ డెంటల్ కాలేజీ అప్పటి ప్రిన్సిపల్ టి.మురళీమోహన్‌లను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేస్తూ జస్టిస్ గంగారావు, జస్టిస్ వెంకటరమణ ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. తనకు కొన్నేళ్లుగా జీతం చెల్లించడంలేదంటూ విజయవాడ ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో జూనియర్ అసిస్టెంట్ టి.సుజాత దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యంపై ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. ధర్మాసనం ఆదేశాల మేరకు పూనం మాలకొండయ్య, బాబ్జీ, మురళీమోహన్ శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. వీరి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, పిటిషనర్‌కు చెల్లించాల్సిన రూ.14 లక్షల జీతం మొత్తాన్ని ఇటీవల చెల్లించామన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది జోక్యం చేసుకుంటూ, జీతం మాత్రమే చెల్లించారని, డీఏ, హెచ్‌ఆర్‌ఏ కింద రూ.8 లక్షలు చెల్లించాల్సి ఉందని కోర్టుకు నివేదించారు. ధర్మాసనం స్పందిస్తూ బకాయిల చెల్లింపు విషయంలో పూర్తి వివరాలను కోర్టు ముందుంచాలని అధికారులను ఆదేశించింది. కోర్టు ఆదేశాల అమల్లో అధికారులు నిర్లక్ష్యపూరిత వైఖరిని కొనసాగిస్తూనే ఉన్నారని వ్యాఖ్యానించింది. అధికారుల వ్యక్తిగత హాజరుకు ఆదేశాలు జారీ చేస్తే తప్ప, తమ ఆదేశాలు అమలు కావడంలేదని, ఈ తీరు అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేసింది.

'సీమ' కలం యోధుడు శ్రీనాథ్‌రెడ్డి

సంస్మరణ సభలో పలువురు నాయకుల ఘన నివాళి

కడప సెవెన్‌రోడ్స్ : తన వాడి, వేడి రాతల ద్వారా రాయలసీమ వాసుల కన్నీళ్లు, కడగండ్లను ఎలుగెత్తి చాటి ఉద్యమానికి ఊపిరి పోసిన కలం యోధుడు దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి అని పలువురు నాయకులు కొనియాడారు. ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శ్రీనాథ్‌రెడ్డి సంస్మరణ సభ జరిగింది. మాజీ హోం మంత్రి ఎంవీ మైసూరారెడ్డి మాట్లాడుతూ నిర్భయంగా వార్తలు రాసి రాయలసీమ అభివృద్ధికి కృషి చేసిన శ్రీనాథ్‌రెడ్డిని మరువలేమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ శ్రీనాథ్‌రెడ్డికి వృత్తిపరంగా ఎదగడానికి అవకాశాలు వచ్చినా... కడపపై ఉన్న అభిమానంతో వదులుకున్నారని తెలిపారు. సీనియర్ ఎడిటర్ కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ నిబద్ధత, నిర్భీతి, నిజాయితీ శ్రీనాథ్‌రెడ్డిలో వంద శాతం ఉన్నాయన్నారు. వైఎస్సార్ జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ఉద్యమంలో శ్రీనాథ్‌రెడ్డి పాత్ర అమోఘమని కొనియాడారు. వై.నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో వివిధ పార్టీల నాయకులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొని శ్రీనాథ్‌రెడ్డి అందించిన సేవలు, ఆయనతో తమ అనుబంధాన్ని వివరించారు. శ్రీనాథ్‌రెడ్డి స్మారకార్థం యోగి వేమన విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగంలో ప్రతి సంవత్సరం గోల్డ్ మెడల్ ప్రదానం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య పంపిన సందేశాన్ని నాగిరెడ్డి చదివి వినిపించారు.


దివంగత విలేకరి నరసింహులు కుటుంబానికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న దేవులపల్లి అమర్ తదితరులు

జర్నలిస్టు కుటుంబానికి రూ.10లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

శ్రీనాథ్‌రెడ్డి అనుయాయుడు, దివంగత జర్నలిస్టు బి.నరసింహులు కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరు చేసిన రూ.10 లక్షల చెక్కును దేవులపల్లి అమర్ అందజేశారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు శిక్షణ పొందుతున్న నరసింహులు కుమార్తె మౌక్తికకు మనం సంస్థ ప్రతినిధులు రూ.2 లక్షల చెక్కును అందించారు. నరసింహులు చిన్న కుమార్తె చదువు కోసం రూ.లక్ష చెక్కును కడప జర్నలిస్టు మిత్రులు అందజేశారు.

నవజాత శిశువుల ఆరోగ్యంపై శ్రద్ధచూపాలి

- ఏజెన్సీలో పూర్తిస్థాయి వైద్యసౌకర్యాలు
- వైద్యసిబ్బంది, మందుల లభ్యతకు చర్యలు
- 40 ఏళ్ల తర్వాత చింతూరుకు స్పెషలిస్ట్ డాక్టర్ నియామకం
- సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియాలకు మందుల సరఫరా
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు నవజాత శిశువులను చికిత్సకు తీసుకొచ్చేటప్పుడు వారి ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం మంగళగిరిలోని తన కార్యాలయం నుంచి అరకు, పాడేరు ఎమ్మెల్యేలు, విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల కలెక్టర్లు, పాడేరు ఐటీడీఏ, వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు వైద్యసేవలు పూర్తిగా అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య ఆరోగ్యశాఖను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారని చెప్పారు. చింతూరు వంటి మారుమూల గిరిజన ప్రాంతానికి 40 ఏళ్ల తర్వాత స్పెషలిస్ట్ డాక్టర్‌ను నియమించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కుంతల సచివాలయం పరిధిలోని కిండ్లం గ్రామంలో ఇటీవల ఆరుగురు మరణించడంపై గిరిజనులు భయాందోళనలు చెందాల్సిన పనిలేదన్నారు. ఈ సందర్భంగా వీరంతా హైబీపీ, ఖైనీ నమలడం, మూఢనమ్మకాలతో నాటువైద్యం చేయించుకోవడం వంటి కారణాలతో చనిపోయినట్లు వైద్యాధికారులు చెప్పారు. సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియా వ్యాధులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అరకు, పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి ఫల్గుణ, భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర తమ ప్రాంత వైద్య అవసరాల కోసం విన్నవించగా వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు, వైద్యవిద్య సంచాలకుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిసవాల్‌ను స్వీకరించని ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి

- ఉదయగిరి బస్టాండ్‌లో ఎమ్మెల్యే కోసం ఎదురుచూసిన వైఎస్సార్‌సీపీ నేతలు
- అనారోగ్యంతో ఉన్నానంటూ అక్కడకి రాని ఎమ్మెల్యే


బస్టాండ్ సెంటర్‌లో వినయ్‌రెడ్డి, తదితరులు

ఉదయగిరి/ఆత్మకూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి విసిరిన సవాల్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతిస్పందించారు. అయితే ఆయన మాత్రం వారి సవాల్‌ను స్వీకరించలేదు. ఉదయగిరికి రాలేదు. వివరాలిలా ఉన్నాయి. పార్టీకి అన్యాయం చేసిన చంద్రశేఖర్‌రెడ్డి ఉదయగిరిలో అడుగుపెడితే ఒప్పుకోబోమని సొసైటీ మాజీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి గురువారం ఉదయం హెచ్చరించారు. దీనికి స్పందించిన చంద్రశేఖర్‌రెడ్డి సాయంత్రం ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని 'నేను బస్టాండ్‌లో ఉన్నాను.. ఏం చేస్తారో రా..' అంటూ సవాల్ చేశారు. ఈ విషయం తెలిసిన వినయ్‌రెడ్డి.. తన అనుచరులతో బస్టాండ్ వద్దకు చేరుకునేలోపు ఎమ్మెల్యే వెళ్లిపోయారు. ఈ సందర్భంగా వినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఈ రాత్రి, రేపు ఉదయగిరి బస్టాండ్‌లోనే ఉంటా.. దమ్ము, ధైర్యం ఉంటే ఇక్కడికి వచ్చి మాట్లాడాలి' అని ఎమ్మెల్యే సవాల్‌కు ప్రతిసవాల్ చేశారు. శుక్రవారం ఉదయం ఉదయగిరి మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి తమ అనుచరులతో బస్టాండ్‌కు వచ్చి అక్కడే ఉన్న వినయ్‌రెడ్డికి సంఘీభావంగా నిలిచారు. వారు ఎమ్మెల్యేకు ఫోన్ చేయగా.. ఆయన ఫోన్ కట్ చేశారు. ఆ తర్వాత అక్కడి వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ.. సీఎంను, పార్టీ పెద్దలను ఒక్క మాట అన్నా సహించేది లేదని హెచ్చరించారు. కాగా, ఉదయగిరి బస్టాండ్ వద్ద సీఐ వి.గిరిబాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అనారోగ్యంగా ఉన్నాను

ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. తన సోదరుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అనారోగ్యంతో ఉన్నానని, మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి వెళుతున్నానని, ఆరోగ్యం కుదుటపడిన తర్వాత తనపై సవాల్ చేసిన వారి గురించి మాట్లాడతానని చెప్పారు. 2024లో తన ఆరోగ్య పరిస్థితిని బట్టి ఎన్నికల్లో పోటీ చేస్తానని చెప్పారు.

పార్టీకి భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు: ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో 3 సంవత్సరాలుగా తాము దూరంగా ఉంటున్నామని, ఎవరి వ్యాపారాలు వారు చేసుకుంటున్నామని ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చెప్పారు. ఆత్మకూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. మేకపాటి కుటుంబం పట్ల సీఎం జగన్, వారి కుటుంబ సభ్యులు ఎంతో ఆదరణగా ఉంటున్నారని తెలిపారు. సస్పెండైన వారు వెళ్లిపోయినంత మాత్రాన వైఎస్సార్‌సీపీకి ఎలాంటి నష్టం లేదని అన్నారు. తాను పార్టీ మారుతున్నట్లు కొన్ని చానెల్స్ విషప్రచారం చేశాయని, వాస్తవాలు తెలుసుకోకుండా అలా ప్రసారం చేయడం సరికాదన్నారు.


టీడీపీకి అధికారమిస్తే బీసీలకు ప్రత్యేక చట్టం

- టీడీపీ కార్యకర్తలపై కేసులు పెట్టిన పోలీసులను డిస్మిస్ చేస్తాం
- యువగళం పాదయాత్రలో లోకేశ్

చెన్నేకొత్తపల్లి/కనగానపల్లి: రాష్ట్రంలో టీడీపీని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తే బీసీల కోసం ప్రత్యేక చట్టాన్ని తెస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చెప్పారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి మండలంలో కొనసాగింది. కనుమ ఆశ్రమం సమీపం నుంచి మొదలైన పాదయాత్ర ప్యాదిండి వరకు సాగింది. ప్యాదిండి సభలో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల ముందు ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఆర్‌బీకే వ్యవస్థ పనిచేయటం లేదని చెప్పారు. టీడీపీని మళ్లీ అధికారంలోకి తెస్తే బీసీలకు ప్రత్యేక చట్టం చేస్తామని, ప్రజలపై పన్నులు వేయబోమని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గిస్తామని పేర్కొన్నారు. జాకీ పరిశ్రమను మళ్లీ తీసుకొస్తామన్నారు. తనతో పాటు టీడీపీ కార్యకర్తలపై కేసులు పెట్టిన పోలీసులను తాము అధికారంలోకి రాగానే ఉద్యోగాల నుంచి డిస్మిస్ చేస్తామని చెప్పారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి కుటుంబపాలన సాగిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ పాదయాత్రకు నియోజకవర్గ పార్టీ నాయకులు పరిటాల సునీత, శ్రీరామ్ రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల నుంచి జనాన్ని సమీకరించేందుకు అష్టకష్టాలు పడ్డారు.

ఇదేం ఖర్మను నెలాఖరులోగా పూర్తి చేయాలి

టీడీపీ నేతలకు చంద్రబాబు సూచన



సాక్షి, అమరావతి: ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నేతలకు సూచించారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం నుంచి శుక్రవారం పార్టీ నేతలతో ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రజలను చైతన్య వంతులను చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగ పడతాయన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కష్టపడి పనిచేశారని కార్యకర్తలు, నేతలను ఆయన అభినందించారు. ఎమ్మెల్సీ ఎన్నికల వల్ల ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి కొంత విరామం వచ్చిందని, తిరిగి వెంటనే అన్ని చోట్లా ప్రారంభించాలని కోరారు. ఏప్రిల్ మొదటి వారంలో మూడు జోనల్ సమావేశాలు పూర్తయ్యాక తాను కూడా పలు జిల్లాల్లో ఈ కార్యక్రమాల్లో పాల్గొంటానని చెప్పారు.

ప్రమాణస్వీకారం చేసిన టీడీపీ ఎమ్మెల్సీలు

టీడీపీ తరఫున గెలిచిన నలుగురు ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి, పంచుమర్తి అనురాధ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. వెలగపూడిలోని శాసన మండలిలోని తన ఛాంబర్‌లో శుక్రవారం చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు వారితో ప్రమాణస్వీకారం చేయించారు.



సరిగమలే ఔషధాలు

ఆమె సంగీత విద్వాంసురాలు.
అంతేకాదు... వైద్యరంగంలో ప్రొఫెసర్.
వృత్తిని ప్రవృత్తిని మేళవించారామె.
సరిగమలు వైద్యానికి ఔషధాలయ్యాయి.
రాగాలు ఆరోగ్యాన్నిచ్చే టానిక్‌లవుతున్నాయి.
తీయని కృతులు షుగర్ లెవెల్స్ తగ్గిస్తున్నాయి.
సంగీత లయ బీపీకి గిలిగింత పెడుతోంది.

ప్రొఫెసర్ విజయలక్ష్మి సుబ్రహ్మణ్యమ్... కర్ణాటక సంగీతంలో రాగాల మీద పరిశోధన చేశారు. ఆ రాగాలు డిప్రెషన్‌ను దూరం చేయడానికి ఏ విధంగా దోహదం చేస్తాయనే విషయాలను శాస్త్రబద్ధం చేశారు. సంగీతం అనారోగ్యాన్ని మాయం చేస్తుందనడానికి ప్రత్యక్ష నిదర్శనం తానేనని కూడా చెబుతారామె. ఇరవై ఒక్క ఏళ్ల వయసులో ప్రమాదానికి గురై చక్రాల కుర్చీలో గడిపిన సమయంలో సంగీత సాధన ద్వారా వేగంగా సాంత్వన పొందిన వైనాన్ని గుర్తు చేసుకున్నారు. డాక్టర్‌గా తన వృత్తిని సంగీతం పట్ల మక్కువతో మేళవించి రాగాలతో చేస్తున్న వైద్యం గురించిన వివరాలను సాక్షితో పంచుకున్నారు.

తంజావూరు సరస్వతి మహల్

''నేను పుట్టింది బెంగళూరు, కర్నాటకలో స్థిరపడిన తమిళ కుటుంబం మాది. నాలో సంగీతాభిలాష ఎలా మొదలైందని చెప్పడం కష్టమే. ఎందుకంటే మా ఇల్లే ఒక సంగీత నిలయం. నానమ్మ గాత్రసాధనతోపాటు వయొలిన్ సాధన కూడా చేసేవారు. అమ్మ ఉద్యోగపరంగా సైన్స్ టీచర్, కానీ ఆమె కూడా సంగీతంలో నిష్ణాతురాలు. మా నాన్న శిక్షణ పొందలేదనే కానీ సంగీతపరిజ్ఞానం బాగా ఉండేది. అలా నాకు మా ఇంటి గోడలే సరిగమలు నేర్పించాయి. నాన్న ఉద్యోగరీత్యా దేశంలో అనేకచోట్ల పెరిగాను. గుజరాత్, బరోడాలో ఉన్నప్పుడు సంగీతంతోపాటు భరతనాట్యం కూడా నేర్చుకున్నాను. సంగీతం నాకు ధారణ శక్తికి బాగా ఉపకరించింది. దాంతో చదువులోనూ ముందుండే దాన్ని. ఎంబీబీఎస్‌లో సీటు వచ్చిన తర్వాత నా చదువు, అభిరుచి రెండు వేర్వేరు ప్రపంచాలయ్యాయి. రెండింటినీ వేరుగా చూడడం నాకు సాధ్యపడలేదు. నాకు తెలియకుండానే కలగలిపి చూడడం మొదలైంది. సంగీతాన్ని ఒక కళగా సాధన చేయడంతో సరిపెట్టకుండా ఒక శాస్త్రంగా అధ్యయనం చేయడం మొదలుపెట్టాను. నాదయోగ, రాగచికిత్సల గురించి అప్పుడు తెలిసింది. తంజావూరు సరస్వతి మహల్ లైబ్రరీలో సంగీతంతో వైద్యవిధానాల గురించి గ్రంథాలున్నాయి. మెడిసిన్‌తోపాటు మ్యూజిక్‌ని కూడా విపరీతంగా చదివాను. రాష్ట్రంలో మూడవ ర్యాంకుతో కర్ణాటక సంగీతంలో కోర్సు పూర్తి చేశాను. మన దగ్గరున్న పురాతన రాతిశాసనాలతోపాటు విదేశాల్లో ఉన్న మ్యూజిక్ థెరపీలను తెలుసుకున్నాను. వైద్యానికీ– సంగీతానికీ మధ్య ఉన్న, మనం మరిచిపోయిన బంధాన్ని పునఃప్రతిష్ఠ చేయాలనే ఆకాంక్ష కలిగింది.

మతిమరపు దూరం

మ్యూజిక్ థెరపీ అనగానే అందరూ ఇక మందులు మానేయవచ్చని అపోహపడుతుంటారు. అలాగే మందులు కొనసాగించాల్సినప్పుడు ఇక మ్యూజిక్‌తో సాధించే ప్రయోజనం ఏముంది అని తేలిగ్గా తీసేస్తుంటారు. ఇక్కడ మనం తెలుసుకోవాల్సింది ఏమిటంటే... మా దగ్గరకు వచ్చిన ఒక పోలీస్ ఆఫీసర్ మూడు వందలకు పైగా దయాబెటిస్‌తో ఇన్సులిన్ తీసుకునేవాడు. మ్యూజిక్ థెరపీతో ఇన్సులిన్ అవసరం లేకుండా మందులు సరిపోయే దశకు తీసుకురాగలిగాం. నత్తితో ఇబ్బంది పడే పిల్లలు అనర్గళంగా మాట్లాడేటట్లు చేసింది సంగీతం. రెండు రోజులకోసారి డయాలసిస్ చేసుకుంటూ కిడ్నీ దాత కోసం ఎదురు చూస్తున్న పేషెంట్‌కి ఉపశమనం దొరికింది. ఇక నరాలు, నాడీ సంబంధ సమస్యలను నయం చేసి చూపిస్తున్నాం. ప్రతి పేషెంట్‌నీ వాళ్ల ఆహారవిహారాలు, ఇతర ఆరోగ్య సమస్యల ఆధారంగా విశ్లేషించి ప్రతి ఒక్కరికీ వారికి మాత్రమే ఉపకరించే సంగీత విధానాన్ని సూచిస్తాం. కొంతమంది కోసం ప్రత్యేకంగా పాటలు రాసి కంపోజ్ చేసి ఇస్తాం. పేషెంట్ ఇష్టాలు, మత విశ్వాసాల ఆధారంగా మ్యూజిక్ థెరపీని డిజైన్ చేస్తున్నాం. అయితే దీనికి ప్రత్యామ్నాయ వైద్యవిధానం అర్హత ఉన్నప్పటికీ ఇంకా ధృవీకరణ రాలేదు. కాంప్లిమెంటరీ మెడిసిన్‌గానే ఆచరణలో పెడుతున్నాం. వార్ధక్యం కారణంగా అల్జైమర్స్, డిమెన్షియాతో బాధపడుతున్న వాళ్లకు మ్యూజిక్ థెరపీతో అద్భుతాలు సాధించామనే చెప్పాలి. ఓ పెద్దాయన అయితే... భార్య పేరు కూడా మర్చిపోయాడు. నేను స్వయంగా పాట పాడుతూ ఆయన ప్రతిస్పందించే తీరును గమనిస్తున్నాను. ఆశ్చర్యంగా పాటలో తన భార్య పేరు రాగానే చిన్న పిల్లవాడిలాగ 'యశోదా' అంటూ పెద్దగా అరిచాడు. మా పరిశోధనాంశాల ఆధారంగా మ్యూజిక్ థెరపీని శాస్త్రబద్ధం చేయడానికి ప్రయత్నం చేస్తున్నాను'' అని చెప్పారు ప్రొఫెసర్ విజయలక్ష్మి. ఇదీ ఆమె మొదలు పెట్టిన 'ఇల్‌నెస్ టూ వెల్‌నెస్ ' జర్నీ. సరిగమలతో రాగాల వైద్యం త్వరలోనే అందరికీ అందుబాటులోకి రావాలని ఆకాంక్షిద్దాం.

– వాకా మంజులారెడ్డి

రాగాల చికిత్స

సంగీతం ఆరోగ్యప్రదాయినిగా అందరికీ అందుబాటులోకి తేవాలనే ఆకాంక్షలున్న వాళ్లందరం ఇండియన్ మ్యూజిక్ థెరపీ అసోసియేషన్ (ఐఎమ్‌టీఏ)గా సంఘటితమయ్యాం. ఇలాంటి సమూహాలు ఇంకా ఉన్నాయి. కానీ మనదేశంలో మ్యూజిక్ థెరపీ శాస్త్రబద్ధంగా, ఒక వ్యవస్థీకృతమైన అధీకృత సంస్థ ఏదీ లేదు. ఆ లోపాన్ని భర్తీ చేయడానికి ఇటీవల మంగళూరులో మా ఎనెపోయా మెడికల్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ కోర్సు ప్రారంభించాం. ఇది డాక్టర్ల కోసం మాత్రమే కాదు, వైద్యరంగంలో పని చేసే అందరూ ఈ కోర్సు చేయవచ్చు. ఇక నా ప్రయత్నంలో స్పెషల్ చిల్డ్రన్‌కి మ్యూజిక్ థెరపీ కోర్సు, డయాబెటిస్, హైపర్‌టెన్షన్, కిడ్నీ ఫెయిలయ్యి డయాలసిస్‌తో రోజులు గడుపుతున్న పేషెంట్‌లకు మెరుగైన ఫలితాన్ని చూశాను.

– ప్రొ॥ విజయలక్ష్మి సుబ్రమణ్యమ్,
హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓటోరైనోలారింగాలజీ, ఎనెపోయా మెడికల్ కాలేజ్, మంగళూరు, కర్ణాటక
– జనరల్ సెక్రటరీ, ఐఎమ్‌టీఏ


పిల్లలకు మ్యూజిక్ థెరపీ ఇస్తున్న ప్రొ॥ విజయలక్ష్మి సుబ్రమణ్యమ్



బర్డ్‌వాచింగ్

మనసు రెక్క విప్పాలంటే


తను వేసిన పక్షి ముగ్గులతో విద్యా సుందర్

బెంగళూరులో నివసించే విద్యా సుందర్ ఉదయాన్నే లేచి బాల్కనీలో నిలబడి కాసేపు పక్షుల్ని చూస్తుంది. వీలున్నప్పుడు టెర్రస్ మీదకు వెళ్లి ఎగిరే విహంగాలను చూస్తుంది. ఇంటి పనులు కట్టి పెట్టి ఒక్కోసారి వనాలకు వెళ్లి రంగులీనే పిట్టల్ని చూస్తుంది. ఇంటి ముందు వాటి ముగ్గుల్ని వేసి ముచ్చట పడుతుంది. రొటీన్ జీవితంలో మనసు రెక్క విప్పుకోవాలంటే బర్డ్ వాచింగ్ ఒక అలవాటుగా మార్చుకోమని ప్రచారం చేస్తోంది.

'బర్డ్‌వాచింగ్ చేయాలంటే ఇల్లు విడిచి దూరంగా వెళ్లడం తప్పనిసరి కాదు. మీ బాల్కనీలో కాసేపు కూచుని అక్కడున్న కుండీల దగ్గరకు వచ్చే పిట్టలను చూడండి. వాటి కూతలు వినండి. వాటి కళ్లు, రెక్కలు, తోకలు, గెంతే పద్ధతి, జంటతో వ్యవహరించే తీరు... ఇవన్నీ అబ్జర్వ్ చేయండి. మీ స్ట్రెస్ అంతా ఇట్టే పోతుంది. ఇంతకంటే మంచి హాబీ ఉంటుందా?' అంటుంది విద్యా సుందర్.

తమిళనాడు తిరునల్వేలికి చెందిన విద్యా సుందర్ బెంగళూరులో స్థిరపడింది. గృహిణిగా అందరికీ ఉండే పనులే ఉన్నా ముగ్గులు వేయడం హాబీగా మార్చుకుంది. ముగ్గుల్లో విద్యా సుందర్ చాలా అందంగా బొమ్మలు దించుతుంది. '2012లో నా కొడుకు నన్ను బెంగళూరులోని బర్డ్‌వాచింగ్ గ్రూప్‌కు పరిచయం చేశాడు. అలాంటి ఒక గ్రూప్ ఉంటుందా అని ఆశ్చర్యపోయాను. ఇంటి ముందుకు పిచుకలు, చిలుకలు వంటివి రావడం చిన్నప్పటి నుంచి అందరం చూస్తాం. మళ్లీ ప్రత్యేకంగా చూడటం ఏమిటి? అనుకుంటూ వెళ్లాను. కాని పక్షుల గురించి మనకేమీ తెలియదని... మనతో జీవించే ఒక పెద్ద జాతి గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత, వాటి మనుగడ కోసం చేయాల్సిన సాయం గురించి తెలిశాక ఈ హాబీని నేను వదలదల్చుకోలేదు. అంతే కాదు నాకు వచ్చిన ముగ్గుల కళను ఈ పిట్టల ప్రచారానికి ఉపయోగించడం ప్రారంభించాను. నా ఇంటి ముందు రోజూ ఒక పిట్టబొమ్మ ముగ్గుగా వేయాల్సిందే' అందామె.

ఎందుకు బర్డ్‌వాచింగ్?

ఇది మనసుకు ఆహ్లాదాన్ని ఇచ్చే హాబీ మాత్రమే కాదు. మానవ ఆవాసాల్లో, అడవుల్లో, వనాల్లో వాటి మనుగడకు చేయదగ్గ సాయం గురించి అవసరమైన డేటాను సేకరించే అర్థవంతమైన పని కూడా. 'బెంగళూరు నగరంలో ఏ రుతువులో ఎటువంటి పక్షులు ఉంటాయి. ఏ కాలంలో ఏవి వలస వెళతాయి. ఏవి వస్తాయి. ఏవి ఏ కాలంలో ప్రత్యుత్పత్తికి సిద్ధం అవుతాయి. ఇవన్నీ తెలిస్తే వాటి గూళ్ల నిర్మాణం గురించి, వాటికి అవసరమైన నీటి తావులు, వాటికి అపాయంగా మారే కాలుష్యం గురించి ప్రచారం చేసి వాటిని కాపాడుకోవచ్చు' అంటుంది విద్యా సుందర్. జనావాసాల్లో తిరుగాడే పిట్టలు, మనిషికి దూరంగా ఉండే పక్షులు ఇవన్నీ తెలుసుకుంటూ వెళ్లడం, వాటిని ఫొటోలు తీయడం, వాటి జీవన చక్రాలు తెలుసుకోవడం బర్డ్‌వాచర్స్ ముఖ్యంగా భావిస్తారు. అంత పని చేయలేని వారు వాటిని చూడటం ద్వారా ఆనందం పొందాలనుకుంటారు. వాటిని చూస్తే ఏదో ఒక అటాచ్‌మెంట్ వస్తుంది. వాటికి అపకారం జరిగే పనులు నివారించాలనే ఆలోచన వస్తుంది.

నగరాలు, పట్టణాలు, పల్లెలు... ఆవాసం ఏదైనా అక్కడ ప్రతిచోట బర్డ్‌వాచర్స్ ఉండాల్సిన అవసరాన్ని బర్డ్‌వాచింగ్ గ్రూపులు ప్రచారం చేస్తాయి. ఇటీవల ప్రభుత్వాలు కూడా వివిధ రాష్ట్రాలు 'బర్డ్ వాక్స్'ను ప్రమోట్ చేస్తున్నాయి. (ఇటీవల తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ హైదరాబాద్‌లోని బర్డ్‌వాచర్స్‌తో కలిసి నార్సింగిలోని ట్రెక్ పార్క్‌లో బర్డ్‌వాక్ నిర్వహించింది).

ఎన్నో పక్షులు

'గ్రామాల్లో ఉన్నవారు ప్రతి పక్షికి ఒక లోకల్ పేరు పెట్టుకుంటారు. ఆ పేర్లు కూడా ఎంతో అందంగా ఉంటాయి. మన పిల్లలకు మాతృభాషలో పిట్టల పేర్లు తెలియడం కూడా ముఖ్యమే. అందుకు బర్డ్‌వాక్స్‌కు వాళ్లను తీసుకెళ్లాలి. సృష్టిలో అసలు ఇన్ని రకాల పిట్టలు ఉన్నాయా అని ఎంత ఆశ్చర్యం వేస్తుందో. కేవలం తేనెటీగలను తినే పిట్టలు, గూళ్లను కట్టడంలో గొప్ప ఇంజనీరింగ్ చూపే పిట్టలు, పాడటంలో ఎంతో మాధుర్యం చూపే పిట్టలు, రంగుల పిట్టలు... వాటిని చూస్తే కలిగే ఆనందం వేరు. టీవీ సీరియల్స్ వల్ల, ఫోన్ వల్ల ఆ ఆనందం రాదు' అంటుంది విద్యా సుందర్.

ఈబర్డ్

ఇది గ్లోబల్ ఇంటర్‌నెట్ ప్లాట్‌ఫామ్. ఈబర్డ్‌లో వేలాది మంది బర్డ్‌వాచర్స్ ప్రతి దేశం నుంచి సభ్యులుగా ఉన్నారు. వీరంతా తాము చూసిన పక్షులను, వాటి వివరాలను, వాటి జీవన విధానాలను, అవి ఇష్టపడే ఆవాసాలను తెలుసుకుని ఇక్కడ నమోదు చేస్తుంటారు. ఒక విధంగా డేటాను పోగు చేస్తుంటారు. 'నేను కూడా ఈబర్డ్ ప్లాట్‌ఫామ్ సభ్యురాలినే. ప్రతి నెలా క్రమం తప్పకుండా నేను సేకరించిన డేటాను ఇక్కడ నమోదు చేస్తాను' అంటుంది విద్యా సుందర్.

పక్షిలోకానికి ఇలాంటి స్నేహితులు ఎప్పుడూ అవసరమే.

గెలుపు దారి

హెల్తీ సక్సెస్



కార్పొరేట్ ప్రపంచంలో పది సంవత్సరాలు పనిచేసిన అనుభవంతో ఎంటర్‌ప్రెన్యూర్‌గా తొలి వెంచర్‌కు శ్రీకారం చుట్టింది సౌమ్య మిట్టల్. అయితే తన తొలి వెంచర్ ఫెయిల్ అయింది. అయినా నరే, నిరాశతో నీరుగారిపోకుండా కొద్ది విరామం తరువాత రెండో వెంచర్ స్టార్ట్ చేసి సూపర్ సక్సెస్ అయింది సౌమ్య మిట్టల్...

స్కూల్ రోజుల్లో సౌమ్యను పేరుతో పిలిచేవాళ్లు తక్కువ. 'కొత్త అమ్మాయి' అని పిలిచేవారే ఎక్కువ. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాలో పుట్టిన సౌమ్య తండ్రి ఉద్యోగ బదిలీల వల్ల దేశవ్యాప్తంగా ఎన్నో పట్టణాల్లో చదువుకుంది.

తొలి ప్రయత్నంలోనే ఇంజినీరింగ్ ఎంట్రెన్స్‌లో ర్యాంకు సాధించిన సౌమ్య ఐఐటీ–దిల్లీలో కెమికల్ ఇంజినీరింగ్ చేసింది.

'ఐఐటీ–దిల్లీ నా జీవితాన్ని మార్చేసింది' అంటుంది సౌమ్య. అక్కడ తాను ఎన్నో విషయాలు నేర్చుకుంది. విశాల ప్రపంచాన్ని చూసింది. చదువు పూర్తయిన తరువాత ఒక కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగంలో చేరింది.

పది సంవత్సరాల ఉద్యోగ జీవితంలో రకరకాల విధులు నిర్వహించింది. ఎనిమిది నెలల మెటర్నిటీ లీవ్ తరువాత తిరిగి ఉద్యోగంలో చేరిన సౌమ్యకు ఉద్యోగం చేయడం కంటే ఏదైనా వెంచర్ మొదలు పెట్టాలనిపించింది. ఇంట్లో వాళ్లు కూడా ప్రోత్సాహకరంగా మాట్లాడారు.

'ఒక ప్రాడక్ట్ ఎప్పుడు సక్సెస్ అవుతుంది?'

ప్రాడక్ట్‌లో సత్తా అనేది ఒక విషయం అయితే... అంతకంటే ముఖ్యం అవసరం లేదా అత్యవసరం!

తొలి వెంచర్ 'పిక్సెల్ట్' ఫెయిల్ కావడానికి 'మస్ట్ ప్రాడక్ట్' అనిపించకపోవడమే కారణం అనే విషయం సౌమ్యకు బోధపడింది. తొలి వెంచర్‌లో ఫెయిలైనప్పటికీ మళ్లీ ఉద్యోగంలో చేరవద్దని గట్టిగా నిర్ణయించుకుంది.

అమెరికాలో ఉండే ఒక ఫిట్‌నెస్ ట్రైనర్‌ని సౌమ్య ఫ్రెండ్ పరిచయం చేసింది. సౌమ్యకు గుండెకు సంబంధించిన చిన్నపాటి సమస్య ఉండడంతో వర్కవుట్‌ల విషయంలో జాగ్రత్తపడడానికి ఫిట్‌నెస్ ట్రైనర్ సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయి. తన ఫిట్‌నెస్ జర్నీలో ట్రైనర్ ప్రాధాన్యత ఏమిటో సౌమ్యకు తెలిసొచ్చింది.

ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని 'ఫిట్ బడ్' పేరుతో హెల్త్ అండ్ ఫిట్‌నెస్ కోచ్‌లతో కూడిన గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌కు శ్రీకారం చుట్టింది.

దేశదేశాల క్లయింట్స్, ఫిట్‌నెస్ కోచ్‌లకు మధ్య సంధానకర్తగా వ్యవహరిస్తోంది ఫిట్ బడ్.

అవసరమైన సమయంలో వచ్చిన ఈ కస్టమర్ రిలేషన్ ప్లాట్‌ఫామ్ సూపర్ హిట్ అయింది. సమగ్రమైన ఫిట్‌నెస్ అండ్ న్యూట్రిషన్ మాడ్యూల్స్, అడ్వాన్స్‌డ్ ట్రాకింగ్ అండ్ ఎనాలటిక్స్, ఇంటరాక్టివ్ చాట్, వీడియో కాలింగ్ సదుపాయాలు 'ఫిట్ బడ్' విజయానికి కారణం అయ్యాయి.

'ఇతరుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవడంలో సిగ్గుపడకూడదు. ఏమీ అడగనప్పుడు ఏమీ తెలియదు. దీంతో వ్యాపారంలో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వ్యాపార ప్రస్థానంలో అతి చిన్న విజయానికైనా సరే పెద్దగా సంతోష పడాలి. ఆ సంతోషమే కొత్తబలాన్ని ఇచ్చి మరిన్ని విజయాలు సాధించేలా చేస్తుంది' అంటుంది సౌమ్య మిట్టల్.

రేపు ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ బుక్ డే

ఆ పుస్తకాలు ఆకుపచ్చ చందమామలు

పిల్లల కథల ప్రపంచంలో అందమైన అడవులు ఉంటాయి. అలరించే జీవజాలం ఉంటుంది. అయితే కాల్పనిక ప్రపంచం దాటి బయటికి వస్తే... పచ్చదనం కరువై అడవులు బోసిపోతున్నాయి. జీవజాలం ప్రమాదం అంచున ఉంది. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని పిల్లల్లో పర్యావరణ స్పృహ కలిగేలా పుస్తకాలు రాస్తోంది బెంగళూరుకు చెందిన రచయిత్రి, క్లైమెట్ వారియర్ బిజల్ వచ్ఛరజని...



రజని రాసిన 'ఏ క్లౌడ్ కాల్డ్ బూరా' 'కిటెన్ ట్రబుల్' 'ఏ బెండ్ ఇన్ టైమ్' 'హెల్ప్ మై అయి వాంట్స్ టు ఈట్ మీ' 'ది గ్రేట్ ఇండియన్ నేచర్ ట్రయల్ విత్ అంకుల్ బిల్కీ' 'సో యూ వాంట్ టూ నో ఎబౌట్ ది ఎన్విరాన్‌మెంట్' 'సావి అండ్ ది మెమోరీ కీపర్' పుస్తకాలు పిల్లల్ని ఎంతో ఆకట్టుకున్నాయి.

పిల్లల పుస్తకాలు రాయడంతోపాటు, వారి మనసులో ఏముందో తెలుసుకోవడం అంటే కూడా రజనికి ఇష్టం.

పుస్తకాల్లో చదివిన కథను తమ మాటల్లో అందంగా చెప్పడమే కాదు, ఆ కథల ద్వారా తాము తెలుసుకున్నదేమిటో పిల్లలు చెబుతున్నప్పుడు రజని ఆనందానికి అవధులు ఉండవు.

ప్రకృతిని అమితంగా అభిమానించే గుణం రజనికి తల్లి నుంచి వచ్చింది. ఆమె జంతువుల పట్ల దయతో ఉండేది. వీధుల్లో గాయపడిన శునకాలను ఇంటికి తీసుకువచ్చి సపర్యలు చేసేది.

రజని టీనేజ్‌లో ఉన్నప్పుడు తండ్రి చనిపోయాడు. ఆ విషాద ఒంటరితనంలో ఇంటికి దగ్గరలోని గుల్‌మోహర్ చెట్టే తనకు నేస్తం అయింది. ఆ చెట్టుతో మాట్లాడుతూ ఉండేది. తన ఈ వ్యక్తిగత అనుభవాన్ని 'సావి అండ్ ది మెమోరీ కీపర్' పుస్తకంలోకి తీసుకువచ్చింది రజని. ఈ పుస్తకంలో సావి అనే అమ్మాయికి తండ్రి చనిపోతాడు. ఆ సమయంలో చెట్లే తనకు అండగా ఉంటాయి. చెట్లు తమ వేర్ల ద్వారా ఎలా కమ్యూనికేట్ అవుతాయి...అనే దాని గురించి ఈ పుస్తకంలో చెప్పిన విషయాలు బాల పాఠకులకు బాగా నచ్చాయి.



'సావి అండ్ ది మెమోరీ కీపర్' పుస్తకం బాలసాహిత్య విభాగంలో అట్‌హర్ అవార్డ్–2023కు ఎంపికైంది. రజని ఈ అవార్డ్ తీసుకోవడం ఇది రెండోసారి. 2019లో 'ఏ క్లౌడ్ కాల్డ్ బూరా' పుస్తకానికి ఈ పురస్కారం దక్కింది.

కోస్టారికాలో 'యూనివర్శిటీ ఆఫ్ పీస్'లో ఎన్విరాన్‌మెంట్ సెక్యూరిటీలో మాస్టర్స్ డిగ్రీ చేసింది రజని. ఈ చదువు ద్వారా తాను తెలుసుకున్న పర్యావరణ సంబంధిత విషయాలను తన దగ్గరే దాచుకోలేదు. 'మ్యాజిక్ రియలిజం' ఫార్మట్‌లో వాటిని పుస్తకాల రూపంలో పిల్లల దగ్గరకి తీసుకువెళ్లింది.

'నేను పగలు పుస్తకాల ప్రచురణకు సంబంధించిన ఎడిటర్‌ని. రాత్రి పుస్తక రచయిత్రిని' అని తన గురించి తాను చెప్పుకుంటుంది రజని.

మరో విషయం ఏమిటంటే రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఆమె క్లైమెట్ వారియర్. కాలేజీరోజుల నుంచే పర్యావరణ సంబంధిత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటోంది. ఆమె రచన విధానం గురించి చెప్పాలంటే... ఒక ఐడియా అనుకొని కాగితంపై క్యారెక్టర్ల బొమ్మలు గీస్తుంది. వాటిని చూస్తూ కథ అల్లుకుంటుంది. పుస్తకంలో అచ్చులోకి వెళ్లేముందు పిల్లల చేత చదివించి వారి అభిప్రాయం తీసుకుంటుంది. 'పరమ బోరుగా ఉంది' అని పిల్లల్లో ఎవరైనా అంటే పుస్తకం తిరగరాయాల్సిందే!

రంజిత్‌లాల్, జాకీ మోరీస్, బుల్‌బుల్ శర్మ, షబ్నమ్ మిన్‌వాలా, పారో ఆనంద్... మొదలైన పిల్లల పుస్తక రచయితల రచనలు అంటే తనకు ఇష్టం. రంజిత్‌లాల్ 'ది టైగర్స్ ఆఫ్ టాబూ వ్యాలీ' పిల్లలు తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం అని చెబుతుంది రజని.



'పిల్లల పుస్తకాలలో సందేశాలు తప్పనిసరిగా ఉండాలా?' అనే ప్రశ్నకు ఇలా సమాధానం చెబుతుంది రజని...

'సందేశాల కోసం పుస్తకాలు చదివే పెద్దలు ఉంటారేమోగానీ పిల్లలైతే ఉండరు. వారి మొదటి ప్రాధాన్యత కథ మాత్రమే. దీన్ని దృష్టిలో పెట్టుకొని సందేశాన్ని అంతర్లీనంగా ఇవ్వాలి తప్ప, సందేశం కోసమే పుస్తకం రాసినట్లుగా ఉండకూడదు'

బాల పాఠకుల నాడి తెలిసిన రజని ప్రసిద్ధ ప్రచురణ సంస్థ హార్పర్‌కోలిన్స్ కోసం 'క్లైమెట్ ఛేంజ్'పై మరో పుస్తకం రాసే పని మొదలు పెట్టింది.

కిచెన్ టిప్

కన్నీళ్లు లేకుండా ఉల్లి కోయాలంటే..



ఉల్లిపాయను సరైన పద్ధతిలో కోస్తే ఎప్పుడూ కన్నీళ్లు రావు. దీని కోసం చేయాల్సిందల్లా ఉల్లి కోసేటప్పుడు పై భాగాన్ని పక్కన పెట్టి ముందు దాన్ని కోసేసి ఆ తర్వాత మిగిలిన భాగాన్ని కోయాలి. లేదంటే తొక్క తీసి కొంత సమయం పాటు ఫ్రిజ్‌లో పెట్టాలి. ఆ తర్వాత కోస్తే కన్నీళ్లు రావు.

● పేరెంటింగ్

సరైన తీరులోనే పెంచుతున్నారా?



తల్లిదండ్రుల్లో రెండు రకాలవారుంటారు. బాల్యంలో వారు ఏమి కోల్పోయారో, ఇతర పిల్లల్ని చూసి, 'అయ్యో నాకిది లేదే' అనుకున్నారో' అటువంటివన్నీ కూడా తమ బిడ్డకు అందివ్వాలని కోరుకుంటారు. తమకు చదువు లేకపోతే, తమ కొడుకును గొప్పగా చదివించుకోవాలని తాపత్రయపడటమో, సరైన తిండి తను తినలేకపోతే, తమ బిడ్డలకు మంచి మంచి పదార్థాలు తినిపించాలని చూడటమో చేస్తుంటారు. తమకు చదువు అబ్బకపోయినా, తాము కూలి పని చేసుకుని బతుకుతూనో, నాలుగిళ్లలో పాచి పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నప్పటికీ తమ పిల్లలను ప్రయోజకులను చేయాలని తపన పడతారు వీరు.

అటువంటి తల్లిదండ్రులకు హ్యాట్సాఫ్

మరొక రకం తల్లిదండ్రులుంటారు. వాళ్ల బాల్యంలో సుఖపడలేదు కాబట్టి తమలాగే బిడ్డలు కూడా సుఖపడకూడదనుకుంటారు. తాము కడుపునిండా తినలేదు కాబట్టి, తమ పిల్లలూ తమ లాగే ఏదో ఒక కూరతో తిని, అర్ధాకలితో ఉండాలని, తాము బస్సుల్లోనూ, కార్లలోనూ తిరగకుండా మైళ్లకొద్దీ నడిచి, బడికి వెళ్లి కష్టపడి చదువుకుని పైకి వచ్చాం... అని గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు. తల్లిదండ్రుల ద్వారా ఇటువంటి పరిస్థితులెదుర్కొన్న బిడ్డలు పెరిగి పెద్దయిన తర్వాత, ఏదో ఒక సందర్భంలో వెనక్కి తిరిగి చూసుకుంటారు.

మొదటిరకం తల్లిదండ్రుల ద్వారా వాళ్లనుభవించిన సంతోషకరమైన జీవితం తల్లిదండ్రులు వారికి పంచిన ప్రేమ, త్యాగాలని గ్రహిస్తారు. అలాంటి బిడ్డలు తమ చిన్నతనంలో తమనెలా చూసుకున్నారో తమ తల్లిదండ్రులను వారి వృద్ధాప్యంలో అలాగే చూసుకుంటారు.

ఇక రెండోరకం తల్లిదండ్రులు– ఎక్కడో మారుమూల పల్లెటూళ్లలో పుట్టి, నానా అగచాట్లూ పడి తినీ తినకా కష్టపడి పైసాపైసా కూడబెట్టిన తలిదండ్రులకు పుట్టిన మీరు... మీకు పుట్టిన బిడ్డలు ఇంకెంత ఎదుగుతారో ఊహించుకుని ఆ పద్ధతులకు, ఆ పరిస్థితులకు అనుగుణంగా మీ పిల్లలను ఎదగనివ్వండి. సంతోషపడండి. ఆనందించండి.

అంతేగానీ, ప్రతిదానికీ మీతో పోల్చుకుని, అనవసరమైన మాటలు చెప్పి వాళ్లను తికమక పెట్టవద్దు.. మా రోజుల్లో ఇలా తిరిగేవాళ్లం... ఇలా నడిచి వెళ్లే వాళ్లం... ఇలాంటి సాదా చెప్పులనే వేసుకునేవాళ్లం.... అని వాళ్లు సరదాపడేలా చెప్పడంలో తప్పులేదు. అయితే ఏది, ఎప్పుడు, ఎలా చెప్పాలన్నది ఆలోచించి మరీ చెప్పండి. మీరు పడ్డ ఇబ్బందులు, అనుభవించిన కష్టాలు మీ పిల్లలు అనుభవించకూడదనుకోవడంలో తప్పు లేదు అయితే వారిని మరీ ఎండ కన్నెరగని సుకుమారులుగా చూస్తూ కొండమీది కోతిని తెమ్మన్నా తెచ్చి ఇచ్చేందుకు సిద్ధపడ్డారనుకోండి.. అది మంచి పద్ధతి కాదు. అలాగని మీరు కష్టపడ్డారు కాబట్టి మీ పిల్లలూ కష్టపడాలనుకోవడమూ సరికాదు. ప్రస్తుత కాల మాన పరిస్థితులకు, పద్ధతులకు అనుగుణంగా మీ పిల్లల్ని తీర్చి దిద్దడం ఉత్తమం.

● మీకు తెలుసా?

ఇటీవలి కాలంలో రకరకాల పరిమళాలు, స్ప్రేల వినియోగం సర్వసాధారణమైంది. స్త్రీ పురుష భేదం లేకుండా వీటిని అందరూ విరివిగా ఉపయోగిస్తున్నారు.అయితే పెర్ఫ్యూమ్స్ ఎక్కువగా వాడితే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని నిపుణులు సూచిస్తున్నారు.పెర్ఫ్యూమ్ ఎక్కువగా వాడే వాళ్లకు చర్మ సంబంధ సమస్యలు వస్తుంటాయి. దీనికితోడు పెర్ఫ్యూమ్ తయారీలో వాడుతున్న రసాయనాలతో మానసిక సమస్యలు కూడా వస్తున్నాయని ఓ సర్వేలో తేలింది. మంచి వాసన వస్తోందని అతిగా పెర్ఫ్యూమ్స్ వాడితే చర్మవ్యాధులతో పాటు ముక్కు, కళ్లు, గొంతు నొప్పి, మతిమరుపు, శ్వాసకోశ వ్యాధులు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల వాడండి కానీ.. అతిగా వద్దు.



ప్లేట్‌లో రెయిన్‌బో

ఆకాశంలో విరిసే ఇంద్ర ధనుస్సును చూసి మురిసిపోని వారెవరు? అందుకే కవులు, రచయితలు కూడా ఇంద్రధనుస్సు గురించి ఎంతో అందంగా వర్ణిస్తుంటారు. రెయిన్‌బో పేరుతో రెస్టారెంట్లు, హోటళ్లు, కాన్వెంట్లు కూడా కనిపిస్తుంటాయి. రెయిన్‌బో డైట్ కూడా ఈ కోవలోకే వస్తుంది. అంటే... రెయిన్ బోలో ఎన్ని రంగులు ఉంటాయో మన ప్లేట్‌లో కూడా అన్ని రంగుల ఆహారపదార్థాలు ఉండేలా చూసుకోవడమే. అలా రెయిన్‌బో డైట్‌లో చేర్చిన రకరకాల రంగుల ఆహారాల వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. అవేంటో తెలుసుకుందాం.

రంగులలో ముందు చెప్పుకోవలసినది తెలుపు గురించే. ఎందుకంటే తెలుపులో ఏ రంగయినా ఇట్టే కలిసిపోతుంది కాబట్టి. ముందుగా తెలుపు రంగు ఆహారం గురించి చూద్దాం.

తెలుపు రంగు ఆహారం


ఉల్లి, వెల్లుల్లి, ముల్లంగి, పుట్టగొడుగులు, క్యాలీఫ్లవర్, పాలు, పెరుగు, కొబ్బరి వంటి ఆహారాలు తెలుపు రంగు ఆహారం కిందికి వస్తాయి. ఆహారంలో వీటిని భాగంగా చేసుకోవడం వల్ల కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు శరీరంపై దుష్ప్రభావం చూపకుండా అడ్డుకుంటాయి. ఎందుకంటే వాటిలో ఎక్కువ ఫైబర్ ..పొటాషియం ఉంటుంది.

నారింజ రంగు ఆహారం

నారింజ రంగు పండ్లు ..కూరగాయలలో కెరోటిన్ ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. నారింజ, మంచి గుమ్మడి, క్యారెట్లు... పీచ్ వంటివి కంటి చూపుతోపాటు కేశాలకు, చర్మ ఆరోగ్యానికీ కూడా ప్రయోజనకరంగా ఉంటాయి.

ఆకుపచ్చ ఆహారం

ఆకుపచ్చ కూరగాయలు ..పండ్లు మనకు ఎంతో మేలు చేస్తాయని ఎప్పటినుంచే వైద్యులు చెబుతున్నమాటే. అవి చాలా యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి మధుమేహం ..గుండె జబ్బులతో పోరాడతాయి. ఇందులో ఫోలేట్..ఐరన్ పుష్కలంగా ఉంటాయి. అందువల్ల, మీరు మీ ఆహారంలో బచ్చలికూర, మెంతికూర, క్యాబేజీ, బీన్స్, బఠాణి, బూడిద గుమ్మడి, కీరా, ద్రాక్ష, పచ్చి టొమాటో, పుదీనా చేర్చుకోవాలి.



పసుపు రంగు ఆహారం

బొప్పాయి, పైనాపిల్, నిమ్మ, మామిడి, మొక్కజొన్న వంటి పండ్లు ..కూరగాయలలో లభించే బ్రోమెలైన్ పాపైన్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.. ఇవి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి రక్తపోటును అదుపులో ఉంచుతాయి. పసుపు ఆహారాలలో ఉండే లుటీన్ జియాక్సంతిన్ పిగ్మెంట్లు, వయస్సు సంబంధిత వ్యాధులకు వ్యతిరేకంగా ప్రభావం చూపుతాయి.

నీలం లేదా ఊదా రంగు ఆహారం

బెర్రీలు, ఎర్రటి కూరగాయలు, నల్ల ద్రాక్ష, వంకాయ వంటివి మెదడు సామర్థ్యానికి ప్రోత్సాహకంగా పనిచేస్తాయి. వీటిలో ఉండే ఆంథోసైనిన్ ..రెస్వెట్రోల్ సమ్మేళనాలు శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే, ఇవి జీర్ణవ్యవస్థ పనితీరును కూడా మెరుగుపరుస్తాయి.. శరీరంలో మంటలను, వాపులను తగ్గిస్తాయి.

ఎరుపు రంగు ఆహారం

ఎరుపు రంగులో ఉండే చాలా కూరగాయలు ..పండ్లు మన హృదయానికి మేలు చేస్తాయట.. రెడ్ బెల్ పెప్పర్స్ (ఎరుపు రంగులో ఉండే క్యాప్సికం) దానిమ్మ పండ్లు, టొమాటో, పుచ్చకాయలు, యాపిల్ వంటి వాటిలో లైకోపీన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది క్యాన్సర్..తీవ్రమైన గుండె సంబంధిత వ్యాధులను దూరంగా ఉంచుతుంది. దీంతోపాటు వాటి ఎరుపు రంగుకు కారణమైన ఆంథోసైనిన్ సమ్మేళనం గుండె కండరాలను బలంగా ఉంచుతుంది.

ఒక రోజులో ఐదు రకాల పండ్లు ..కూరగాయలు.. ఒక వారంలో కనీసం 20 రకాల పండ్లు ..కూరగాయలు తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

హెల్త్ టిప్స్



పుదీనా ఆకులు ఎండబెట్టిన తర్వాత మెత్తగా నూరి ఆ చూర్ణానికి మంచి నీరు కలిపి వెంట్రుకలు రాలిన చోట రాస్తే జుట్టు తిరిగి మొలుస్తుంది. పుదీనా ఆకును కషాయంలా కాచి, దాన్ని గోరువెచ్చని నీటిలో కలుపుకొని స్నానం చేస్తే చర్మ రోగాలు అదుపులోకి వస్తాయి. పుదీనా పచ్చడి తినడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది.



అరటిపండ్లను పేస్టులా చేసి పాలలో కలిపి తీసుకుంటే నీరసం తగ్గుతుంది.



పొట్టలో వికారంగా ఉంటే మూడు పూటలా ఓ స్పూన్ తేనెను తీసుకోవాలి.



ఫుడ్ పాయిజన్ మూలాన వాంతులు, విరేచనాలు, నీరసం రావడం సహజం. అటువంటప్పుడు కాస్తంత జీలకర్రను నోట్లో వేసుకుని నమిలి ఆ రసాన్ని మింగడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

సినిమా



● పూజా హెగ్డే

బతుకమ్మ పాటలో...

బతుకమ్మ పాటలో బుట్టబొమ్మ పూజా హెగ్డే సందడి చేశారు. హిందీ చిత్రం 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్'లో వచ్చే బతుకమ్మ పండగ నేపథ్యంలో చేసిన సందడి ఇది. సల్మాన్ ఖాన్, పూజా హెగ్డే జంటగా ఫర్హాద్ సామ్జీ దర్శకత్వం వహించిన చిత్రం 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్'. ఇందులో వెంకటేశ్ కీలక పాత్ర చేశారు. ఈ చిత్రం ఈ నెల 23న విడుదల కానుంది. ఈ సినిమాలో తెలంగాణ సంస్కృతిలో భాగమైన బతుకమ్మ పండగ నేపథ్యంలో చిత్రీకరించిన పాటను రిలీజ్ చేశారు. ఈ పాటలో వెంకటేశ్, సల్మాన్ కూడా కనిపిస్తారు. ''తెలంగాణ మహిళలు సంబరంగా చేసుకునే బతుకమ్మ పండుగ పాటలో కనిపించడం హ్యాపీ. సల్మాన్ ఖాన్, వెంకటేశ్, భూమికగార్లతో ఈ పాటలో సందడి చేయడం హ్యాపీ'' అన్నారు పూజా హెగ్డే.



● రవితేజ

పండగ సీజన్ అంటే సినీ ప్రేమికులకు సినిమా సందడి ఉండాల్సిందే. అందుకే పండగ టార్గెట్‌గా సినిమాలను రిలీజ్ చేస్తుంటారు. పండగకి ఐదారు నెలల ముందే రిలీజ్ డేట్ ప్రకటించి, పండగ బెర్త్‌ని కన్ఫార్మ్ చేసేస్తుంటారు. అలా ఈ దసరా పండక్కి బాక్సాఫీస్ పోటీ ఆల్రెడీ మొదలైపోయింది. ఇప్పటికి అధికారికంగా విడుదల తేదీ ప్రకటించి, బాక్సాఫీస్ బరిలో నిలవనున్న సినిమాల గురించి తెలుసుకుందాం.

దసరా గురి...

తెలంగాణ నేపథ్యంలో...

రాయలసీమ నేపథ్యంలో బాలకృష్ణ హీరోగా నటించిన సినిమాలు చాలానే వచ్చాయి. అయితే తాజాగా పూర్తి స్థాయి తెలంగాణ యాసతో బాలకృష్ణ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. ఇందులో కాజల్ అగర్వాల్ హీరోయిన్. శ్రీలీల ముఖ్య పాత్ర చేస్తున్నారు. ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకుడు. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని దసరాకి రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది.



● రామ్, బోయపాటి



● విజయ్

ఓ గజదొంగ కథ

రవితేజ నటించిన తొలి పాన్ ఇండియా మూవీ 'టైగర్ నాగేశ్వరరావు'. స్టువర్టుపురం దొంగగా చెప్పుకునే టైగర్ నాగేశ్వరరావు జీవితం ఆధారంగా రూపొందిన ఈ చిత్రానికి వంశీ దర్శకత్వం వహించారు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 20న రిలీజ్ కానుంది.

మాస్ ఎనర్జీ

రామ్ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ హై ఓల్టేజ్ మాస్ ఫిల్మ్ రూపొందుతోంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్. శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ సినిమా అక్టోబరు 20న విడుదల కానుంది. కాగా రామ్ కెరీర్‌లో తొలి పాన్ ఇండియా ఫిల్మ్ ఇదే అన్న సంగతి తెలిసిందే.

మాఫియా డ్రామా

'మాస్టర్' (2021) చిత్రం తర్వాత హీరో విజయ్, దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న చిత్రం 'లియో'. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సంజయ్ దత్ ఓ కీలక పాత్ర చేస్తున్నారు. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతోన్న ఈ సినిమా అక్టోబరు 18న విడుదల కానుంది.

ప్రస్తుతానికైతే దసరా పండక్కి ఈ సినిమాలు కర్చీఫ్ వేశాయి. మరి.. పండగ రేస్‌లో ఫైనల్‌గా ఏ సినిమాలు ఉంటాయనే విషయం రానున్న రోజుల్లో తెలుస్తుంది.

అప్పుడు సంక్రాంతి.. ఇప్పుడు దసరా

హీరోలు రవితేజ, రామ్, విజయ్‌లు నటించిన చిత్రాలు ఒకేసారి బాక్సాఫీస్ వద్ద పోటీ పడటం ఇది తొలిసారి కాదు. 2021 సంక్రాంతికి రవితేజ 'క్రాక్', రామ్ 'రెడ్', విజయ్ 'మాస్టర్' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద పోటీ పడ్డాయి. ఇప్పుడు ఈ ముగ్గురి చిత్రాలు దసరా పోటీలో నిలిచాయి. ఈ మూడు సినిమాలతో పాటు ఇంకెన్ని సినిమాలు దసరా బరిలో నిలుస్తాయో చూడాలి.



● సమంత

సమంత టైటిల్ రోల్‌లో గుణశేఖర్ దర్శకత్వం వహించిన చిత్రం 'శాకుంతలం'. 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'మల్లికా మల్లికా మాలతీ మాలికా..' అంటూ సాగే వీడియో సాంగ్‌ని విడుదల చేశారు. ఈ పాటకు చైతన్య ప్రసాద్ సాహిత్యం అందించగా రమ్య బెహ్రా పాడారు. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ– ''శాకుంతలం' ప్రివ్యూ చూశాను.. అత్యద్భుతంగా అనిపించింది. ఈ సినిమాలో నాకు ఎంతో ఇష్టమైన పాట 'మల్లికా మల్లికా..'' అన్నారు. గుణశేఖర్ మాట్లాడుతూ– ''మల్లికా మల్లికా..' పాటని రికార్డింగ్ సమయంలో ఎంతగా ఆస్వాదించామో, తెరమీద చూసుకున్నప్పుడు అంతే సంతోషం కలిగింది'' అన్నారు. ''యూత్‌కి బాగా నచ్చే పాట ఇది'' అని నీలిమ గుణ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ, అడిషనల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్: టబ్బీ.

బాబా వల్ల అవకాశాలు తగ్గాయి!



● మనీషా కొయిరాల

''బాబా' సినిమా పరాజయంతో సౌత్‌లో నాకు అవకాశాలు తగ్గాయి'' అని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు మనీషా కొయిరాల. రజనీకాంత్, మనీషా జంటగా సురేష్‌కృష్ణ దర్శకత్వం వహించిన చిత్రం 'బాబా' (2002). ఈ చిత్రం గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మనీషా మాట్లాడుతూ – ''తమిళంలో నేను చేసిన చివరి పెద్ద సినిమా 'బాబా'నే. ఈ సినిమా విజయంపై భారీ అంచనాలు ఉండేవి. అయితే ఘోర పరాజయాన్ని చవి చూసింది. ఈ సినిమా ఫ్లాప్‌తో సౌత్‌లో నా కెరీర్ అయిపోతుందనుకున్నాను. అదే జరిగింది. 'బాబా'కన్నా ముందు సౌత్‌లో చాలా సినిమాలు చేశాను. అయితే ఈ సినిమా పరాజయం వల్ల అవకాశాలు తగ్గాయి. అయితే 'బాబా'ని మళ్లీ విడుదల (రజనీ పుట్టినరోజు డిసెంబర్ 12 సందర్భంగా గత ఏడాది డిసెంబర్ 10న రీ రిలీజ్) చేస్తే, హిట్ కావడం ఆశ్చర్యం అనిపించింది. ఏది ఏమైనా రజనీ సార్‌తో సినిమా చేయడం హ్యాపీ'' అన్నారు.

మీటర్ నవ్వులు పంచుతుంది

- రమేష్ కడూరి



''మీటర్' మంచి ఎంటర్‌టైనర్. తండ్రీ కొడుకుల మధ్య మంచి ఎమోషన్ ఉంటుంది. సినిమా అంతా ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది'' అని డైరెక్టర్ రమేష్ కడూరి అన్నారు. కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి జంటగా రూపొందిన చిత్రం 'మీటర్'. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా రమేష్ కడూరి మాట్లాడుతూ– ''నాది విజయనగరం జిల్లా గరివిడి మండలం. దర్శకులు బాబీ, గోపీచంద్ మలినేనిగార్ల వద్ద సహాయ దర్శకుడిగా చేశాను. 'మీటర్'తో దర్శకుడిగా పరిచయమవుతున్నాను. కరోనా లాక్ డౌన్ తర్వాత 'మీటర్' ఓకే అయ్యింది. ఈ మూవీలో కిరణ్ వైవిధ్యమైన పోలీసాఫీసర్ పాత్ర చేశారు. సెకండాఫ్‌లో ఓ పది నిమిషాలు ఆయన పాత్ర సీరియస్‌గా ఉంటుంది. ఆ పది నిముషాలు థియేటర్‌లో రఫ్ఫాడిస్తాడు. ఈ సినిమాకి సాయి కార్తీక్ నెక్ట్స్ లెవల్ మ్యూజిక్ ఇచ్చాడు. అనుకున్నదానికంటే బడ్జెట్ ఎక్కువైనా వెనకడుగు వేయని చెర్రీ, రవి శంకర్, నవీన్‌గార్లకు రుణపడి ఉంటాను'' అన్నారు.

నా కల నెరవేరింది

- హర్షవర్ధన్



''రావణాసుర' సినిమా ప్రత్యేకంగా ఉంటుంది. సుధీర్ వర్మగారు సౌండింగ్ కొత్తగా ఉండాలనుకుంటారు. సాంగ్స్, నేపథ్య సంగీతం కొత్తగా చేశాం. ఈ సినిమాకి పని చేయడం సవాలుగా అనిపించింది'' అని సంగీతదర్శకుడు హర్షవర్ధన్ రామేశ్వర్ అన్నారు. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'రావణాసుర'. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న రిలీజవుతోంది. ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. హర్షవర్ధన్ రామేశ్వర్ మాట్లాడుతూ– ''రావణాసుర'కి థీమ్ సాంగ్ కావాలని అభిషేక్, సుధీర్ వర్మ గార్లు అడగటంతో ట్యూన్ ఇచ్చాను. అది విని 'రావణాసుర'కి నువ్వే మ్యూజిక్ చేస్తున్నావ్' అనడంతో సర్‌ప్రైజ్‌గా అనిపించింది. రవితేజగారికి నేను పెద్ద ఫ్యాన్‌ని. ఆయన సినిమాకి పని చేయడంతో నా కల నెరవేరింది. 'రావణాసుర'కి నేను నాలుగు పాటలు, నేపథ్య సంగీతం అందించాను. భీమ్స్‌గారు ఓ ప్రత్యేక పాట చేశారు. సందర్భానుసారమే ఇళయరాజాగారి 'వెయ్యిన్నొక్క జిల్లాల..' పాటని రీమిక్స్ చేశాం. 'అర్జున్ రెడ్డి, జార్జ్ రెడ్డి' తర్వాత 'రావణాసుర' నన్ను మరో మెట్టు ఎక్కిస్తుందని నమ్ముతున్నాను. ప్రస్తుతం 'డెవిల్', 'యానిమల్' (హిందీ) సినిమాలకి సంగీతం అందిస్తున్నాను'' అన్నారు.

అంతర్జాతీయ పురస్కార బలగం



● 'బలగం' పోస్టర్

హాస్య నటుడు వేణు ఎల్దండి దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'బలగం'. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా నటించారు. 'దిల్' రాజు సారథ్యంలో శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ సినిమా మార్చి 3న విడుదలై, మంచి విజయం సాధించింది. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకుంది. లాస్ ఏంజిల్స్ సినిమాటోగ్రఫీ అవార్డ్స్‌లో ఈ చిత్రం బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీతోపాటు బెస్ట్ సినిమాటోగ్రఫీ అవార్డులకు ఎంపికైన విషయాన్ని చిత్రదర్శకుడు వేణు వెల్లడించారు. 'నా బలగం'కు ఇది మూడో అవార్డు. ప్రపంచ వేదికపై బలగం మెరుస్తోంది'' అన్నారు. ఈ అవార్డును ఛాయాగ్రాహకుడు ఆచార్య వేణు, దర్శకుడు వేణు అందుకోనున్నారు.

నిజమే నే చెబుతున్నా..



● వర్ష, సందీప్ కిషన్

'టైగర్' (2015) చిత్రం తర్వాత హీరో సందీప్ కిషన్, దర్శకుడు వీఐ ఆనంద్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'ఊరు పేరు భైరవకోన'. వర్ష బొల్లమ్మ, కావ్యా థాపర్ హీరోయిన్లు. అనిల్‌సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ సమర్పణలో రాజేష్ దండా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని 'నిజమే నే చెబుతున్నా' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ రొమాంటిక్ సాంగ్‌ను సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మలపై చిత్రీకరించారు. సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర స్వరపరచిన ఈ పాటకు శ్రీమణి సాహిత్యం అందించగా, సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఈ చిత్రానికి సహనిర్మాత: బాలాజీ గుత్తా, కెమెరా: రాజ్ తోట.

సాక్షి బిజినెస్
శనివారం
1-4-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,031	58,992
నిఫ్టీ ▲	279	17,360

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	12,150	▲ 137
డోజోన్స్	33,108	▲ 249
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,362	▲ 11
డాక్స్	15,629	▲ 106
షాంఘై	3,273	▲ 12
నికాయ్	28,041	▲ 259

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	59,751
బంగారం (22 క్యారెట్)	59,512
వెండి (కిలో)	71,582

దేశీయంగా ఎల్‌జీ డ్యుయల్ ఇన్వర్టర్ ఏసీ కంప్రెసర్‌ల తయారీ



గ్రేటర్ నోయిడా: మేకిన్ ఇండియా నినాదంలో భాగంగా ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా తమ కొత్త డ్యుయల్ ఇన్వర్టర్ ఏసీ కంప్రెసర్ల తయారీ యూనిట్‌ను ప్రారంభించింది. దీనిపై సుమారు రూ. 100 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. ఈ అధునాతన లైన్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 10 లక్షల యూనిట్లకు పైగా ఉండనుంది. ఎయిర్ కండీషనర్ల మార్కెట్లో తమ స్థానాన్ని మరింత పటిష్టపర్చుకునేందుకు ఇది ఉపయోగపడగలదని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఎండీ (తయారీ) హ్యూజిన్ లీ తెలిపారు. స్థానికంగా తయారీ సామర్థ్యాలను పెంచుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నామని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా ఇటీవలే తమ పుణే ప్లాంటులో సైడ్–బై–సైడ్ ఫ్రిజ్‌ల తయారీ ప్రారంభించామని లీ వివరించారు.

హెచ్‌ఐవీ ఔషధం తయారీలో అరబిందో



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వీఐఐవీ హెల్త్‌కేర్ రూపొందించిన హెచ్‌ఐవీ నివారణ ఔషధం కాబొటిగ్రావిర్ ఎల్‌ఏ జనరిక్ ఔషధం తయారీని అరబిందో ఫార్మా, సిప్లా, వయాట్రిస్ చేపట్టనున్నాయి. యునైటెడ్ నేషన్స్‌కు చెందిన మెడిసిన్స్ పేటెంట్ పూల్ ఈ మేరకు మూడు కంపెనీలతో సబ్‌లైసెన్స్ ఒప్పందాలు చేసుకుంది. ఈ కంపెనీలు ఔషధం అభివృద్ధి, తయారీతోపాటు 90 దేశాలకు సరఫరా చేస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నాయుడుపేట్, వైజాగ్ యూనిట్లలో ట్యాబ్లెట్లు, ఇంజెక్టబుల్ డోసుల రూపంలో కాబొటిగ్రావిర్ తయారు చేయనున్నట్టు అరబిందో తెలిపింది. ప్రపంచ డిమాండ్‌ను తీర్చే ఉత్పత్తి సామర్థ్యం కంపెనీకి ఉందని వివరించింది. హెచ్‌ఐవీ నివారణకు ఎక్కువ కాలం పనిచేసే ఇంజెక్టబుల్ ఉత్పాదన తక్కువ, మధ్యస్థాయి ఆదాయ దేశాల్లో అందుబాటులోకి రానుండడం ఇదే తొలిసారి అని అరబిందో వైస్ చైర్మన్, ఎండీ కె.నిత్యానంద రెడ్డి తెలిపారు. ఈ ఒప్పందం జనరిక్ హెచ్‌ఐవీ ఔషధ విభాగంలో కంపెనీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.

ఎగుమతుల లక్ష్యం.. 2 ట్రిలియన్ డాలర్లు

- 2030 నాటికి చేరుకోవాలని నిర్దేశం
- ఈకామర్స్ ఎగుమతులకు ప్రోత్సాహకాలు
- గ్లోబల్ కరెన్సీగా రూపాయి...
- కొత్త విదేశీ వాణిజ్య పాలసీని ప్రకటించిన కేంద్రం





ఎఫ్‌టీపీ 2023ని ఆవిష్కరిస్తున్న వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ తదితరులు

న్యూఢిల్లీ: ఎగుమతులను పరుగులు పెట్టించడమే లక్ష్యంగా సమర్థవంతమైన విదేశీ వాణిజ్య పాలసీ (ఎఫ్‌టీపీ)ని భారత్ ఆవిష్కరించింది. 2030 నాటికి దేశ ఎగుమతులను ఏకంగా 2 ట్రిలియన్ డాలర్లకు చేర్చడంతో పాటు రూపాయిని గ్లోబల్ కరెన్సీగా చేయాలని పాలసీలో నిర్దేశించింది. అంతేకాకుండా ఈకామర్స్ ఎగుమతులకు ప్రోత్సాహకాలను అందించాలని కూడా ప్రతిపాదించింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం ప్రవేశపెట్టిన ఎఫ్‌టీపీ 2023 ప్రకారం రాయితీల జమానా నుండి ప్రోత్సాహకాల దిశగా మారేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఎగుమతిదారులు, రాష్ట్రాలు, జిల్లాలు, భారతీయ మిషన్‌ల మధ్య భాగస్వామ్యాలను ప్రోత్సహించనున్నారు. లావాదేవీల వ్యయాన్ని తగ్గించడం, మరిన్ని ఎగుమతి హబ్‌లను అభివృద్ధి చేయడం కూడా తాజా పాలసీలో భాగం.

డైనమిక్ పాలసీ...

గతంలో అయిదేళ్లకోసారి ప్రకటించే ఎఫ్‌టీపీల మాదిరిగా కాకుండా ఈసారి ప్రభుత్వం డైనమిక్ అలాగే పరిస్థితులకు అనుగుణంగా స్పందించే పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీకి గడువు ముగింపు అంటూ ఏదీ ఉండదు, ప్రపంచ పరిణామాలకు అనుగుణంగా పాలసీని సవరిస్తారు. 'ఈ పాలసీకి గడువు తేదీ ఏదీ లేదు, కాలానుగుణంగా మార్పులు చేయడం జరుగుతుంది' అని పాలసీ ఆవిష్కరణ అనంతరం డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీటీఎఫ్‌టీ) సంతోష్ సారంగి పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా మన ఎగుమతులు మరిన్ని ప్రాంతాలకు భారీగా విస్తరించే విధంగా వాణిజ్య శాఖ చర్యలు చేపడుతుందని మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. రంగాల వారీగా లేదంటే దేశాల వారీగా దృష్టి పెడతామన్నారు. వచ్చే 4–5 నెలల్లో విదేశాల్లోని భారతీయ మిషన్‌లతో కలిసి వాణిజ్య శాఖ ఈ దిశగా చర్యలు చేపడుతుందని ఆయన వివరించారు. '2030 నాటికి 2 ట్రిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని చేరుకోవాలనేది మా లక్ష్యం. దీన్ని సాధిస్తామన్న నమ్మకం ఉంది. అయితే వస్తు ఎగుమతులు, సేవల ఎగుమతులను అధిగమించాలని మేము భావించడం లేదు' అని మంత్రి వ్యాఖ్యానించారు. శుక్రవారంతో ముగిసిన 2022–23 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుండి వస్తు, సేవల ఎగుమతులు 765 బిలియన్ డాలర్లను అధిగమించనున్నాయని డీజీఎఫ్‌టీ తెలిపారు. 2021–22లో ఈ మొత్తం ఎగుమతుల విలువ 676 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

రూపాయికి గ్లోబల్ హోదా...

అంతర్జాతీయ వాణిజ్యంలో మన రూపాయికి కూడా తగిన స్థాయిని కల్పించాలని ఎఫ్‌టీపీ లక్ష్యంగా పెట్టుకుంది. అంటే, విదేశీ వాణిజ్య లావాదేవీలకు రూపాయిల్లో చెల్లింపులు జరిపేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా దేశీ కరెన్సీలో సెటిల్‌మెంట్లకు ఎగుమతి ప్రయోజనాలను కల్పించనున్నారు. 'కరెన్సీపరమైన సంక్షోభాలు, లేదంటే డాలర్లకు కొరత ఉన్న దేశాలతో రూపాయిల్లో వాణిజ్య లావాదేవీలు నిర్వహించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బర్త్వాల్ పేర్కొన్నారు. కాగా, యంత్రపరికరాల ఎగుమతి ప్రోత్సాహక (ఈపీసీజీ) స్కీమ్ అలాగే ముందస్తు అనుమతులకు ప్రతిగా ఎగుమతి బాధ్యతలను (ఈఓ) నెరవేర్చడంలో విఫలమైన ఎగుమతిదారులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కోసం క్షమాభిక్ష స్కీమ్‌ను కూడా తాజా ఎఫ్‌టీపీలో పొందుపరిచారు. దీని ప్రకారం ఈఓల విషయంలో డిఫాల్ట్ అయిన పెండింగ్ కేసులన్నింటినీ క్రమబద్ధీకరిస్తారు. దీనికోసం మినహాయింపు పొందిన కస్టమ్స్ సుంకాలను, అలాగే 100% వడ్డీతో పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది.

పాలసీలో ఇతర చర్యలు...

- జిల్లాలను ఎగుమతి హబ్‌లుగా చేసేందుకు రాష్ట్రాలు, జిల్లా స్థాయిలో కలిసి పనిచేయడంపై కూడా ఎఫ్‌టీపీ 2023 దృష్టిపెట్టింది.
- యూఏవీ/డ్రోన్స్, క్రయోజనిక్ ట్యాంక్స్, ప్రత్యేక రసాయనాల వంటి ద్వంద్వ వినియోగ హై ఎండ్ ఉత్పత్తులు, టెక్నాలజీల ఎగుమతుల కోసం సరళమైన పాలసీలపై దృష్టిసారిస్తారు.
- ఈకామర్స్ ఎగుమతులకు ఎగుమతి ప్రయోజనాలను ప్రత్యేకంగా అందించాలని పాలసీ నిర్దేశించింది. కొరియర్ ద్వారా ఎగుమతుల విలువ పరిమితిని రెంట్టింపు చేస్తూ, ఒక్కో కన్‌సైన్‌మెంట్‌ను రూ.10 లక్షలకు చేర్చనున్నారు. కాగా, ఈకామర్స్ అగ్రిగేటర్లకు స్టాకింగ్, కస్టమ్స్ అనుమతులు, రిటర్న్‌ల ప్రక్రియను సులభతరం చేసేందుకు గిడ్డంగి సదుపాయంతో కూడిన ప్రత్యేక జోన్‌ను ఏర్పాటు చేయనున్నారు. 2030 నాటికి ఈకామర్స్ ఎగుమతులు 200–300 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతాయని అంచనా.
- అన్ని రకాల బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు (బీఈవీ), వర్టికల్ సాగు యంత్రాలు, మురుగు నీటి శుద్ధి, రీసైక్లింగ్, వర్షపు నీటి ఫిల్లర్లు, గ్రీన్ హైడ్రోజన్‌లను పర్యావరణహిత టెక్నాలజీ ఉత్పత్తుల్లోకి చేర్చారు. తద్వారా ఈపీసీజీ స్కీమ్ ప్రకారం వీటిపై ఎగుమతి పరమైన నియంత్రణలు తగ్గుతాయి.

ఆచరణాత్మక పాలసీ..

ఎఫ్‌టీపీ 2023ని కార్పొరేట్ వర్గాలు స్వాగతించాయి. ప్రపంచ వాణిజ్యంలో భారత వాటాను పెంచేలా ఆచరణాత్మక, సానుకూలమైన పాలసీగా పరిశ్రమ చాంబర్లు, ఎగుమతిదారులు దీన్ని అభివర్ణించారు. 2 ట్రిలియన్ డాలర్ల వస్తు, సేవల ఎగుమతి లక్ష్యాన్ని సాధించేలా అనేక వినూత్న చర్యలను పాలసీలో ప్రకటించారని భారతీయ పరిశ్రమల సమాఖ్య డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు. ఈ కొత్త పాలసీ అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ వాటాను భారీగా పెంచేందుకు దోహదం చేస్తుందని అసోచామ్ సెక్రటరీ జనరల్ దీపక్ సూద్ వ్యాఖ్యానించారు.

లాభాలతో వీడ్కోలు..!

సెన్సెక్స్ 1,031 పాయింట్లు, నిఫ్టీ 279 పాయింట్ల లాభం



ముంబై: 2022–23 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్లు లాభాలతో వీడ్కోలు పలికాయి. ఆఖరు రోజైన శుక్రవారం ... కీలక సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీలు సుమారు 2 శాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 1,031 పాయింట్లు పెరిగి దాదాపు 58,992 వద్ద, నిఫ్టీ 279 పాయింట్లు పెరిగి సుమారు 17,360 వద్ద క్లోజయ్యాయి. 'దలాల్ స్ట్రీట్‌లో బుల్స్ కొనుగోళ్లకు ఎగబడటంతో ప్రధాన సూచీలు సైకలాజికల్‌గా కీలక స్థాయికి ఎగువన ముగిశాయి. తద్వారా 2023 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్లు లాభాలతో వీడ్కోలు పలికాయి. అమెరికా, యూరప్ బ్యాంకింగ్ రంగ సంక్షోభంపై ఆందోళనలు తగ్గుముఖం పడుతుండటం ఈ ర్యాలీకి దోహదపడింది. తక్కువ ధరల్లో దొరుకుతున్న షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ముందుకొచ్చారు' అని కోటక్ సెక్యూరిటీస్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ అమోల్ అథవాలే తెలిపారు.

రిలయన్స్ జోష్..

ప్రధాన సూచీల షేర్లలో రిలయన్స్ షేరు అత్యధికంగా 4 శాతం ఎగిసి రూ. 2,331 వద్ద క్లోజయ్యింది. నెస్లే, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటార్స్, టీసీఎస్ మొదలైనవి లాభపడ్డాయి.

2022–23లో రూ. 5.86 లక్షల కోట్లు ఆవిరి..

గత ఆర్థిక సంవత్సరం దేశీ మార్కెట్లు.. అధిక ద్రవ్యోల్బణం, భౌగోళిక–రాజకీయ ఉద్రిక్తతలు, అధిక వడ్డీ రేట్ల వంటి పలు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నాయి. దీంతో 2022–23లో ఇన్వెస్టర్ల సంపద రూ. 5.86 లక్షల కోట్ల మేర కరిగిపోయింది. బీఎస్‌ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 2,58,19,896 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ తీరుతెన్నులను పరిశీలిస్తే.. 2022 జూన్ 17న సెన్సెక్స్ ఏడాది కనిష్ఠ స్థాయి 50,921 పాయింట్లకు తగ్గింది. డిసెంబర్ 1న ఆల్ టైమ్ గరిష్ఠం 63,583 పాయింట్లకు ఎగిసింది. డిసెంబర్ 14న బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 291.25 లక్షల కోట్ల రికార్డు స్థాయికి పెరిగింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏకంగా రూ. 15.77 లక్షల కోట్ల వేల్యుయేషన్‌తో అగ్రస్థానంలో నిల్చింది. టీసీఎస్ (రూ. 11.73 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ. 8.98 లక్షల కోట్లు) తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

చిన్న పొదుపులకు పెద్ద ఊరట

ఏప్రిల్ 1 నుంచి వడ్డీరేట్ల పెరుగుదల



న్యూఢిల్లీ: ఎకానమీలో వడ్డీ రేట్ల పెరుగుదల పరిణామాలు చిన్న పొదుపుదారులకు మేలు చేకూర్చుతున్నాయి. 2023 ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి సంబంధించి పలు పోస్టాఫీసు పొదుపు పథకాలపై వడ్డీరేట్లను 0.1 శాతం నుంచి 0.7 శాతం వరకూ పెంచుతూ ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకుంది. మే నెల నుంచి ఆర్‌బీఐ రెపో రేటును వరుసగా ఆరుసార్లు 2.5 శాతం పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి ఎగసింది. ఇది బ్యాంకులు అటు రుణ రేట్లు–ఇటు డిపాజిట్ రేట్ల పెరుగుదలకు దారితీస్తోంది. రానున్న త్రైమాసికానికి సంబంధించి పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), సేవింగ్స్ డిపాజిట్ల వడ్డీరేట్లు వరుసగా 7.1%, 4 శాతాలుగా కొనసాగించినప్పటికీ, ఇతర సేవింగ్స్ పథకాలపై రేట్లు 0.1% నుంచి 0.7% మధ్య పెరిగాయి. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్‌పై (ఎన్‌ఎస్‌సీ)పై అత్యధికంగా వడ్డీరేటు పెరిగింది.

పథకాల వారీగా రేట్ల పెరుగుదల (శాతాల్లో)

పథకం	కొత్త వడ్డీ	పాత వడ్డీ
ఎన్‌ఎస్‌సీ	7.7	7
సుకన్యా సమృద్ధి	8	7.6
సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్	8.2	8
కిసాన్ వికాస్ పత్ర	7.5	7.2
ఏడాది టర్మ్ డిపాజిట్	6.8	6.6
రెండేళ్ల టర్మ్ డిపాజిట్	6.9	6.8
మూడేళ్ల టర్మ్ డిపాజిట్	7	6.9
ఐదేళ్ల టర్మ్ డిపాజిట్	7.5	7
నెలవారీ ఆదాయ పథకం	7.4	7.1

సాక్షి స్పోర్ట్స్

రష్యా, బెలారస్ టెన్నిస్ ఆటగాళ్లపై నిషేధం ఎత్తివేసిన 'వింబుల్డన్' నిర్వాహకులు

ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం నేపథ్యంలో గత ఏడాది రష్యా, బెలారస్ టెన్నిస్ క్రీడాకారులపై ప్రతిష్టాత్మక ఆల్ ఇంగ్లండ్ క్లబ్ నిషేధం విధించింది. దాంతో ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రష్యా, బెలారస్ క్రీడాకారులు పాల్గొనలేకపోయారు. అయితే ఈ ఏడాది రష్యా, బెలారస్ క్రీడాకారులపై ఉన్న నిషేధాన్ని ఎత్తి వేస్తున్నామని, వారు తటస్థ క్రీడాకారుల హోదాలో పాల్గొనవచ్చని ఆల్ ఇంగ్లండ్ క్లబ్ తెలిపింది. దాంతో పురుషుల విభాగంలో స్టార్స్ మెద్వెదెవ్, రుబ్లెవ్, ఖచనోవ్ (రష్యా), మహిళల విభాగంలో విక్టోరియా అజరెంకా, ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత అరీనా సబలెంకా (బెలారస్) వింబుల్డన్‌లో ఆడేందుకు మార్గం సుగమమైంది. ఈ ఏడాది వింబుల్డన్ టోర్నీ జూలై 3 నుంచి 16 వరకు జరుగుతుంది.



సెమీస్‌లో సింధు

మాడ్రిడ్: స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సింధు 21–14, 21–17తో మియా బ్లిచ్‌ఫెల్ట్ (డెన్మార్క్)పై విజయం సాధించింది. నేడు జరిగే సెమీఫైనల్లో యో జియా మిన్ (సింగపూర్)తో సింధు ఆడుతుంది.మరోవైపు ఇదే టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ కిడాంబి శ్రీకాంత్ పోరాటం ముగిసింది. టాప్ సీడ్ కెంటా నిషిమోటో (జపాన్)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్ 18–21, 15–21తో ఓడిపోయాడు.

న్యూజిలాండ్‌దే సిరీస్

ప్రపంచకప్ బెర్త్ కోసం క్వాలిఫయింగ్ టోర్నీలో శ్రీలంక



హామిల్టన్: శ్రీలంకతో జరిగిన చివరిదైన మూడో వన్డేలో న్యూజిలాండ్ ఆరు వికెట్ల తేడాతో నెగ్గి సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. తొలి వన్డేలో కివీస్ గెలవగా... రెండో వన్డే రద్దయింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక 41.3 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (57; 8 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. హెన్రీ (3/14), షిప్లే (3/32), మిచెల్ (3/32) లంకను దెబ్బ తీశారు. అనంతరం న్యూజిలాండ్ 32.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసి గెలిచింది. విల్ యంగ్ (86 నాటౌట్; 11 ఫోర్లు), నికోల్స్ (44 నాటౌట్; 5 ఫోర్లు) ఐదో వికెట్‌కు వంద పరుగులు జోడించారు. ఈ సిరీస్ ఓటమితో శ్రీలంక ఈ ఏడాది భారత్ వేదికగా జరిగే వన్డే వరల్డ్‌కప్ టోర్నీకి నేరుగా అర్హత సాధించే అవకాశం కోల్పోయింది. ప్రపంచకప్ బెర్త్ కోసం జూన్–జూలైలో క్వాలిఫయింగ్ టోర్నీలో శ్రీలంక ఆడుతుంది.

గుజరాత్ ఘనంగా...

- తొలి మ్యాచ్‌లో గెలిచిన టైటాన్స్
- 5 వికెట్లతో చెన్నై ఓటమి
- మెరిసిన శుబ్‌మన్ గిల్

అహ్మదాబాద్: ఐపీఎల్–2023ని డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ ఘనంగా ప్రారంభించింది. దాదాపు ఏకపక్షంగా సాగిన సీజన్ తొలి పోరులో ధోని సేనపై పాండ్యా బృందం విజయాన్ని అందుకుంది. సొంతగడ్డపై భారీ అభిమాన సందోహం మధ్య శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 5 వికెట్ల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 7 వికెట్లకు 178 పరుగులు చేసింది. సిక్సర్ల వర్షం కురిపించిన రుతురాజ్ గైక్వాడ్ (50 బంతుల్లో 92; 4 ఫోర్లు, 9 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రషీద్ ఖాన్ (2/26), షమీ (2/29), అల్జారి జోసెఫ్ (2/33) రాణించారు. అనంతరం గుజరాత్ 19.2 ఓవర్లలో 5 వికెట్లకు 182 పరుగులు చేసి గెలిచింది. శుబ్‌మన్ గిల్ (36 బంతుల్లో 63; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు.

రుతురాజ్ మినహా...

చెన్నై మొత్తం ఇన్నింగ్స్‌లో రుతురాజ్ ప్రదర్శనే హైలైట్‌గా నిలిచింది. ఇతర బ్యాటర్లంతా విఫలం కాగా అతనొక్కడే ఈ స్కోరులో కీలకపాత్ర పోషించాడు. షమీ చక్కటి బంతితో కాన్వే (1)ను క్లీన్‌బౌల్డ్ చేయడంతో చెన్నై తొలి వికెట్ కోల్పోయింది. ఐపీఎల్‌లో షమీకి ఇది 100వ వికెట్. ఐర్లాండ్ నుంచి ఐపీఎల్‌లో ఆడిన తొలి క్రికెటర్‌గా గుర్తింపు తెచ్చుకున్న జోష్ లిటిల్ తన తొలి ఓవర్లో 15 పరుగులు సమర్పించుకున్నాడు. షమీ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌తో దూకుడు ప్రదర్శించిన మొయిన్ అలీ (17 బంతుల్లో 23; 4 ఫోర్లు, 1 సిక్స్)ని రషీద్ అవుట్ చేయడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 51/2కు చేరింది. పాండ్యా ఓవర్లో రెండు సిక్స్‌లు కొట్టిన రుతురాజ్... జోసెఫ్ ఓవర్లో మరింత చెలరేగి 3 సిక్స్‌లు బాదడం విశేషం. ఈ క్రమంలో 23 బంతుల్లోనే అతని అర్ధసెంచరీ పూర్తయింది. ఒకవైపు రుతురాజ్ చెలరేగినా... మరోవైపు బెన్ స్టోక్స్ (7), అంబటి రాయుడు (12) తక్కువ వ్యవధిలో పెవిలియన్ చేరారు. ఈ దశలో గుజరాత్ చక్కటి బౌలింగ్‌తో పరుగులు ఇవ్వకుండా కట్టడి చేసింది. సెంచరీ దిశగా వెళుతున్న రుతురాజ్‌తో పాటు జడేజా (1)ను కూడా ఒకే ఓవర్లో జోసెఫ్ వెనక్కి పంపించాడు. శివమ్ దూబే (19) ప్రభావం చూపలేకపోగా, ఆఖరి ఓవర్లో ధోని (14 నాటౌట్) వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి జట్టుకు చెప్పుకోదగ్గ స్కోరు అందించాడు.



గిల్

రాణించిన గిల్...

తుషార్ వేసిన రెండో ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టి ఛేదనను వృద్ధిమాన్ సాహా (16 బంతుల్లో 25; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) వేగంగా మొదలు పెట్టినా... తొలిసారి ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్న రాజ్‌వర్ధన్ మొదటి ఓవర్లోనే అతను వెనుదిరిగాడు. అయితే మరో ఎండ్‌లో గిల్ కొన్ని చక్కటి షాట్లతో ఆకట్టుకున్నాడు. సాయి సుదర్శన్ (17 బంతుల్లో 22; 3 ఫోర్లు) కూడా కొద్దిసేపు గిల్‌కు సహకరించాడు. జడేజా ఓవర్లో వరుసగా 4, 6 కొట్టి గిల్ 30 బంతుల్లో హాఫ్ సెంచరీని అందుకున్నాడు. అయితే తక్కువ వ్యవధిలో సుదర్శన్, పాండ్యా (8), గిల్ వికెట్లు కోల్పోయి గుజరాత్ కష్టాల్లో పడింది. ఈ దశలో విజయ్ శంకర్ (21 బంతుల్లో 27; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. చివరి 2 ఓవర్లలో 23 పరుగులు చేయాల్సి ఉండగా తెవాటియా (15 నాటౌట్), రషీద్ ఖాన్ (10 నాటౌట్) కలిసి 2 ఫోర్లు, 2 సిక్సర్లతో జట్టును గెలిపించారు.



రుతురాజ్



రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్

ఇరు జట్లకూ 'ఇంపాక్ట్'

సీజన్ తొలి మ్యాచ్‌లోనే కొత్త నిబంధన 'ఇంపాక్ట్ ప్లేయర్'ను ఇరు జట్లు వాడుకున్నాయి. చెన్నై జట్టు బ్యాటింగ్ ముగించుకున్న అంబటి రాయుడును ఫీల్డింగ్ సమయంలో తప్పించి అతనికి బదులుగా పేస్ బౌలర్ తుషార్ పాండేను బరిలోకి దించింది. గుజరాత్ టీమ్ కూడా ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన కేన్ విలియమ్సన్ స్థానంలో టాపార్డర్ బ్యాటర్ సాయి సుదర్శన్‌ను ఇంపాక్ట్ ప్లేయర్‌గా టీమ్‌లోకి తీసుకుంది.


ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ × కోల్‌కతా (మ. గం. 3:30 నుంచి)
లక్నో × ఢిల్లీ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

అరిజిత్ పాట... రష్మిక, తమన్నా ఆట!

ఐపీఎల్‌లో తొలి మ్యాచ్‌కు ముందు ఆరంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రముఖ గాయకుడు అరిజిత్ సింగ్ మధురమైన గొంతుతో తన కొన్ని అత్యుత్తమ హిట్ సాంగ్స్‌ను పాడుతూ ప్రేక్షకులను ఉత్సాహపరిచాడు. కేసరియా, చన్నా మేరేయా, తూ మేరా కోయీనా, పఠాన్ తదితర పాటలతో పాటు '83' సినిమాలోని స్ఫూర్తిదాయక పాట 'లహరాదో' వచ్చినప్పుడు త్రివర్ణ పతాకాలతో అభిమానులు తమ ఆనందాన్ని ప్రదర్శించారు. ఇద్దరు హీరోయిన్లు రష్మిక మంధాన, తమన్నా భాటియా చేసిన డ్యాన్స్ ప్రదర్శనలతో 'హౌస్‌ఫుల్' స్టేడియం ఊగిపోయింది. తమిళ హిట్ 'తమ్ తమ్', పుష్ప సినిమాలోని 'ఊ అంటావా'తో పాటు లవ్ యాత్రి సినిమాలోని గుజరాతీ దాండియా పాట 'రంగీలా తారా'కు డ్యాన్స్ చేసినప్పుడు హర్షధ్వానాలతో ప్రేక్షకులు హోరెత్తించారు. రష్మిక తన హిట్ సాంగ్స్ సామీ, శ్రీవల్లిలకు డ్యాన్స్ చేయడంతో పాటు ఆస్కార్ విజేత 'నాటు నాటు' పాటకూ నర్తించింది. ఆ స్టెప్పులకు ఫ్యాన్స్ అంతా తాము పదం కలిపి జత చేరారు! అనంతరం ప్రత్యేక వాహనాల్లో ధోని, పాండ్యా వేదిక వద్దకు వచ్చారు. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో గుజరాత్ కెప్టెన్ పాండ్యా ఐపీఎల్ ట్రోఫీని తీసుకొచ్చి వేదికపై ఉంచాడు. ఈ ప్రారంభోత్సవానికి మందిరా బేడీ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ కార్యక్రమంలో జోష్ నింపింది.





రష్మిక



తమన్నా

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: కాన్వే (బి) షమీ 1; రుతురాజ్ (సి) గిల్ (బి) జోసెఫ్ 92; మొయిన్ అలీ (సి) సాహా (బి) రషీద్ 23; స్టోక్స్ (సి) సాహా (బి) రషీద్ 7; రాయుడు (బి) లిటిల్ 12; దూబే (సి) రషీద్ (బి) షమీ 19; జడేజా (సి) శంకర్ (బి) జోసెఫ్ 1; ధోని (నాటౌట్) 14; సాన్‌ట్నర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1–14, 2–50, 3–70, 4–121, 5–151, 6–153, 7–163. **బౌలింగ్:** షమీ 4–0–29–2, పాండ్యా 3–0–28–0, లిటిల్ 4–0–41–1, రషీద్ 4–0–26–2, జోసెఫ్ 4–0–33–2, యశ్ 1–0–14–0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) దూబే (బి) రాజ్‌వర్ధన్ 25; గిల్ (సి) రుతురాజ్ (బి) తుషార్ 63; సుదర్శన్ (సి) ధోని (బి) రాజ్‌వర్ధన్ 22; పాండ్యా (బి) జడేజా 8; విజయ్‌శంకర్ (సి) సాన్‌ట్నర్ (బి) రాజ్‌వర్ధన్ 27; రాహుల్ తెవాటియా (నాటౌట్) 15; రషీద్ (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (19.2 ఓవర్లలో 5 వికెట్లకు) 182. వికెట్ల పతనం:** 1–37, 2–90, 3–111, 4–138, 5–156. **బౌలింగ్:** దీపక్ చహర్ 4–0–29–0, తుషార్ దేశ్‌పాండే 3.2–0–51–1, రాజ్‌వర్ధన్ 4–0–36–3, సాన్‌ట్నర్ 4–0–32–0, జడేజా 4–0–28–1.

క్లుప్తంగా...

త్వరలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ

- అమిత్ షా హామీ ఇచ్చినట్లు ఆర్.కృష్ణయ్య వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: త్వరలోనే బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి, బడ్జెట్ కూడా పెంచుతామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చెప్పినట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జాతీయ బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరడి భూపేష్ సాగర్ తదితరులతో కూడిన బృందం శుక్రవారం అమిత్‌షాతో భేటీ అయింది. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జనగణనలో కుల గణన చేపట్టాలని, పట్టికలో దీనిని అదనంగా చేర్చాలని, బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు, పదోన్నతుల్లో, న్యాయమూర్తుల నియామకాల్లో రిజర్వేషన్లు, క్రీమిలేయర్ తొలగింపు, రూ.2 లక్షల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ తదితర 16 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అమిత్ షాకు అందజేసింది. అనంతరం ఆర్.కృష్ణయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలు మినహాయిస్తే అన్ని ప్రభుత్వాలూ కులగణనకు మద్దతిచ్చాయని, బీజేపీకి బీసీల పట్ల వివక్ష ఎందుకని ప్రశ్నించామన్నారు.

తెలంగాణ

ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయండి

- తెలంగాణ హైకోర్టులో సీబీఐ వాదనలు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) తెలంగాణ హైకోర్టును కోరింది. గంగిరెడ్డి బెయిల్ రద్దు కోరుతూ సీబీఐ ఈ నెల 21న దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చిల్లకూర్ సుమలత శుక్రవారం విచారణ చేపట్టారు. సీబీఐ తరఫున స్పెషల్ పీపీ న్యాయవాది నాగేందర్ వాదనలు వినిపించారు. గంగిరెడ్డికి ప్రైవేటు నోటీసులు జారీ చేయడానికి సమయం కావాలని కోరడంతో తదుపరి విచారణను న్యాయమూర్తి ఈ నెల 14వ తేదీకి వాయిదా వేశారు.

గుండెపోటుతో 13 ఏళ్ల బాలిక మృతి

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బోడతండాలో శుక్రవారం తెల్లవారుజామున ఓ 13 ఏళ్ల బాలిక గుండెపోటుతో మృతి చెందింది. బోడతండాకు చెందిన బోడ లక్పతి–వసంత దంపతుల రెండోకూతురు స్రవంతి(13) మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో నిద్రలేచి ఛాతీలో నొప్పిగా ఉందని నానమ్మకు చెప్పింది. మూత్రవిసర్జనకు బయటికి వెళ్లి వచ్చి పడుకుంది. కొంత సేపటికి బాలిక బాగా ఆయాస పడుతున్నట్లుగా నానమ్మ గుర్తించింది. బాలిక బాబాయి వచ్చి సీపీఆర్ చేసి వెంటనే మరిపెడ మండల కేంద్రంలోని ఓ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లగా అప్పటికే బాలిక మృతిచెందినట్లు చెప్పారు.

కేజ్రీవాల్ ఆదేశాలతో రూ.75 కోట్లు ఇచ్చా

- టీఆర్‌ఎస్ కార్యాలయంలో 'ఏపీ' అనే వ్యక్తికి అందజేశా
- నా వద్ద 700 పేజీల వాట్సాప్, టెలిగ్రామ్ చాటింగ్
- ఈ నిజాలతో కేజ్రీవాల్ గద్దె దిగడం ఖాయం
- లేఖ ద్వారా సుఖేష్ చంద్రశేఖర్ వెల్లడి

న్యూఢిల్లీ: రూ.200 కోట్ల మనీ లాండరింగ్ కేసులో అరెస్టయ్యి, ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న సుఖేష్ చంద్రశేఖర్ మరో బాంబు పేల్చాడు. 2020లో హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సమితి (ఇప్పుడు భారత రాష్ట్ర సమితి) కార్యాలయంలో 'ఏపీ' అనే వ్యక్తికి రూ.75 కోట్లు అందజేయాలని ఢిల్లీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, అప్పటి ఢిల్లీ మంత్రి సత్యేంద్ర జైన్ తనను ఆదేశించారని వెల్లడించాడు. ఒక్కో పెట్టెలో 15 కిలోల నెయ్యి (కోడ్ భాషలో రూ.15 కోట్లు) ఉందని, మొత్తం 5 పెట్టెలు(రూ.75 కోట్లు) హైదరాబాద్‌లో సిద్ధంగా ఉన్నట్లు కేజ్రీవాల్ తనతో చెప్పారని, ఆయన ఆదేశాల మేరకు వాటిని టీఆర్‌ఎస్ కార్యాలయ ప్రాంగణంలో రేంజ్ రోవర్ కారులో కూర్చొని ఉండగా సదరు వ్యక్తికి అందజేశానని తెలిపాడు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో 'ఏపీ' అనే వ్యక్తి భాగస్వామి అని తెలిపాడు. ఈ మేరకు శుక్రవారం తన న్యాయవాది అనంత్ మాలిక్ ద్వారా ఒక లేఖ విడుదల చేశాడు. 2020లో తనకు, కేజ్రీవాల్‌కు మధ్య నడిచిన చాటింగ్ గురించి సుఖేష్ ఇందులో ప్రస్తావించాడు. ఇది ట్రైలర్ మాత్రమేనని, 700 పేజీల వాట్సాప్, టెలిగ్రామ్ చాటింగ్ తన వద్ద ఉందన్నాడు. తాను బయటపెట్టే నిజాలతో కేజ్రీవాల్ ముఖ్యమంత్రి కుర్చీ నుంచి దిగిపోవడం ఖాయమన్నాడు. కాగా, ఢిల్లీ మద్యం కుంభకోణంలో మనీశ్ సిసోడియా తర్వాత అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు కావడం తథ్యమని ఇటీవల సుఖేష్ వెల్లడించిన విషయం తెలిసిందే. సుఖేష్ ఆరోపణలను కేజ్రీవాల్ తీవ్రంగా ఖండించారు. బీజేపీ ఆదేశాల ప్రకారమే అతను పని చేస్తున్నాడని మండిపడ్డారు.

ఆర్టీసీలో 'కారుణ్యం'

2016 - 2019 మధ్య మృతి చెందిన సిబ్బంది వారసులకు ఊరట

1,168 మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు సీఎం జగన్ ఆమోదం

ముఖ్యమంత్రి నిర్ణయంపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాల హర్షం



మనసున్న పాలకుడి పనితీరు ఎలా ఉంటుందో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి చాటుకున్నారు. 2016-19 మధ్య కాలంలో మరణించిన 1,168 మంది ఆర్టీసీ సిబ్బంది వారసులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పిస్తూ సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

- సాక్షి, అమరావతి/కదిరి

కారుణ్య నియామకాలు ఇలా...

జోన్	జూనియర్ అసిస్టెంట్లు	ఆర్టీసీ కానిస్టేబుళ్లు	కండక్టర్లు	డ్రైవర్లు	శ్రామిక్/అసిస్టెంట్ మెకానిక్‌లు
విజయనగరం	18	15	38	102	93
విజయవాడ	10	70	95	135	96
నెల్లూరు	-	9	42	33	110
కడప	6	52	-	98	146
మొత్తం	34	146	175	368	445

నాడు చంద్రబాబు ససేమిరా...

టీడీపీ అధికారంలో ఉండగా 2016 – 19 మధ్య 1,168 మంది ఆర్టీసీ ఉద్యోగులు మృతి చెందగా కారుణ్య నియామకాల కింద కుటుంబ సభ్యులకు ఉద్యోగాలిచ్చేందుకు చంద్రబాబు నిరాకరించారు. ఆర్టీసీ నాడు కార్పొరేషన్‌గానే ఉన్నప్పటికీ కనికరించలేదు. కారుణ్య నియామకాల కోసం ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు.

నేడు మానవత్వంతో..

కారుణ్య నియామకాల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానవీయ దృక్పథంతో వ్యవహరించారు. విలీనంతో ఆర్టీసీ ప్రభుత్వ విభాగంగా మారిన తరువాత కూడా కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చేందుకు సమ్మతించడం గమనార్హం. 1,168 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అర్హతలను బట్టి 34 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా, 146 మందికి ఆర్టీసీ కానిస్టేబుళ్లుగా, 175 మందికి కండక్టర్లుగా, 368 మంది డ్రైవర్లుగా, 445 మందికి శ్రామిక్/ అసిస్టెంట్ మెకానిక్‌లుగా ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయిస్తూ ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగ సంఘాల హర్షం

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు ఆమోదం తెలపడం పట్ల ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాయి. వివిధ కేటగిరీల్లో 1,168మందికి ఉద్యోగాలు కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయడంపై ధన్యవాదాలు తెలియజేశాయి. ఆర్టీసీ ఉద్యోగులపట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తోందనేందుకు ఇది నిదర్శనమంటూ నేషనల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న సమస్యను పరిష్కరించినందుకు ప్రభుత్వానికి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దామోదరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

కొత్త పాఠాలు.. కొంగొత్త విషయాలు

- 2024–25 నుండి ఎన్సీఈఆర్టీ కొత్త పాఠ్య పుస్తకాలు
- 20 ఏళ్ల తర్వాత కొత్త పుస్తకాలు
- ప్రింటుతో పాటు డిజిటల్ రూపంలోనూ అందుబాటులోకి
- 5వ తరగతి వరకు 22 భారతీయ భాషల్లో ముద్రణ
- ప్లే–వే పద్ధతి బోధనతో పుస్తకాలు
- బాలల్లో సమస్యల పరిష్కార మెళకువలు, సామాజిక భావోద్వేగ సామర్థ్యాల పెంపుపై దృష్టి



ప్రైవేటు పబ్లిషర్లకూ ఎన్ఈపీ మార్గదర్శకాలు

ప్రైవేటు పబ్లిషర్లు ముద్రించే వివిధ విద్యా సంబంధిత పుస్తకాలు జాతీయ విద్యా విధానాని (ఎన్ఈపీ)కి అనుగుణంగా ఉండేలా ఎన్సీఈఆర్టీ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే కొన్ని ప్రైవేటు పబ్లిషర్లు ప్రీస్కూల్, 1, 2 తరగతుల పుస్తకాలను ఎన్ఈపీకి అనుగుణంగా రూపొందిస్తున్నట్లు వివరించింది. మిగతా పబ్లిషర్లు కూడా ఎన్ఈపీ మార్గదర్శకాల ప్రకారం పుస్తకాలు ప్రచురిస్తున్నారా? లేదా అనే విషయాన్ని ఎన్సీఈఆర్టీ పరిశీలిస్తోంది.

సాక్షి, అమరావతి: నూతన జాతీయ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్కు– 2020 ప్రకారం పాఠశాల విద్యలో పాఠ్యాంశాల సవరణ ప్రక్రియను జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ) చేపట్టింది. 2024–25 విద్యా సంవత్సరం నుంచి నూతన పాఠ్య పుస్తకాలను అందుబాటులోకి తెస్తోంది. 'నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)కి అనుగుణంగా సవరించిన కొత్త పాఠ్యాంశాలు ఉంటాయని ఎన్సీఈఆర్టీ ప్రకటించింది. కోవిడ్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన పరిణామాలను దృష్టిలో ఉంచుకొని పాఠ్య పుస్తకాల రూపకల్పనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎన్సీఈఆర్టీ వినియోగిస్తోంది. విద్యా సంస్థలు తెరిచి ఉన్నా, తెరవలేని పరిస్థితులు వచ్చినా అభ్యసనకు ఆటంకం లేకుండా పాఠ్య పుస్తకాలను రూపొందిస్తోంది. కొత్త పుస్తకాలు ప్రింటుతో పాటు డిజిటల్ రూపంలోనూ అందుబాటులో ఉంటాయని ఎన్సీఈఆర్టీ వివరించింది. ఎవరైనా వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది.

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత 2024–25 విద్యా సంవత్సరం నుంచి అన్ని స్థాయిల్లోని పాఠశాల విద్యార్థులకు కొత్త పాఠ్య పుస్తకాలను ఎన్సీఈఆర్టీ రూపొందిస్తోంది. ఇప్పటివరకు ఎన్సీఈఆర్టీ ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ భాషల్లో మాత్రమే పాఠ్య పుస్తకాలను అందిస్తోంది. ఇప్పుడు 22 భారతీయ భాషల్లో వీటిని అందించనుంది. జాతీయ నూతన విద్యా విధానం ప్రకారం 5వ తరగతి వరకు మాతృ భాషల్లో బోధన సాగాలన్న నిబంధనను అనుసరించి ప్రీప్రైమరీ నుంచి 5వ తరగతి వరకు 22 భారతీయ భాషల్లో స్టడీ మెటీరియల్‌ను బాలలకు అందించనున్నట్లు ఎన్సీఈఆర్టీ వివరించింది. ఈ పుస్తకాలు ప్లే బుక్‌ల మాదిరిగా, నాటక ఆధారితంగా రూపొందిస్తున్నట్లు పేర్కొంది. ఈ పుస్తకాలు ప్లే–వే పద్ధతిలో ఉంటాయి. విద్యార్థుల్లో సమస్యలను పరిష్కరించే మెళకువలు, సామాజిక భావోద్వేగ సామర్థ్యాలను పెంపొందించేలా వీటిని రూపొందిస్తోంది. ఇప్పటికే ప్రీ–స్కూల్ నుండి 2వ తరగతి వరకు పుస్తకాల రూపకల్పనకు కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్కును ఎన్సీఈఆర్టీ విడుదల చేసింది. ఇతర తరగతుల కోసం ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందిస్తోంది.

15 కోట్ల పనిదినాల 'ఉపాధి'

- 2023–24 సంవత్సరం రాష్ట్ర లేబర్ బడ్జెట్‌కు కేంద్రం అనుమతి
- ఈ లక్ష్యం పూర్తయితే అదనపు పనిదినాలు కోరవచ్చని సూచన

సాక్షి, అమరావతి: ఏప్రిల్ ఒకటి నుంచి మొదలయ్యే 2023–24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం ద్వారా 15 కోట్ల పనిదినాల మేర గ్రామీణ ప్రాంత పేదలకు పనులు కల్పించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఆర్థిక సంవత్సరం మధ్యలో ఈ లక్ష్యం పూర్తయితే రాష్ట్రం అదనపు పనిదినాలు కోరవచ్చని పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర లేబర్ బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ అమరేంద్ర ప్రతాప్‌సింగ్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. కేంద్రం ప్రతి ఏటా రాష్ట్రాలకు జరిపే ఉపాధి హామీ పథకం కేటాయింపులను నిధుల రూపంలో కాకుండా పేదలకు కల్పించే పనిదినాల ప్రాతిపదికన లేబర్ బడ్జెట్ కేటాయిస్తుంది. ఈ పథకంలో పనిచేసే కూలీలకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రోజుకు గరిష్టంగా రూ. 272 చొప్పున వేతనంగా చెల్లిస్తారు. శుక్రవారంతో ముగిసిన 2022–23 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రాష్ట్రానికి ఉపాధి హామీ పథకం లేబర్ బడ్జెట్‌ను మొదట 14 కోట్ల పనిదినాలకే ఆమోదం తెలిపింది. అయితే, కేవలం ఐదు నెలల్లోనే రాష్ట్ర ప్రభుత్వం ఆ లక్ష్యం మేరకు పేదలకు పనులు కల్పించింది. లక్ష్యం పూర్తి కావడంతో రాష్ట్రానికి కేటాయించిన లేబర్ బడ్జెట్‌ను కేంద్రం దశలవారీగా పెంచుతూ పోయింది. మార్చి 30వ తేదీ నాటికి 23.88 కోట్ల పనిదినాలు కల్పించింది.

బీడీఎల్‌కు ఆకాశ్ క్షిపణుల తయారీ కాంట్రాక్ట్

సాక్షి, హైదరాబాద్: భారత ఆర్మీ అమ్ములపొదిలో కీలక అస్త్రమైన ఆకాశ్ క్షిపణుల తయారీ కాంట్రాక్ట్ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)కు దక్కింది. రూ.8161 కోట్ల విలువైన క్షిపణుల తయారీ ఆర్డర్‌కు సంబంధించి రక్షణశాఖ, బీడీఎల్ మధ్య గురువారం న్యూఢిల్లీలో ఒప్పందం కుదిరినట్టు బీడీఎల్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఆర్మీకి చెందిన మూడు, నాలుగు రెజిమెంట్లకు ఈ క్షిపణులను బీడీఎల్ సమకూర్చనుంది. భారీ ఆర్డర్ రావడంపై బీడీఎల్ చైర్మన్, ఎండీ సిద్ధార్థమిశ్రా సంతోషం వ్యక్తం చేశారు. భారీ సంఖ్యలో ఆకాశ్ క్షిపణుల తయారీ అవకాశం రావడం భారత ఆర్మీతోపాటు బీడీఎల్‌కు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

కలప స్మగ్లింగ్‌పై ఫ్రెంచ్ వెబ్ సిరీస్

సాక్షి, హైదరాబాద్: తెలుగు పాత్రికేయుడు ఉడుముల సుధాకర్‌రెడ్డి రచించిన 'బ్లడ్‌సాండర్స్ ది గ్రేట్ ఫారెస్ట్ హీస్ట్' అనే పుస్తకం ఆధారంగా ఫ్రెంచ్ వెబ్‌సిరీస్‌ను రూపొందించారు. ఏపీలోని విలువైన కలప స్మగ్లింగ్ కేసులకు సంబంధించి ఇంటర్‌పోల్ వెతుకుతున్న కరడుగట్టిన ఎర్రచందనం స్మగ్లర్ షాహుల్ హమీద్ చేసిన పర్యావరణ నేరాలపై 'ప్లానెట్ కిల్లర్స్ –ఎగ్జిక్యూషనర్ ఆఫ్ ఫారెస్ట్స్' అనే వెబ్‌సిరీస్ ఎపిసోడ్ ఫ్రెంచ్ టీవీలో ఏప్రిల్ 3న ప్రసారం కానుంది. డైరెక్టర్ హ్యూగోవాన్ ఆఫెల్ మీడియాతో మాట్లాడుతూ ఈ కలప ఏపీలోని శేషాచలం, వెలిగొండ, లంకమల, పాలకొండ అడవుల్లో లభిస్తుందన్నారు.

2026 నాటికి గ్రీన్ హైడ్రోజన్ హబ్ మొదటిదశ పూర్తి

- 2030 కల్లా రెండో దశ పూర్తిచేస్తాం
- ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వ సహకారం భేష్
- పర్యావరణ హితంగా ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుంది
- ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సిన్హా వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న సంజయ్‌కుమార్ సిన్హా, సంస్థ అధికారులు

సాక్షి, విశాఖపట్నం: గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఎన్టీపీసీ ఆధ్వర్యంలో గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టు పనులకు త్వరలోనే శ్రీకారం చుడతామని ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా వెల్లడించారు. విశాఖపట్నంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పూడిమడకలో నిర్మించే ఈ ప్రాజెక్టు మొదటి దశని 2026 నాటికల్లా పూర్తిచేస్తామని, 2030 నాటికి మొత్తం ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. దీని ద్వారా 50వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించి సాధ్యాసాధ్యాల అధ్యయనం, డీపీఆర్ సిద్ధమైన తర్వాత మొత్తం విలువని అంచనా వేయగలమన్నారు. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పర్యావరణహితంగా హబ్‌ను రూపొందిస్తామని, ప్రాజెక్టును పారిశ్రామిక, హైడ్రోజన్ ఏరియాగా రెండు ప్రధాన ప్రాంతాలుగా విభజించనున్నట్లు తెలిపారు. 600 ఎకరాల్లో విస్తరించే ఇండస్ట్రియల్ ఏరియాలో సోలార్ రూఫ్‌టాప్, ఇండస్ట్రియల్ స్పేస్, సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌తో కూడిన ప్రీ ఇంజినీరింగ్ భవనాలు, షెడ్లు ఉంటాయని సిన్హా వివరించారు. అదేవిధంగా ఎలక్ట్రోలైజర్స్, ఫ్యూయల్ సెల్స్, బ్యాటరీలు, సోలార్ వేఫర్స్, మాడ్యూల్స్, విండ్ టర్బైన్ పరికరాలు, కార్బన్ క్యాప్చర్ సిస్టమ్‌తో పాటు అధునాతన ఎనర్జీ టెక్నాలజీ యంత్రాలు కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు. అదేవిధంగా.. మిగిలిన 600 ఎకరాల హైడ్రోజన్ ఏరియాలో 1,500 టీపీడీ సామర్థ్యంతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని సిన్హా తెలిపారు.

లక్ష్యానికి చేరువలో విద్యుదుత్పత్తి

ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ జీఎం డీపీ పాత్రా, జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) వీఎం చౌదరి మాట్లాడుతూ.. 2022–23 ఆర్థిక సంవత్సరం నాటికి విశాఖ పరవాడలోని ఎన్టీపీసీఈసీ ఉత్పత్తి లక్ష్యం 12,632 మిలియన్ యూనిట్స్ ఉత్పత్తి కాగా.. ఎస్టీ–1లో 6,293.54, ఎస్టీ–2లో 6,276.06 కలిపి మొత్తం 12,569.6 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేపట్టామని తెలిపారు. సోలార్ జనరేషన్ 50.84 మిలియన్ యూనిట్లు కాగా.. 46.59 చేరుకున్నామని వారు వివరించారు. ఈ సమావేశంలో ఎన్టీపీసీ ఏజీఎంలు ఏపీ నాయర్, డా. వీ జయన్, రూమాదే శర్మ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రం తెచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్‌ను బ్లాక్ చేసుకొనే వీలు

తద్వారా ఫోన్‌లోని డేటా దుర్వినియోగం కాకుండా నియంత్రించే అవకాశం

పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు ఏ దశలో ఉందో కూడా తెలుసుకోవచ్చు

ఫోన్ దొరికాక అన్‌బ్లాక్ చేసుకొనే వెసులుబాటు

తెలుగు రాష్ట్రాల్లో అందుబాటులోకి వచ్చిన సేవలు

ఫోన్ పోయిందా ఇలా చేయండి

సాక్షి, హైదరాబాద్: మీ ఫోన్ ఈమధ్యే చోరీకి గురైందా? లేక ఎక్కడైనా పోగొట్టుకున్నారా? అందులోని డేటా దుర్వినియోగం కావొచ్చని ఆందోళన చెందుతున్నారా? ఇకపై మీకు ఆ భయం అక్కర్లేదు. ఎందుకంటే.. ఆ ముప్పు నుంచి మనల్ని బయటపడేసేందుకు కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని సాయంతో పోయిన లేదా చోరీకి గురైన ఫోన్‌ను ఇతరులు వాడకుండా మీరు బ్లాక్ చేయొచ్చు.

ఎలా ఉపయోగించాలంటే..

➤ మనం మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే కేంద్ర టెలికమ్యూనికేషన్ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సీఈఐఆర్ పోర్టల్‌లోకి వెళ్లి దాన్ని బ్లాక్ చేయవచ్చు. అంటే మన ఫోన్ ఇతరుల చేతుల్లోకి వెళ్లినా అది పనిచేయకుండా మనం నియంత్రించవచ్చన్న మాట. దీంతోపాటు పోగొట్టుకున్న ఫోన్‌కు సంబంధించి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చు. అదేవిధంగా ఫోన్ దొరికాక అన్‌బ్లాక్ సైతం చేసుకోవచ్చు. అయితే ఈ సేవలు పొందాలంటే ముందుగా కొన్ని వివరాలు తెలియజేయాలి. మీ మొబైల్ నంబర్, ఐఎంఈఐ నంబర్, మొబైల్ కొనుగోలు చేసిన ఇన్వాయిస్‌తోపాటు మీ సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కాపీని సీఈఐఆర్ పోర్టల్‌లో జత చేయాలి. వివరాలన్నీ అప్‌లోడ్ చేస్తే సీఈఐఆర్ సెంట్రల్ డేటాబేస్‌లో అప్పటికే నమోదై ఉన్న సదరు ఫోన్ పనిచేయకుండా బ్లాక్ లిస్ట్‌లో పెడతారు. మన ఫిర్యాదు స్థితిని తెలుసుకొనే ఆప్షన్ సైతం ఈ పోర్టల్‌లో ఉంది.

మార్చి 15 నుంచి అమల్లోకి..

➤ వాస్తవానికి సీఈఐఆర్ సేవలను కేంద్ర ప్రభుత్వం 2019 చివర్లోనే ప్రయోగాత్మకంగా అమల్లోకి తెచ్చింది. తొలుత కొన్ని రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి అక్కడ విజయవంతం అయ్యాక దశలవారీగా అన్ని రాష్ట్రాలకు విస్తరిస్తూ వస్తోంది. మార్చి 15 నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోనూ సీఈఐఆర్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ వెల్లడించింది. మార్చి 15 తర్వాత పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లకు సంబంధించి ఈ సేవలను వినియోగించుకోవచ్చు.

తెలంగాణ

ఏ సీమదానవో ఎగిరెగిరి వచ్చావు..

ముద్దు మాటలతో అలరిస్తున్న రామచిలుక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ముద్దుముద్దుగా పసిపిల్లలు అమ్మా.. అని పిలిస్తే చిలక పలుకులంటూ.. మురిసిపోతాం. అలాంటిది, నిజంగానే రామచిలుకే అమ్మా.. అంటుంటే.. కుటుంబ సభ్యుల్ని వారి పేర్లతో పిలుస్తుంటే.. ఆ ఆనందమే వేరు. వివరాలివి. సిద్దిపేట హౌసింగ్ బోర్డుకాలనీలోని జర్నలిస్ట్ వీధిలో కూతురు రాజిరెడ్డి, వనజ రెడ్డిల ఇంటి పైకి రోజూ ఓ రామచిలుక వచ్చి సందడి చేస్తోంది. నెల రోజులుగా రోజూ ఉదయం 6గంటలకే వచ్చి కుటుంబ సభ్యులను నిద్ర లేపుతుంది. చిన్నారులతో ఆడుకుంటుంది. వనజరెడ్డిని అమ్మా.. అని, పిల్లలను టింకు.. అని పిలుస్తుంది. ఎత్తుకో, టాటా, బాయ్ అంటుంది. దీంతో రాజిరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు, కాలనీవాసులు సంబరపడిపోతున్నారు.

ఉదయం ఆరు గంటల నుంచి 7.30 గంటల వరకు ఉండి పాలు, నీరు తాగుతుంది. జామ, మామిడి, ఆపిల్, తదితర పండ్లు, బిస్కెట్లు తిని వెళ్లిపోతుంది. సాయంత్రం 5గంటల సమయంలో వచ్చి మళ్లీ 6 గంటల వరకు తిరిగి వెళ్లిపోతుంది. ఈ చిలుక ఎక్కడి నుంచి వస్తుంది...ఎక్కడికి పోతుందనేది మాత్రం ఎవరికీ తెలియడం లేదు. నెల రోజులుగా ఈ రామచిలుక రాజిరెడ్డి, వనజరెడ్డిల కుటుంబ సభ్యుల్లో ఒకటిగా మారిపోయింది.



"శ్రీరాముడే వచ్చినట్టుంది

రామచిలుక రోజూ మా ఇంటికి వచ్చి అమ్మా.. అని పిలుస్తుంటే సంతోషంగా ఉంది. శ్రీ రామనవమి ముందు మా ఇంట్లోకి వచ్చింది కాబట్టి.. శ్రీ రాముడే వచ్చినట్టు అనిపిస్తోంది.

– వనజరెడ్డి, సిద్దిపేట"

ఇక టీఎస్‌పీఎస్సీ వంతు!

పేపర్ల లీకేజీ వ్యవహారంలో సెక్రెటరీ, సభ్యుడికి సిట్ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) పేపర్ల లీకేజీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, సభ్యుడు లింగారెడ్డి, చైర్మన్ జనార్దనరెడ్డిల వాంగ్మూలాలను నమోదు చేయాలని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ణయించింది. ఇందులో భాగంగా అధికారులు శుక్రవారం అనితా రామచంద్రన్, లింగారెడ్డిలకు నోటీసులు జారీ చేశారు. జనార్దనరెడ్డికి నోటీసులు ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ ముగ్గురికీ అనువైన సమయంలో సిట్ అధికారులే టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి వెళ్లి వాంగ్మూలాలు తీసుకోనున్నారు. ఇక లీకైన పేపర్ల 'మార్పిడి' మొత్తం హార్డ్ కాపీల (ప్రింటెడ్ కాపీల) రూపంలోనే జరిగిందని.. కేవలం ఇద్దరికి మాత్రమే ఎనీడెస్క్ అప్లికేషన్ ద్వారా అందిందని సిట్ అధికారులు తేల్చారు. రాజశేఖర్‌రెడ్డి తనకు కంప్యూటర్ యాక్సెస్ ఇచ్చినందుకు ప్రతిఫలంగా అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ) షమీమ్‌కు గ్రూప్–1 ప్రిలిమ్స్ ప్రశ్నపత్రం అందించాడని గుర్తించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943